



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 88 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ ఆదివారం 8 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 88 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD SUN 8 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




## జాతర ముగింపు.. టన్నుల కొద్దీ చెత్త, జంతు వ్యర్థాలతో...

# మురికికూపంలా మేడారం

- మేడారం మహాజాతర ముగింపుతో భారీగా పేరుకుపోయిన వ్యర్థాలు
- సుమారు 3 వేల టన్నుల చెత్త పోగైనట్లు అధికారుల అంచనా
- శుభ్రం చేసేందుకు రంగంలోకి దిగిన 6 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు
- జంతు వ్యర్థాలు చూసి వాంతులొస్తున్నాయని కార్మికుల ఆవేదన
- వ్యర్థాల్లో 48 శాతం ప్లాస్టిక్, గాజు సీసాలు ఉండటంపై ఆందోళన

- మిగతా 2లో

# ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం

### ఫోరెన్సిక్ ల్యాబ్ లో అగ్నిప్రమాదంపై అనుమానాలు



- నాంపల్లిలోని ఫోరెన్సిక్ ల్యాబ్ లో అగ్నిప్రమాదం
- ఓటుకు నోటు కేసు వాయిస్ రికార్డింగులను నాశనం చేసే ప్రయత్నంగా కనిపిస్తోందన్న కేటీఆర్
- షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని అంచనా వేస్తున్న అధికారులు




- బిల్డింగ్ ను కమ్మేసిన పొగ
- బయటకు పరుగులు పెట్టిన సిబ్బంది
- మంటలు ఆర్పేసిన అగ్నిమాపక శాఖ సిబ్బంది
- ఫోరెన్సిక్ ల్యాబ్‌లోని సీజ్డ్ ప్రాపర్టీస్ గదిలో అగ్ని ప్రమాదం
- 1980ల నాటి భవనమని వెల్లడించిన ఫైర్ డీజీ విక్రమ్ సింగ్
- చివరి గదిలో స్విచ్ బోర్డు వద్ద షార్ట్ సర్క్యూట్ అయినట్లు వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:**నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై ఫైర్ డీజీ విక్రమ్ సింగ్ స్పందించారు. ఈ ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఫోరెన్సిక్ ల్యాబ్‌లోని సీజ్డ్ ప్రాపర్టీస్ గదిలో అగ్నిప్రమాదం జరిగింది. ఈ గది పూర్తిగా దగ్ధమైనట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదం జరిగిన వెంటనే ఫైర్ డీజీ విక్రమ్ సింగ్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఈ ఫోరెన్సిక్ భవనం చాలా పాతదని, దీనిని 1980లలో నిర్మించారని తెలిపారు.

- మిగతా 2లో



### గుర్తు పెట్టుకోండి..

## తెలంగాణలో మళ్లీ గెలిచేది కాంగ్రెస్సే

**హైదరాబాద్ పెన్ పవర్:** కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, కల్లకుంట్ల కిషన్ రావు గుర్తు పెట్టుకోండి తెలంగాణలో మళ్లీ గెలిచేది కాంగ్రెస్సేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఐదేండ్ల కోసం ఎన్నికైనం.. మరో ఐదేళ్లు పదవిలో ఉంటామని ధీమా వ్యక్తం చేశారు. పదేళ్లు పవర్‌లో ఉన్న బీఆర్ఎస్.. 12 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ఏనాడు మన సమస్యలని పట్టించుకోలేదని విమర్శించారు. శనివారం (ఫిబ్రవరి 7) ప్రజా పాలన ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లా పరిగి మండలం నారాయణపూర్‌లో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. అనంతరం బహిరంగా సభలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ను ఓడించేం దుకు బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నాయని ఆరోపించారు. మూసీ నది ప్రక్షాళన చేస్తామంటే బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని..

- మిగతా 2లో

## భారత వ్యాక్సిన్లు రాకపోవడం మా ఆర్థిక వ్యవస్థకు భారంగా మారింది

- భారత్ నుంచి అందుబాటు ధరలో లభించే వ్యాక్సిన్ల సరఫరా నిలిచిపోయిందని వెల్లడి
- వ్యాక్సిన్ల దిగుమతి కోసం వందల మిలియన్ డాలర్లు ఖర్చవుతున్నాయన్న మంత్రి
- కరోనా సమయంలో భారత్ నుంచి కొవిడ్ వ్యాక్సిన్లు వచ్చినట్లు వెల్లడి

- మిగతా 2లో



## మున్సిపల్ ఎన్నికలు క్లీన్ స్వీప్ చేయబోతున్నం

**హైదరాబాద్ పెన్ పవర్:** త్వరలో జరగనున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో క్లీన్ స్వీప్ చేయబోతున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం (ఫిబ్రవరి 7) జగిత్యాల జిల్లాలో మంత్రి ఉత్తమ్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

- మిగతా 2లో





## నమ్మకమే మనకు అతి పెద్ద కరెన్సీ

### మలేషియాలో ప్రధాని మోదీ

- మలేషియా పర్యటనలో మోదీకి ఘన స్వాగతం
- భారత్–మలేషియా బంధానికి 'ఇంపాక్ట్' మార్గదర్శి అని వెల్లడి
- మలేషియాలోని భారత సంతతి సేవలను కొనియాడిన ప్రధాని
- మలయా యూనివర్సిటీలో తిరువళ్లువర్ సెంటర్ ఏర్పాటుకు హామీ

- మిగతా 2లో



### ముఖ్యమంత్రికి చేతకాక

## నిందలు వేస్తున్నారు

- కేసీఆర్‌ను కాపాడుతున్నారన్న రేవంత్ రెడ్డి... తీవ్రంగా స్పందించిన కిషన్ రెడ్డి
- కేసీఆర్‌పై చర్యలు తీసుకుంటామంటే ఎవరు అడ్డుకుంటారని ప్రశ్న
- మోదీని అడ్డుకోవడం కోసం సోనియా, కేసీఆర్ కుటుంబం కలిసిందన్న కిషన్ రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:**మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీశ్ రావులను ఎప్పుడు అరెస్టు చేస్తారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ప్రశ్నించడం తెలిసిందే. వారిని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కాపాడుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ ఆరోపణలపై కిషన్ రెడ్డి స్పందించారు.

- మిగతా 2లో

## ఎలాన్ మస్క్ స్పేస్‌ఎక్స్‌లో చైనా పెట్టుబడులు..

### అమెరికా భద్రతకు ముప్పంటూ సెనేటర్ల ఆందోళన

- స్పేస్‌ఎక్స్‌పై సమీక్ష జరపాలని అమెరికా సెనేటర్ల డిమాండ్
- కంపెనీలో చైనా రహస్యంగా పెట్టుబడులు పెట్టిందని ఆరోపణ
- ఇది అమెరికా జాతీయ భద్రతకు ముప్పు అని తీవ్ర ఆందోళన
- విషయంపై రక్షణ శాఖకు లేఖ రాసిన ఇద్దరు డెమొక్రటిక్ సెనేటర్లు

- మిగతా 2లో





## 'అరెస్ట్' ఎప్పుడు చేయాలంటే.. పోలీసులకు సుప్రీం కీలక ఆదేశాలు



- ప్రశ్నించాలనే కారణంతో అరెస్ట్ చేస్తానంటే కుదరదని హెచ్చరిక
- ఏడేళ్లలోపు శిక్ష పడే కేసుల్లో ఇష్టారీతిన అరెస్టులు సరికాదని వ్యాఖ్య
- దర్యాప్తుకు తప్పనిసరి అని భావించినపుడే అరెస్ట్ చేయాలని సూచన

**హైదరాబాద్ పెన్ పవర్:**కేసు విచారణలో భాగంగా ఎవరినైనా ప్రశ్నించేందుకు అరెస్టు చేయడం సరికాదని దేశ అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ముఖ్యంగా ఏడేళ్ల లోపు శిక్ష పడే అవకాశం ఉన్న కేసుల్లో ఎడాపెడా అరెస్టులు కుదరవని స్పష్టం చేసింది. కేవలం ప్రశ్నించాలనే కారణంతో అరెస్టు చేయడాన్ని తప్పుబట్టింది. దర్యాప్తులో భాగంగా తప్పనిసరి అని భావించినపుడు ముందస్తుగా నోటీసు జారీ చేశాక అరెస్టు చేయాలని పోలీసులకు సూచించింది.భారత న్యాయ సంహిత ప్రకారం నోటీసులు జారీ చేసినప్పటికి అరెస్టు తప్పనిసరి కాదని తేల్చిచెప్పింది.

- మిగతా 2లో



### తెలంగాణ, మహారాష్ట్ర మధ్య

## నీటి గొడవలు లేవు

**హైదరాబాద్ పెన్ పవర్:**గోదావరి జలాల విషయంలో తెలంగాణ, మహారాష్ట్ర మధ్య ఎలాంటి గొడవలు లేవన్నారు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాగజ్‌నగర్ లో జరిగిన సభలో పాల్గొన్న ఫడ్నవీస్.. గోదావరి జలాలను ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా.. మేం నీళ్లు ఇవ్వడం వల్లే తెలంగాణ సస్యశ్యామలంగా ఉంది. మాకు నష్టం జరిగినా నీళ్లు ఇస్తున్నామన్నారు. అందరూ

- మిగతా 2లో

# మురికికూపంలా మేడారం

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర వైభవంగా ముగిసింది. అయితే, కోట్లాదిగా తరలివచ్చిన భక్తులు వెనుదిరిగిన అనంతరం మేడారం పరిసరాలు టన్నుల కొద్దీ చెత్తతో నిండిపోయాయి. ఈ వ్యర్థాలను తొలగించడం ఇప్పుడు అధికార యంత్రాంగానికి, పారిశుద్ధ్య సిబ్బందికి పెను సవాల్‌గా మారింది. మేడారంతో పాటు కన్నెపల్లి, నార్లాపూర్, కొంగల గట్టు వంటి ప్రాంతాల్లో దాదాపు 3 వేల టన్నుల చెత్త పేరుకుపోయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా జంతు, కోళ్ల వ్యర్థాలు కుళ్లిపోవడంతో ఆ ప్రాంతమంతా తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఈ నేపథ్యంలో సుమారు 6 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు యుద్ధప్రాతిపదికన శుభ్రతా కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. అయితే, ఈ పనుల్లో పాల్గొంటున్న కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "రోడ్లు, ప్లాస్టిక్ క్లీనింగ్ అని చెప్పి ఇక్కడికి తీసుకొచ్చారు. కానీ ఇక్కడ జంతువుల తోళ్లు, తలకాయలు, కోళ్ల వ్యర్థాలు గుట్టలుగా పడి ఉన్నాయి. వాటిని చూస్తుంటేనే వాంతులు వస్తున్నాయి. ఇంత గలీజు పని మేమెప్పుడూ చేయలేదు" అని కొందరు కార్మికులు వాపోయారు. అమ్మవార్ల దయతోనే ఈ పని చేస్తున్నాం అని వారు కన్నీటిపర్యంతమయ్యారు. జాతరలో పోగైన వ్యర్థాల్లో దాదాపు 48 శాతం ప్లాస్టిక్, గాజు సీసాల వంటివి ఉండటం ఆందోళన కలిగిస్తోంది. సుమారు 100 టన్నుల ఖాళీ బాటిళ్లలో చాలా వరకు పగిలిపోయి ప్రమాదకరంగా మారాయి. మిగిలిన 52 శాతం బియ్యం, బెల్లం వంటివి భూమిలో కలిసిపోయేవిగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ వ్యర్థాలను వేరు చేసి, మేడారం ప్రాంగణాన్ని శుభ్రపరిచే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

## ఎడిటర్ వ్యూ

# అంగరంగ వైభవంగా శ్రీశైల బ్రహ్మోత్సవాలు

తెలుగు నేలపై కొలువైన దివ్యక్షేత్రం శ్రీశైలం. జ్యోతిర్లింగం, శక్తిపీఠం ఒకే గిరిశృంగం ద వెలసిన పరమ పవిత్ర స్థలంగా భాసిల్లుతున్న క్షేత్రం. పన్నెండు జ్యోతిర్లింగాలలో రెండవది, శ్రీభ్రమరాంబా దేవికి నెలవైన శక్తిపీఠం. శైవక్షేత్రాల్లో తలమానికం. మల్లికార్జున మహాలింగ చక్రవర్తి కొలువై ఉండి, సకల లోకారాధ్యంగా, త్రైలోక్య పూజితంగా విరాజిల్లు తున్నది. సంకల్ప, పూజా సందర్భాలలో శ్రీశైలానికి ఏ దిగ్భాగంలో ఉన్నామో భగవంతునికి తెలియ చేసుకునే సాంప్రదాయాన్ని బట్టి క్షేత్ర ప్రాధాన్యత స్పష్టం అవుతున్నది. పురాణాల్లో వర్ణితమైన ఎనిమిది శృంగాలతో, నలభై నాలుగు నదులు, అరవై కోట్ల తీర్థరాజాలు, పరాశర, భరద్వాజాది మహర్షుల తపోవన సీమలతో, చంద్ర, సూర్య కుండాది పుష్కరిణులతో, లతలు, వృక్ష సంతతులు, అనేక లింగాలు, అద్భుత ఔషధాలు కలిగి శ్రీశైల మల్లన్న దేవుని సన్నిధికి చేర్చే దారి అత్యంత ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. బ్రహ్మగిరి, విష్ణుగిరి, రుద్రగిరి అనే మూడు పర్వతాలకు పాదాభివందనం చేస్తూ వేదఘోషను ప్రతిధ్వ నింప చేస్తూ, పాతాళగంగ నామాంకిత అయిన కృష్ణవేణీ నది ఈ ప్రదేశంలో ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్నది. అష్టాదశ పురాణాల్లోనూ భారత రామాయణాది ఇతిహాసా ల్లోనూ శ్రీశైల వైభవం వర్ణించ బడింది. కృతయుగంలో హిరణ్య కశిపుడు శ్రీశైలాన్ని తన పూజా మందిరంగా చేసుకొన్నాడు. పురాణాల ప్రకారం సీతారాములు ప్రతిష్ఠించిన సహస్ర లింగాలు, పాండవులు భక్తితో స్థాపించిన సద్యోజాత లింగం, పంచపాండవ లింగాలు పూజార్హత కలిగి అలరారు తున్నాయి. సంస్కృత, ఆంధ్ర, కన్నడ, మరాఠీ గ్రంథాల్లో ఈ క్షేత్రాన్ని గురించిన వర్ణనలున్నాయి. పలు భాషల కవులు క్షేత్ర ప్రాధాన్యతను అభివర్ణించారు. స్కాంద పురాణంలోని శ్రీశైల ఖండం, ఈ క్షేత్ర మహత్తును వివరిస్తోంది. ఈ క్షేత్ర ప్రశాంతతకు ముగ్ధులైన ఆది శంకరులు కొంత కాలం ఇక్కడ తపస్సు చేసి, శివానంద లహరిని రచించి, మల్లి కార్జునుడికి సమర్పించి, భ్రమరాంబ సన్నిధిలో శ్రీ చక్రాన్ని ప్రతిష్ఠించారు. దత్తావతార పరంపరలో భక్తుల పూజలందుకొనే నృసింహ సరస్వతీ స్వామి శ్రీశైల మహత్యాన్ని వివరి స్తూ తన పాదుకల్ని పట్టుకొన్న తంతుడు అనే భక్తుడికి ఈ క్షేత్ర దర్శన భాగ్యాన్ని కలిగించినట్లు గురుచరిత్ర చెబుతోంది. నృసింహ సరస్వతి స్వామి ఇప్పటికీ కదళీవనంలో గుప్తరూపంలో ఉన్నట్లు దత్తాత్రేయ భక్తులు విశ్వసిస్తారు. శ్రీశైల క్షేత్రాన్ని దర్శించి ఇక్కడి మఠాలలో ఉన్న సాధకులు, యోగుల వసతి కోసం క్రీస్తుపూర్వం నుంచి అనేక రాజవంశాలు ఎన్నో దానాలను గావించి నట్లు శిలాశాసనాలు, చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఇక్ష్వాకులు, శాతవాహనులు, విష్ణుకుండినులు, పల్లవులు, రాష్ట్ర కూటులు, చాళుక్యులు, కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర సామ్రాజ్యాధీశులు, భ్రమరాంబికా సమేతులైన మల్లికార్జునుణ్ణి దర్శించి భక్తుల సౌకర్యాలకు ఎన్నో ఏర్పాట్లు, అశేష వస్తుసంపదలు సమర్పించారు. శ్రీశైలంలో పంచ మఠాలు ప్రాచీన మైనవి. మొదటిదైన ఘంటామఠం - శ్రీశైల ఆలయానికి వాయువ్య దిశగా ఉంది. శివ సాధకుడైన ఘంటాకర్ణ సిద్దేశ్వరుడు తన శిష్యులతో కలిసి దీనిని ఏర్పాటు చేశారు. రెండోదైన విభూతి మఠం, శ్రీకృష్ణ దేవరాయల కాలపు వీరశైవుడైన శాంతి మల్లయ్య అనే వ్యక్తి పేరు దుగా ఏర్పడినట్లు పరిశోధనలు వివరిస్తున్నాయి. మూడోదైన రుద్రాక్ష మఠాన్ని మల్లి శంకరస్వామి అనే భక్తుడు నిర్మించాడని తెలుస్తోం ది. ఇక్కడికి వచ్చే భక్తులకు అతడు రుద్రాక్షలను పంచిపెడు తుండేవాడని స్థానికులు చెబుతుంటారు. నాలుగోదైన సారంగ మఠాన్ని సారంగేశ్వరముని నిర్మించాడని చరిత్ర చెబుతోంది. దీనికి సంబంధించిన లిఖిత ఆధారంగా క్రీ.శ.1585 నాటి శాసనం మఠంలో లభ్యమైంది. అయిదోదైన నంది మఠంలో నందికేశ్వరుడు అనే యోగి సుదీర్ఘకాలం జీవించాడు. ఇది ఘంటా మఠానికి వైపు ఉండేది. ఇవే కాకుండా శ్రీశైలంలో పలు మఠాలు ఉండేవి. వాటిలో వీరశైవ సిద్ధాంత భిక్షావృత్తి మఠం ప్రసిద్ధమైంది. క్రీ.శ. 1518లో దీనిని సిద్ధ భిక్షావృత్తి భార్య, శిష్యుడు పర్వతయ్యలు ఏర్పాటు చేసినట్టుగా తెలుస్తోంది. దీనికి చాలాకాలం ముందే 3వ కుళోత్తుంగ చోళుడు ఒక మఠాన్ని క్రీ.శ. 1178-1216 మధ్య కాలంలో ఏర్పాటు చేసినట్టుగా చరిత్ర చెబుతోంది. వటసిద్ధి మఠం, చంద్రమఠం, కమరీ మఠం అనే మఠాలు భక్తులకు అన్నవసతి ఏర్పాటు చేసినట్టుగా తెలుస్తోంది. ఇంకా అనేక మఠాలు పదహారో శతాబ్దికి పూర్వం నుంచే ఇక్కడ ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న శ్రీశైల క్షేత్రంలో ఫిబ్రవరి 8తేదీ నుండి నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా 8న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అధికారులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శ్రీశైలం క్షేత్ర మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున సీఎం పట్టువస్త్రాలు అందజేస్తారు. 15వ తేదీన మహా శివరాత్రి ప్రత్యేక పూజా కార్యక్రమాలు. ప్రభోత్సవం, నంది వాహన సేవ. లింగోద్భవ కాలంలో మహారుద్రాభిషేకం, కళ్యాణోత్సవం నిర్వహించ నున్నారు. ఈ ఉత్సవాల్లో స్వామి వారు వివిధ వాహనాలను అధిరోహించి, తిరు వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అనుగ్రహం కలిగిస్తారు. ప్రత్యేకించి మహాశివరాత్రి నాడు స్వామి వారికి ప్రభోత్సవం, నందివాహన సేవలతో పాటు అనేక విశేష కార్యక్రమాలను నిర్వహిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ కారణంగా స్వామి వారి అలంకార దర్శనానికి మాత్రమే అనుమతి ఉంటుంది. జ్యోతిర్ముడి కలిగిన శివ స్వాములకు మాత్రమే నిర్దిష్ట వేళల్లో ఉచిత స్పర్శ దర్శనానికి అవకాశం ఉంటుంది.

# ముఖ్యమంత్రికి చేతకాక నిందలు వేస్తున్నారు

- మొదటి పేజి తరువాయి

ముఖ్యమంత్రికి చేతకాక వారిపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కానీ బాధ్యతారాహిత్యంతో తమపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌తో కలిసి ఉన్నామని చెప్పుకోవాలని వ్యాఖ్యానించారు. కిషన్ రెడ్డి వల్లనో, కేంద్ర ప్రభుత్వం వల్లనో చర్యలు తీసుకోవడం లేదని మాపై నిందలు వేయవద్దని అన్నారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, కేసీఆర్‌పై చర్యలు తీసుకుంటానంటే రేవంత్ రెడ్డిని ఎవరు అడ్డుకున్నారో చెప్పాలని నిలదీశారు. రాష్ట్రంలో చర్యలు తీసుకోవాల్సింది ముఖ్యమంత్రి, ఇక్కడి ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. తన పేరు లేదా కేంద్రం పేరు చెప్పి రేవంత్ రెడ్డి ఎక్కువ రోజులు తప్పించుకోలేరని అన్నారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలని ఏ ఒక్కరోజైనా రాహుల్ గాంధీ రేవంత్ రెడ్డిని ప్రశ్నించారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీని అడ్డుకోవడం కోసం సోనియా గాంధీ కుటుంబం, కేసీఆర్ కుటుంబం ఒక్కటయ్యాయని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

# భారత వ్యాక్సిన్లు రాకపోవడం మా ఆర్థిక వ్యవస్థకు భారంగా మారింది

పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ నుంచి అందుబాటు ధరల్లో లభించే వ్యాక్సిన్ల సరఫరా నిలిచిపోవడం పాకిస్థాన్‌కు ఆర్థికంగా భారంగా మారిందని ఆ దేశ ఆరోగ్య మంత్రి ముస్తఫా కమల్ వెల్లడించారు. భారత వ్యాక్సిన్లు గత ఏడాది నుంచి రావడం లేదని అన్నారు. వీటి దిగుమతి కోసం వందల మిలియన్ డాలర్లు ఖర్చవుతోందని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు పెను భారంగా మారిందన్నారు.

ప్రస్తుతం ప్రతి సంవత్సరం 400 మిలియన్ డాలర్లతో వ్యాక్సిన్లను దిగుమతి చేసుకుంటున్నామని, వీటిలో 49 శాతం ఖర్చులను 'గావీ' (గ్లోబల్ అలయన్స్ ఫర్ వ్యాక్సిన్ అండ్ ఇమ్యునైజేషన్) ద్వారా పని చేసే అంతర్జాతీయ సంస్థలు, మిగతా 51 శాతం ప్రభుత్వం భరిస్తోందని వెల్లడించారు. స్థానికంగా వ్యాక్సిన్ ఉత్పత్తి ప్రారంభించకపోతే 2031 నాటికి దిగుమతి కోసం రూ.10 వేల కోట్ల వరకు ఖర్చు పెట్టాల్సి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పటికి వ్యాక్సిన్ల సరఫరాకు అంతర్జాతీయ సహకారం ముగిసిపోతుందని అన్నారు. అత్యంత పేద దేశాల్లోని పిల్లలకు వ్యాక్సిన్ అందించడానికి 'గావీ' పనిచేస్తుంది. 'గావీ' సాయంతో పాకిస్థాన్ అత్యంత చౌకగా టీకాలను సేకరించేది. వీటిలో ఎక్కువగా భారత్ నుంచే వస్తాయని, అవి అందుబాటు ధరల్లో ఉంటాయని పాకిస్థాన్ మంత్రి

వెల్లడించారు. కరోనా సమయంలో లక్షలాది కొవిడ్ వ్యాక్సిన్లను భారత్ నుంచి సేకరించడానికి 'గావీ' సహాయం చేసిందని అన్నారు. పాకిస్థాన్ ప్రభుత్వం ప్రస్తుతం పౌరులకు 13 రకాల వ్యాక్సిన్లను ఉచితంగా అందిస్తోంది. అయితే ఏ వ్యాక్సిన్‌ను కూడా స్థానికంగా ఉత్పత్తి చేయడం లేదు. 24 కోట్ల జనాభాతో ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన ఐదో దేశంగా పాకిస్థాన్ ఉంది. ప్రతి సంవత్సరం 62 లక్షల జననాలు నమోదవుతుండటంతో వ్యాక్సిన్లకు డిమాండ్ పెరిగింది.

# నమ్మకమే మనకు అతి పెద్ద కరెన్సీ

ప్రపంచ వృద్ధికి భారత్ ఒక విశ్వసనీయ భాగస్వామిగా నిలుస్తోందని, నమ్మకమే దేశానికి 'అతిపెద్ద కరెన్సీ'గా మారిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా శనివారం మలేషియా చేరుకున్న ఆయన, కౌలాలంపూర్‌లో భారత సంతతిని ఉద్దేశించి ప్రసంగించారు. యూకే, యూఏఈ, ఆస్ట్రేలియా, అమెరికా వంటి దేశాలు భారత్‌తో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయని, ఇది మన దేశంపై ప్రపంచానికి ఉన్న నమ్మకాన్ని సూచిస్తోందని తెలిపారు. ఈ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీకి మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం విమానాశ్రయంలోనే సాదర స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతలు ఒకే కారులో కార్యక్రమ వేదికకు చేరుకోవడం విశేషం. భారత్-మలేషియా సంబంధాలకు 'ఇంపాక్ట్' (×వీూాజు – ×అఎఖు మీుశ్రీఖుఎంఖు ౹ఖుతీఅవతీంష్త్రఅజూ టశీతీ ాాఒజుఖుఅఒఅఅస్త్ర జశీశ్రీశ్రీవష్ఒఅజవ ౧తీఖుఅంటశీతీఎ్ఖఅశీఅ) అనే పదం మార్గనిర్దేశం చేస్తుందని మోదీ తెలిపారు. భారత్ విజయం మలేషియాకు, ఆసియాకు కూడా విజయమని ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద భారత సంతతి మలేషియాలో ఉందని, వారు ఇరు దేశాల మధ్య బలమైన వారధిగా నిలుస్తున్నారని మోదీ ప్రశంసించారు. మలేషియాలోని 500కి పైగా పాఠశాలల్లో భారతీయ భాషలను బోధిస్తున్న విషయాన్ని తాను 'మన్ కీ బాత్' కార్యక్రమంలో పంచుకున్నట్లు గుర్తుచేశారు. శతాబ్దాలుగా భారతీయ సంప్రదాయాలను కాపాడుతున్న తీరు అద్భుతమని కొనియాడారు.

ముఖ్యంగా, తమిళ సమాజం శతాబ్దాలుగా ఇక్కడ సేవలు అందిస్తోందని చెబుతూ, మలయా యూనివర్సిటీలో తిరువళ్ళువార్ చైర్‌ను ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. ఈ వారసత్వాన్ని మరింత బలోపేతం చేసేందుకు త్వరలో తిరువళ్లువర్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మలేషియాలోని భారతీయులంతా తమ మిత్రులతో కలిసి 'ఇన్‌క్రెడిబుల్ ఇండియా'ను సందర్శించాలని మోదీ ఆహ్వానించారు.

# ఫోరెన్సిక్ ల్యాబ్ లో అగ్నిప్రమాదంపై అనుమానాలు

హైదరాబాద్ నాంపల్లిలో ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్ లో అగ్నిప్రమాదం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనుమానాలు వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... ఓటుకు నోటు కేసుకు సంబంధించిన వాయిస్ రికార్డింగులను, ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆధారాలు లేకపోవడాన్ని కప్పిపుచ్చేందుకు చేసిన ప్రయత్నంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. ఇదే అంశంపై బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ స్పందిస్తూ... ల్యాబ్ మొత్తం కాలిపోతోందని, ఏయే ఆధారాలు నాశనం చేశావు అంటూ రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు.

ప్రమాదం వివరాల్లోకి వెళితే... ల్యాబ్ లోని తొలి అంతస్తులో ఉన్న కంప్యూటర్ ల్యాబ్ లో తొలుత మంటలు చెలరేగాయి. నిమిషాల వ్యవధిలోనే భవనంలోని ఇతర ప్రాంతాలకు మంటలు వ్యాపించాయి. అగ్నిప్రమాదం కారణంగా ల్యాబ్ లోని కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయాయి. కార్యాలయ సిబ్బంది ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఐదు ఫైరింజన్లతో అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం చోటుచేసుకుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. కీలకమైన కేసులు, ఫోరెన్సిక్ ఆధారాలకు సంబంధించిన డాక్యుమెంట్లు దెబ్బతిన్నాయా? అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు.

# గుర్తు పెట్టుకోండి.. తెలంగాణలో మళ్లీ గెలిచేది కాంగ్రెస్సే

- మొదటి పేజి తరువాయి

అభివృద్ధి పనులకు కాళ్లల్లో కట్టెలు పెడుతున్నాయని విమర్శించారు. ప్రధాని మోడీని చూసి బీజేపీకి ఓటేయాలని తెలంగాణ బీజేపీ నేతలు అంటున్నారు. ఎక్కడైనా పెళ్లి పెద్దను చూసి పిల్లను ఇస్తామా అని ఎద్దేవా చేశారు. బీజేపీకి ఓటేస్తే ఢిల్లీ నుంచి మోడీ వచ్చి సమస్యలు తీర్చుతారా అని ప్రశ్నించారు. మోడీని చూసి ఓటేస్తే ఇక్కడి బోడీలు పని చేయరని టీ బీజేపీ నేతలను విమర్శించారు.

**పెళ్లాం మొగుళ్ల మాటలు కూడా విన్నరు:**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫోన్ ట్యాపింగ్ పేరుతో పెళ్లాంమొగుళ్ల మాటలు కుడా విన్నరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అనైతిక పనులు, తప్పులు చేస్తే నోటీసులు ఇవ్వకపోతే ఏం చేస్తారని ప్రశ్నించారు. కేసీఆర్ చరిత్ర దొంగ పాసుపోర్టులు, దొంగ నోట్లు అని.. ఆయన చరిత్ర తూడ్చినా పోదని అన్నారు. అలాంటి చరిత్రను నేనేందుకు తూడ్చుతానన్నారు. దళితలను సీఎం చేస్తానన్న మీ చరిత్రను నేనేలా తూడ్చుతానని.. కేసీఆర్ తెలంగాణ ద్రోహిగా మిగిలిపోతారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. మొఖం చెల్లకే కేసీఆర్ అసెంబ్లీకి రావట్లేదని విమర్శించారు. రెండేళ్ల పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చాం. గత పాలకులు చేసిన తప్పులను సరిదిద్దుకుంటూ ముందుకెళ్తున్నామని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలంతా ఆలోచించి ఓటేయాలని సూచించారు.

# మున్సిపల్ ఎన్నికలు క్లీన్ స్వీప్ చేయబోతున్నాం

- మొదటి పేజి తరువాయి

12 సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణకు నామమాత్రపు నిధులే వచ్చాయని అన్నారు.

2014 రాష్ట్ర విభజన హామీల నిధులు ఇప్పటివరకు రాలేదని.. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రజల్లో సానుకూల వాతావరణం ఉందన్నారు. 200 యూనిట్ల ఫ్రీ కరెంట్, ఫ్రీ బస్, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు లాంటి సంక్షేమ పథకాలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయని అన్నారు.

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను అభివృద్ధి చేయడానికి మునుముందు వేల కోట్లతో ప్రతిపాదనలు చేయబోతున్నామని తెలిపారు. రాను రాను తెలంగాణలో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాల్లో నివసించడానికి ప్రజలు మొగ్గు చూపుతున్నారన్నారు. దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పట్టణాలను అభివృద్ధి చేయడానికి బడ్జెట్‌లో వేలకోట్లతో ప్రతిపాదనలు పెట్టి రోడ్లు, డ్రైనేజీలు, విద్య, వైద్యం లాంటి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తోందని చెప్పారు.

# ఎలాన్ మస్క్ స్పేస్‌ఎక్స్‌లో చైనా పెట్టుబడులు..

బిలియనీర్ ఎలాన్ మస్క్ నేతృత్వంలోని ఏరోస్పేస్ సంస్థ 'స్పేస్‌ఎక్స్' వ్యవహారంపై సమీక్ష జరపాలని ఇద్దరు అమెరికన్ డెమొక్రటిక్ సెనేటర్లు డిమాండ్ చేశారు. ఈ సంస్థలో చైనాకు చెందిన పెట్టుబడిదారులు రహస్యంగా వాటాలు కొనుగోలు చేశారని, ఇది అమెరికా జాతీయ భద్రతకు పెను ముప్పుగా పరిణమించే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు రక్షణ శాఖ (ఋాణ) కార్యదర్శి పీట్ హెగ్సెత్‌కు వారు లేఖ రాశారు. మసాచుసెట్స్ సెనేటర్ ఎలిజబెత్ వారెన్, న్యూజెర్సీ సెనేటర్ ఆండీ కిమ్.. రక్షణ శాఖకు రాసిన లేఖలో ఈ ఆందోళనలను ప్రస్తావించారు. స్పేస్‌ఎక్స్ రక్షణ శాఖకు ఒక ప్రధాన కాంట్రాక్టర్‌గా ఉందని గుర్తుచేశారు. ఇటీవల బయటపడిన కోర్టు రికార్డులు, మార్చిలో వచ్చిన ఒక ప్రోపబ్లికా పరిశోధనాత్మక కథనాన్ని వారు తమ లేఖలో ఉటంకించారు. ఆఫ్‌షోర్ ఖాతాల ద్వారా స్పేస్‌ఎక్స్‌లో చైనా పెట్టుబడిదారులకు వాటాలు కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నారని ఈ నివేదికలు ఆరోపిస్తున్నాయి. "వ్యూహాత్మక రంగాల్లో ప్రత్యర్థి దేశాల నుంచి వచ్చే విదేశీ పెట్టుబడుల విషయంలో ప్రభుత్వ విధానాలకు ఇది విరుద్ధం. కీలకమైన సైనిక, నిఘా, పౌర మౌలిక సదుపాయాలను ఇది ప్రమాదంలో పడేస్తుంది" అని సెనేటర్లు పేర్కొన్నారు. రక్షణ శాఖతో స్పేస్‌ఎక్స్‌కు 5.9 బిలియన్ డాలర్ల లాంచ్ సర్వీస్ కాంట్రాక్టుతో సహా బిలియన్ల డాలర్ల విలువైన ఒప్పందాలున్నాయి.

"మన జాతీయ భద్రతా వ్యవస్థకు మూలస్తంభంగా ఉన్న స్పేస్‌ఎక్స్ లాంటి సంస్థపై చైనా వంటి ప్రత్యర్థి దేశం పెత్తనం చెలాయించగలిగే అవకాశం ఉండడం ప్రమాదకరం" అని వారు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కంపెనీకి సంబంధించిన రహస్య సమాచారాన్ని చైనా పెట్టుబడిదారులు తెలుసుకుని, అమెరికా జాతీయ భద్రతను దెబ్బతీసే ప్రమాదం ఉందని సెనేటర్లు హెచ్చరించారు. స్పేస్‌ఎక్స్‌లో చైనా ప్రభావంపై తాము లేవనెత్తిన ప్రశ్నలకు, ఈ భద్రతాపరమైన ఆందోళనలను పరిష్కరించడానికి డీఓడీ ఎలాంటి చర్యలు తీసుకోబోతోందో ఫిబ్రవరి 18లోగా తెలియజేయాలని వారు తమ లేఖలో కోరారు.

# 'అరెస్ట్' ఎప్పుడు చేయాలంటే.. పోలీసులకు సుప్రీం కీలక ఆదేశాలు

- మొదటి పేజి తరువాయి

ఈ మేరకు సతేందర్ కుమార్ అంటిల్ వర్సెస్ సీబీఐ కేసులో జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్ కే సింగ్ ల ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. వ్యక్తిగత స్వేచ్ఛతో కూడుకున్న విషయం కాబట్టి అరెస్టుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని పోలీసులకు సూచించింది.

**సుప్రీం బెంచ్ సూచనలు ఇవే..**

క్రిమినల్ కేసుల్లో ఫిర్యాదు అందిన తర్వాత రెండు దశల పద్ధతిని పాటించాలని దర్యాప్తు అధికారికి కోర్టు సూచించింది. సదరు కేసు విచారణలో అరెస్టు తప్పనిసరా? కాదా?.. బీఎన్ఎస్ సెక్షన్ 33, సెక్షన్ 35 ప్రకారం అరెస్టు చెయ్యవచ్చా? లేదా? అనేది వ్యక్తిగతంగా నిర్ణయించుకోవాలని పేర్కొంది. ఈ ప్రక్రియలో ఆర్టికల్ 21 (వ్యక్తిగత స్వేచ్ఛ, జీవించే హక్కు) ప్రకారం పౌరులకు కల్పించిన హక్కుల ఉల్లంఘన జరగకుండా జాగ్రత్తపడాలని హెచ్చరించింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులు అందరికీ ఈ నిబంధన వర్తిస్తుందని; నిందితుడు, సహ నిందితుడనే భేదాలు ఏవీ మినహాయింపు కాదని స్పష్టం చేసింది. అదే సమయంలో అరెస్టుకు సంబంధించి పోలీసులకు చట్టం కల్పించిన మినహాయింపులనూ సుప్రీంకోర్టు ప్రస్తావించింది. బీఎన్ఎస్ సెక్షన్ 35(1)(బి) ప్రకారం.. ఎలాంటి వారెంట్ లేకున్నా పోలీసులు అరెస్టు చేయవచ్చనే నిబంధనను ప్రస్తావిస్తూ.. ఈ రూల్ ప్రకారం వారెంట్ లేకుండా ఎవరినైనా అరెస్టు చేయొచ్చని భావించరాదని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది.

# ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం

- మొదటి పేజి తరువాయి

చివరి గదిలో ఉన్న స్విచ్ బోర్డు వద్ద షార్ట్ సర్క్యూట్ అయినట్లు తెలిపారు. అక్కడి నుంచి మంటలు వ్యాపించాయని, సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశాయని అన్నారు. హైదరాబాద్‌లోని అన్ని భవనాలను తనిఖీ చేస్తామని ఆయన తెలిపారు. రెసిడెన్షియల్, కమర్షియల్ కార్యాలయాలను తనిఖీ చేస్తామని అన్నారు. ఎండాకాలం సమీపించిన నేపథ్యంలో అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉందని తెలిపారు.

# తెలంగాణ, మహారాష్ట్ర మధ్య నీటి గొడవలు లేవు

- మొదటి పేజి తరువాయి

బాగుండాలనే సంకల్పంతో బీజేపీ ముందుకు సాగుతోంది. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. ప్రధానిమోదీ పాలనలో పట్టణాల అభివృద్ధికి కేంద్రం నేరుగా నిధులు మంజూరు చేస్తోందన్నారు ఫడ్నవీస్. స్మార్ట్, అమృత్ పథకాలతో పట్టణాలను అభివృద్ధి చేస్తోందన్నారు. పట్టణాల్లో రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి ప్రధాని అధికంగా నిధులు ఇస్తున్నారన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు మహారాష్ట్ర సీఎం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు ధనిక రాష్ట్రంగా ఉంది.. ఇప్పుడు అప్పుల పాలయ్యింది.. బీఆర్ ఎస్ ,కాంగ్రెస్ లు తెలంగాణను అప్పుల పాలు చేశాయన్నారు. పైసా లేకుండా రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేస్తారంటూ ప్రశ్నించారు. రాష్ట్ర ఖజానాను లూటీ చేసి అవినీతిపాలనతో అప్పుల్లోకి నెట్టారని విమర్శించారు. ఎన్నో కలలతో ఏర్పాటైన తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందన్నారు ఫడ్నవీస్

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# అక్రిడిటేషన్ కార్డులకు..! రేపటి నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు..!

## ఈ నెల 28తో పాత కార్డుల గడువు ముగింపు..

- ఫిబ్రవరి 9 నుంచి జిల్లా స్థాయిలో ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం..!
- ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డుల గడువు ఫిబ్రవరి 28తో ముగింపు..
- మీడియా యాజమాన్యాలు జర్నలిస్టుల పేర్ల జాబితాను జిల్లా అధికారికి సమర్పించాలి..
- అర్హులైన జర్నలిస్టులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి..


మిక్కిలినేని మను చౌదరి.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఫిబ్రవరి 7:** సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో 202628 సంవత్సరానికి జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అక్రెడిటేషన్ కమిటీ చైర్మన్, కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.. ప్రస్తుతం అమల్లో ఉన్న అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితి గడువు ఈ నెల 28వ తేదీతో ముగియనున్నందున అర్హత కలిగిన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు.. జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డుల కోసం మీడియా యాజమాన్యాలు తమ జర్నలిస్టుల పేర్ల జాబితాను జిల్లా పౌరసంబంధాల అధికారికి సమర్పించాలని సూచించారు.. యాజమాన్యాల ద్వారా పంపిన పేర్లలో ఉన్న జర్నలిస్టులు సమాచార పౌరసంబంధాల శాఖ అధికారిక వెబ్ సైట్ http://ipr.telangana.gov.in ద్వారా ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయిలో ఆన్ లైన్ దరఖాస్తులను ఈ నెల 9వ తేదీ నుంచి సమర్పించాలని తెలిపారు. అర్హులైన జర్నలిస్టులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ మను సూచించారు..

# 2028లో జగిత్యాలలో MIM ఎమ్మెల్యే అభ్యర్థిని నిలబెడతా




**హైదరాబాద్ పెన్ పవర్:** 2028 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాలలో ఎంఐఎం ఎమ్మెల్యే అభ్యర్థిని నిలబెడతానని ఎంఐఎం చీఫ్, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ప్రకటించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం (ఫిబ్రవరి 7) జగిత్యాలలో ఎంఐఎం అభ్యర్థి తరుపున అసదుద్దీన్ ఓవైపీ క్యాంపెయినింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాల తర్వాత జగిత్యాలకు వచ్చానని అన్నారు. ఉర్దూ హౌస్ బిల్డింగ్ పనులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. జగిత్యాల గంజ్ ప్రాంతంలో నాలా సమస్య, ఉర్దూ హౌజ్ ఏర్పాటుపై అసెంబ్లీలో ప్రస్తావిస్తానని అన్నారు. రాజకీయంగా ఏ పార్టీ కూడా ముస్లింలకు నాయకత్వం ఇవ్వలేదని.. మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ ముస్లిం సమస్యలపై పార్లమెంట్‌లో ఎప్పుడు ప్రస్తావించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే సంజయ్, జీవన్ రెడ్డిలు ఇద్దరూ కొట్లాడతున్నారని.. వీళ్లు ఇక బీజేపీతో ఎప్పుడు కొట్లాడతారని ఎద్దేవా చేశారు. 2028 ఎన్నికల్లో జీవన్ రెడ్డి లేదా సంజయ్ కేసీఆర్ దగ్గరికి వెళ్తారని చెప్పారు. హైదరాబాద్‌లో మోడీ, అమిత్ షాలు ప్రచారం చేస్తే బీజేపీ గెలవలేదని.. ఇక జగిత్యాలలో బీజేపీ ఎలా గెలుస్తుందన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ దేశంలో మతకలహాలు సృష్టిస్తున్నాయని ఆరోపించారు. లడక్‌లో జరిగిన గొడవలను బీజేపీ ఎందుకు ఆపలేదని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను ప్రధాని మోడీ తొలగిస్తారని ఆరోపించారు.

## ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి

- పోచారం వద్ద వేగంగా దూసుకొచ్చిన కారు
- ఓఆర్ఆర్ రోడ్డు నుంచి సర్వీసు రోడ్డు పైకి ఎగిరిపడిన కారు
- గాయపడిన వారిని ఆసుపత్రికి తరలింపు





**హైదరాబాద్ పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లాలోని పోచారం వద్ద ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)పై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా దూసుకొచ్చిన కారు ఓఆర్ఆర్ నుంచి సర్వీసు రోడ్డు పైకి ఎగిరి పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న మౌనిక (36), నవీన్ (30) అక్కడికక్కడే మృతి చెందగా, నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన హరిప్రసాద్, హర్ష, అమృత, సుశ్రుతలను పటాన్‌చెరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

వీరిలో సుశ్రుత పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. స్థానికుల సమాచారం మేరకు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. బోరంపేటకు చెందిన వీరంతా జూపార్కుకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పటాన్‌చెరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# 'ఫోన్ ఇన్'... హైడ్రా కమిషనర్‌కు ఫోన్ చేసి సమస్యలు చెప్పిన ప్రజలు

- హైడ్రా కార్యాలయంలో తొలిసారి ఫోన్ ఇన్ కార్యక్రమం
- రంగనాథ్ దృష్టికి సమస్యలు తీసుకెళ్లిన 36 మంది
- ప్రభుత్వ స్థలాలు, నీటి వనరుల పరిరక్షణ కోసం ఓఆర్ఆర్ బయటకు విస్తరించాలని కోరిన ప్రజలు



**హైదరాబాద్ పెన్ పవర్:** హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైదరాబాద్ నగర ప్రజలు ఫోన్ చేసి సమస్యలను చెప్పుకున్నారు. హైడ్రా కార్యాలయంలో ఆయన తొలిసారి 'ఫోన్ ఇన్' కార్యక్రమం చేపట్టగా, గంటలోనే 36 మంది ఫోన్ చేశారు. భూ ఆక్రమణలు, నీటి వనరులు కలుషితం కావడం వంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ స్థలాలు, నీటి వనరుల పరిరక్షణ కోసం హైడ్రా పరిధిని ఔటర్ రింగ్ రోడ్డు బయటకు కూడా విస్తరించాలని ప్రజలు కోరారు.

తమ ప్రాంతాల్లోని చెరువులో మురుగు నీరు వచ్చి చేరుతోందని, దుర్గంధభరిత వాతావరణంతో ఇబ్బందులు పడుతున్నామని కొంతమంది కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. గుర్రపు డెక్కపెరిగి దోమలతో ఇబ్బందిపడుతున్నట్లు చెప్పారు. ఇతర చెరువుల్లాగే తమ ప్రాంతంలోని చెరువులనుకూడా అభివృద్ధి చేయాలని కోరారు. ప్రతి సోమవారం హైడ్రా ప్రజావాణి ఉంటుంది. కానీ ప్రజలతో నేరుగా మాట్లాడేందుకు కమిషనర్ 'ఫోన్ ఇన్' కార్యక్రమం చేపట్టారు. హైడ్రా కార్యాలయం వరకు రాలేనివారు సమస్యలను ఫోనులో చెప్పుకునే అవకాశం కల్పించారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు 'ఫోన్ ఇన్' కార్యక్రమం జరగగా, స్వయంగా కమిషనర్ రంగనాథ్ ఫిర్యాదుదారులతో మాట్లాడారు. ప్రజల సమస్యలను విని పరిష్కారానికి సంబంధిత అధికారి వివరాలను వారికి అందజేశారు.

వారం రోజుల తర్వాత కూడా సమస్య పరిష్కారం కాకుంటే నేరుగా తనకు ఫోను చేయాలని ఫిర్యాదుదారులకు సూచించారు. సెలవు రోజుల్లో మినహా ప్రతి శనివారం 040-29565750, 040-29565759 ఈ నంబర్లకు ఫోను చేసి సమస్యలను తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాల నుంచి పలువురు ఫోన్లు చేసి తమ వద్ద కూడా చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయని, వాటిని కాపాడాలని కోరారు. అయితే హైడ్రా పరిధి ఓఆర్ఆర్ వరకేనని రంగనాథ్ స్పష్టం చేశారు. మొదటి విడతలో 6 చెరువులను అభివృద్ధి చేశామని, త్వరలో మరో 14 చెరువులను అభివృద్ధి చేస్తామని అన్నారు.

# 60 సీట్లున్న బస్సులో 100 మంది ఎక్కితే గొడవలు కావా?

## జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్న జగ్గారెడ్డి
- ఉచిత బస్సు పథకంపై ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం
- ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా ప్రభుత్వం హామీలను నెరవేరుస్తోందని వ్యాఖ్య



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. అయితే ఉచిత బస్సు పథకంతో మహిళలు ఘర్షణలకు దిగుతున్నారంటూ ప్రతిపక్షాలు రాద్దాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. 60 సీట్లు ఉన్న బస్సులో 100 మంది ఎక్కితే గొడవలు కావా అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేయడం సరికాదని అన్నారు. బియ్యం

-4 లో

# షార్ట్ సర్క్యూటే కారణం.. నాంపల్లి FSL కార్యాలయంలో అగ్ని ప్రమాదంపై ఫైర్ డీజీ విక్రమ్ సింగ్

**హైదరాబాద్ పెన్ పవర్:** నాంపల్లి ఖీూా కార్యాలయంలో అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూటే కారణమని ప్రాథమికంగా నిర్ధారించినట్లు ఫైర్ డీజీ విక్రమ్‌సింగ్ మాన్ తెలిపారు. శనివారం (ఫిబ్రవరి 7) నాంపల్లి ఖీూా కార్యాలయంలో భారీ అగ్ని ప్రమాదం సంభవిం చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ నారాయణతో కలిసి ఘటన స్థలాన్ని విక్రమ్ సింగ్ మాన్ పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా విక్రమ్ సింగ్ మాన్ మాట్లాడుతూ.. శనివారం (ఫిబ్రవరి 7) ఉదయం 10.20 గంటలకు ఎఫ్ఎస్ఎల్‌లో అగ్నిప్రమాదం సంభవించినట్లు కాల్ వచ్చిందని తెలిపారు. వెంటనే అసెంబ్లీ దగ్గర ఉన్న ఫైర్ ఇంజన్లతో మంటలు అదుపులోకి తీసుకొచ్చామన్నారు. ఎఫ్ఎస్ఎల్ కార్యాలయం ఫస్ట్ ఫ్లోర్లో ఎంసీబీ దగ్గర ఉన్న స్విచ్ బోర్డులో ఫైర్ సంభవించినట్లు అనుమానిస్తున్నామని.. ప్రమాదానికి షార్ట్ సర్క్యూటే కారణమని ప్రాథమికంగా నిర్ధారిస్తున్నామని చెప్పారు. ల్యాబ్‌లో ఉన్న కంప్యూటర్స్, హార్డ్ డిస్క్‌లు కాలిపోయాయని తెలిపారు. ఈ ఘటనతో ప్రభుత్వ కార్యాలయాలన్నింటిలో ఫైర్ సేఫ్టీ తనిఖీలు చేస్తామన్నారు. ఎండాకాలం వస్తుండటంతో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటుందని.. కాబట్టి అన్ని రకాలుగా అప్రమత్తంగా ఉన్నామన్నారు. నగరంలోని రెసిడెన్షియల్, కమర్షియల్, ప్రభుత్వ కార్యాలయాలలో ఫైర్ టీమ్స్ తనిఖీలు చేపడుతుందని తెలిపారు.




# ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్ని ప్రమాదం... ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు

- ప్రపంచవ్యాప్తంగా కుదిపేస్తున్న ఎప్‌స్టీన్ కుంభకోణంతో పోల్చిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్
- ఫోరెన్సిక్ ల్యాబ్‌లో ప్రమాదం అనుమానాలకు తావిస్తోందన్న బీఆర్ఎస్ నేత
- ఆధారాల నిర్మూలనకు ప్రస్తుత పాలకులు ఎంతకైనా తెగిస్తారని ట్వీట్



**హైదరాబాద్ పెన్ పవర్:** నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు. ఓటుకు నోటు ఆధారాలను ధ్వంసం చేయడానికేనా అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. దీనిని రీట్వీట్ చేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఈ ప్రమాదంపై అనుమానాలు వ్యక్తం చేశారు. పోలీసు శాఖకు అత్యంత కీలకమైన, గట్టి భద్రత ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్ని ప్రమాదం జరగడం పలు అనుమానాలకు తావిస్తోందని,

-4 లో



# సాగులో ఉన్న భూములకే రైతు భరోసా: వచ్చే యాసంగి నుంచే కొత్త విధానం!

**హైదరాబాద్: పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్రంలో రైతు భరోసా వచ్చే యాసంగి నుంచే కొత్త విధానం శాటిలైట్ మ్యాపింగ్ ఆధారంగా సాయంసర్వే , గ్రౌండ్ ట్రూత్ వివరాలతో పెట్టుబడి సాయం ఇచ్చే యోచనలో సర్కారువానాకాలం డేటానే ప్రామాణికం.

ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన సర్వే వివరాలు:

రాష్ట్రంలో ఉన్న పట్టా భూమిలో 20 లక్షల ఎకరాల్లో సాగు తేడా, త్వరలోనే ప్రభుత్వానికి అగ్రికల్చర్ వర్సిటీ తుది నివేదిక తెలంగాణ రాష్ట్రంలో 'రైతు భరోసా' పంపిణీపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోబోతున్నది. ఇకపై పట్టా ఉన్న ప్రతి భూమికీ కాకుండా, వాస్తవంగా సాగులో ఉన్న భూములకు మాత్రమే పెట్టుబడి సాయం అందించాలని యోచిస్తున్నది. రాబోయే యాసంగి సీజన్ నుంచే ఈ కొత్త నిబంధనలను అమలు చేసేందుకు కసరత్తు వేగవంతం చేసింది. వానాకాలం సీజన్‌లో జరిగిన సాగు వివరాలను ప్రాతిపదికగా తీసుకొని, అర్హులైన రైతులకు నగదు జమ చేయాలని భావిస్తున్నది. కేవలం కాగితాల్లో ఉన్న లెక్కలకే పరిమితం కాకుండా, ఆధునిక సాంకేతికతను ప్రభుత్వం రంగంలోకి దించింది. అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన శాటిలైట్ మ్యాపింగ్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయ్యింది.రాష్ట్రంలో ఉన్న పట్టాభూమిలో 8--12% సాగులో తేడా 20 లక్షల ఎకరాలు,కనిపిస్తున్నట్టు తేలింది.శాటిలైట్ సర్వే వివరాలను సర్కారుకు అగ్రికల్చర్ యూనివర్సిటీ త్వరలోనే అందించనున్న నేపథ్యంలో ఈ డేటా కీలకంగా మారునున్నది. శాటిలైట్ ఆధారిత మ్యాపింగ్ ద్వారా సాగు భూములను గుర్తించడంతోపాటు గ్రౌండ్ లెవెల్‌లో పక్కాగా గుర్తించి, అర్హులకు మాత్రమే సాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నది.

**20 లక్షల ఎకరాలు ఖాళీ:**

అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 10,600 రెవెన్యూ గ్రామాల్లో పంటల విస్తీర్ణం లెక్కలు పూర్తి చేశారు. విలేజ్ రెవెన్యూ మ్యాప్‌లు లేని 870 గ్రామాలను మినహాయించి మిగిలిన ప్రాంతాల్లో విశ్లేషణ పూర్తిచేశారు. రాష్ట్రంలో సాగుకు యోగ్యమైన మొత్తం భూమి 1.53 కోట్ల ఎకరాలు కాగా, ఇందులో 8 నుంచి 12 శాతం వరకు అంటే సుమారు 20 లక్షల ఎకరాలకు పైగా భూమిని పంటలు వేయకుండా ఖాళీగా ఉంచినట్టు సర్వేలో తేలింది. గత వానాకాలం పంటల విస్తీర్ణానికి సంబంధించిన పూర్తి నివేదిక త్వరలోనే ప్రభుత్వం చేతికి అందనున్నది. దేశంలోనే మొదటిసారిగా శాటిలైట్ ఆధారిత టెక్నాలజీతో పంటల విస్తీర్ణం లెక్కింపును చేపట్టగా.. నీటి లభ్యత తక్కువగా ఉన్న జిల్లాల్లో ఖాళీ భూముల శాతం అధికంగా ఉన్నట్టు తేలింది. ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో సాగునీటి సౌకర్యాలు తక్కువ కావడంతో అక్కడ ఖాళీ భూములు ఎక్కువగా కనిపిస్తున్నాయి.నీటి వసతి మెరుగ్గా ఉన్న జిల్లాల్లో సాగు చేయకుండా ఉంచిన భూములు తక్కువగా ఉన్నట్టు అధ్యయనంలో తేలింది. ఒక గ్రామంలో 500 ఎకరాల సాగు యోగ్య భూమి ఉంటే, 400 నుంచి 450 ఎకరాల్లో మాత్రమే పంటలు వేస్తున్నారని శాటిలైట్ ఇమేజెస్ స్పష్టం చేశాయి.

**92 శాతం కచ్చితత్వం:**

శాటిలైట్ సర్వేకు యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన ఇమేజెస్‌ను ప్రతి 12 రోజులకు సేకరిస్తున్నారు. స్విట్జర్లాండ్‌కు చెందిన సార్ మ్యాప్ ఎస్ఏఆర్ ఎంఏపీ, సంస్థతో ఒప్పందం చేసుకుని, ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా డేటాను విశ్లేషిస్తున్నారు. 4 నెలల పంట కాలంలో 10 సార్లు శాటిలైట్ ఇమేజెస్ ఆధారంగా విశ్లేషణ చేసి, 92 శాతం కచ్చితత్వాన్ని సాధిస్తున్నట్టు క్షేత్ర స్థాయి పరిశీలనల్లో తేలింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్లు, రిమోట్ సెన్సింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక సహకారంతో ఈ టెక్నాలజీని అమలు చేస్తున్నారు. మున్ముందు సొంతంగానే ఈ వ్యవస్థను నడపాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

**పంటల బీమా నుంచి పారదర్శకత వరకు:**

ఈ శాటిలైట్ మ్యాపింగ్‌తో పంట బీమా అమలులో రైతులకు నష్టపరిహారం సకాలంలో అందడమే కాకుండా, వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, కొనుగోళ్లు, అమ్మకాల్లో పారదర్శకత తీసుకురావడానికి ఉపయోగపడనుంది. ప్రభుత్వ పథకాలు అర్హులైన రైతులకే చేరేలా ఈ లెక్కలు సహాయపడతాయి. సాగు భూములను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవడానికి క్షేత్ర స్థాయి అధికారులు విశ్లేషణ చేస్తారని అధికారులు చెప్తున్నారు. చీడపీడలు, వరదలు, తుఫానుల వల్ల జరిగే పంట నష్టాన్ని అంచనా వేయడానికి కూడా ఈ టెక్నాలజీని వినియోగిస్తారు.

**పైలెట్ ప్రాజెక్టు సక్సెస్.. రాష్ట్రవ్యాప్త అమలుకు సన్నాహాలు:**

గతంలో పంటల నమోదు కోసం ప్రత్యేక యాప్‌ను అందు బాటులోకి తెచ్చిన ప్రభుత్వం. 20 జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా శాటిలైట్ సర్వే నిర్వహించింది

. నిరుడు డిసెంబర్ 20 నుంచి 23 వరకు ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, ఖమ్మం, కొత్తగూడెం, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఈ సర్వే జరిగింది. 144 మండలాల్లోని 318 క్లస్టర్లలో ప్రక్రియ పూర్తి చేసి, సాగు భూములను కచ్చితంగా లెక్కించారు.

**ఇదివరకే నిర్ణయం:**

సాగులో ఉన్న భూములకు మాత్రమే రైతు భరోసా ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే నిర్ణయించింది. ఈ విషయాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

నాగేశ్వర్‌రావు ఇప్పటికే స్పష్టం చేశారు. సాగు భూముల గుర్తింపు కోసం శాటిలైట్ సర్వే నిర్వహిస్తారని, గ్రామాల్లో సర్వే నంబర్లవారీగా ఏఈవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి కచ్చిత వివరాలు సేకరించి లోటు పాట్లు సరిచేస్తారని సమాచారం. అగ్రికల్చర్ యూనివర్సిటీ రూపొందించిన పంటల వివరాలను ఈనెల 14 తర్వాత సర్కారుకు అందిస్తే, టెక్నికల్ కమిటీలో చర్చించి దీనిపై నిర్ణయం తీసుకోనున్నది.

# చట్టాలపై అవగాహనతోనే సురక్షిత సమాజం




**కరీంనగర్: పెన్ పవర్:**చట్టాల పట్ల అవగాహన లేని కారణంగా చాలా మంది నేరాల బాట పడుతున్నారని, విద్యార్థి దశ నుంచే న్యాయ విజ్ఞానాన్ని పెంపొందించుకుంటే సురక్షిత సమాజం ఏర్పాటవుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు, న్యాయవాదులు పిలుపునిచ్చారు. కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామంలోని తెలంగాణా మోడల్ స్కూల్‌లో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఆదేశాలతో న్యాయ విజ్ఞాన సదస్సు ను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాపాడుకుంటూనే, పౌర బాధ్యతలను నెరవేర్చాలని వారు సూచించారు. న్యాయం కేవలం ధనవంతులకే కాదని పేదలకు కూడా అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచిత న్యాయ సలహాలు, సహాయం అందిస్తుందని వివరించారు. సదస్సులో పాల్గొన్న ప్యానల్ న్యాయవాదులు పలు అంశాలపై ప్రసంగించారు. మత్తు పదార్థాల సేవనం ఒక సామాజిక రుగ్మత అని న్యాయవాదులు పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాల వల్ల విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం సరదా కోసం మొదలయ్యే అలవాటు, చివరకు నేరాలకు దారితీస్తుందని హెచ్చరించారు. ఎన్.డి.పి.ఎస్ చట్టంలోని సెక్షన్ల గురించి వివరిస్తూ, మత్తు పదార్థాల రవాణా చేసినా లేదా వినియోగించినా బెయిల్ రావడం కష్టమని, కఠిన కారాగార శిక్షలు ఉంటాయని స్పష్టం చేశారు. విద్యార్థులు అటువంటి అలవాట్లకు దూరంగా ఉంటూ, తమ స్నేహితులను కూడా చైతన్యపరచాలని కోరారు. ప్రస్తుత స్మార్ట్ ఫోన్ యుగంలో ఆన్‌లైన్ నేరాలు పెరిగిపోతున్నాయని న్యాయవాదులు ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ నేరగాళ్లు రకరకాల ఆశలు చూపి బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేస్తున్నారని, ఓటిపి ఓటిపి ఎవరికీ చెప్పవద్దని సూచించారు. సోషల్ మీడియాలో అపరిచితుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్ట్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా విద్యార్థినులు వ్యక్తిగత ఫోటోలను ఇంటర్నెట్‌లో పెట్టేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఒకరిని కించపరుస్తూ పోస్ట్‌లు పెట్టినా, అసభ్యకర సందేశాలు పంపినా ఐటి చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. సైబర్ వేధింపులకు గురైతే తక్షణమే '1930' నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు ర్యాంకుల కోసం, మార్కుల కోసం తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారని, ఇది వారి ఎదుగుదలకు ఆటంకమని న్యాయవాదులు అభిప్రాయపడ్డారు. మానసిక ఒత్తిడిని జయించడానికి క్రమశిక్షణతో కూడిన జీవనశైలి అవసరమని వివరించారు. వైఫల్యం ఎదురైనప్పుడు పిరికిపంద చర్యలకు పాల్పడకుండా, సమస్యను ధైర్యంగా ఎదుర్కోవాలని హితవు పలికారు. ప్రణాళికాబద్ధమైన చదువు, క్రీడలు, మరియు పెద్దల సలహాలు తీసుకుంటే ఒత్తిడిని అధిగమించి అద్భుతమైన విజయాలు సాధించవచ్చని విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉంటేనే అనుకున్న విజయాలు సాధ్యమవుతాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సభ్యులు, న్యాయవాదులు పెరుక రంగయ్య పటేల్, చిట్టి చంద్రప్రకాష్ రెడ్డి, ఏ. కిరణ్ కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్, కొడిమ్యాల శ్రీనివాస్, ప్యానెల్ న్యాయవాదులు కీర్తి శ్రీధర్, బొజ్జ శ్రీలక్ష్మి, అశ్విని, యస్. ప్రవీణ్ కుమార్, ఏ. వెంకటేష్, కె.ఆనంద్ భాస్కర్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. సదస్సు తమకు ఎంతో జ్ఞానాన్ని అందించిందని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమానంతరం అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు.

# బాల్య వివాహ నిర్మూలన రథయాత్ర ప్రారంభించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ




**వనపర్తి: పెన్ పవర్:**రూరల్ డెవలప్మెంట్ సొసైటీ మరియు జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ సంస్థల ఆధ్వర్యంలో బాల్య వివాహ నిర్మూలన రథయాత్రను జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి మరియు జిల్లా ఎస్పీ సునీత రెడ్డి మరియు జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారిని సుధారాణి రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షురాలు చిన్నమ్మ తామస్ జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ ప్రాజెక్టు ఆఫీసర్స్ జునైద్ మరియు సుచేత తో కలిసి కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో జెండా ఊపి ప్రారంభించారు . బాల్య వివాహాలకు వ్యతిరేకంగా రూపొందించిన కరపత్రాలను మరియు పోస్టర్లను కలెక్టర్ మరియు ఎస్పి ఆవిష్కరించారు. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ సంస్థ ప్రాజెక్టు ఆఫీసర్స్ జునైద్ మరియు సుచేత లను జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ శాలువాతో సన్మానించడం జరిగింది.బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.అనంతరం కలెక్టర్ కార్యాలయ గేటు వరకు ర్యాలీ తీశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా బాల్య వివాహం చేయుటకు ప్రయత్నించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహ నిషేధ రథయాత్ర వాహనం వనపర్తి జిల్లాలోని గ్రామాలలో 30 రోజులపాటు బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహిస్తుందని రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షురాలు చిన్నమ్మ తామస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో

డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రాంబాబు వారి సిబ్బంది, అన్ని విభాగాల జిల్లా స్థాయి అధికారులు, సిడిపిఓలు, డిస్టిక్ లీగల్ సర్వీస్ అథారిటీ సిబ్బంది, లేబర్ డిపార్ట్మెంట్ సిబ్బంది,

ప్రాజెక్టు కోఆర్డినేటర్స్ అడ్విన్ థామస్, చంద్రశేఖర్, విశ్వకాంత్, సోషల్ మొబిలైజర్స్ రాజశేఖర్ కన్నన్ కుమార్ దివ్యభారతి ముబిన్ మరియు జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ ప్రాజెక్ట్ జోగులాంబ గద్వాల జిల్లా మరియు మహబూబ్నగర్ జిల్లా సిబ్బంది, రూరల్ డెవలప్మెంట్ సొసైటీ సీనియర్ సిబ్బంది శ్రీలక్ష్మి అరుణ జ్యోతి కలెక్టర్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# అబూజ్మాడ్ లో కొనసాగుతున్న ఆపరేషన్

గడ్చిరోలి జిల్లాలో పోలీసులతో ఎదురుకాల్పుల్లో సిపిఐ (మావోయిస్టు) కీలక నేత ప్రభాకర్ సహా 7 మంది మావోయిస్టులు హతం అయ్యారు.గడ్చిరోలి డివిజన్ కమిటీ ఇన్చార్జ్, వెస్ట్ సబ్ జోనల్ బ్యూరో ఇన్చార్జ్, కోయ్ నెం.10 ఇన్చార్జ్ ప్రభాకర్ (కామారెడ్డి, తెలంగాణ) మృతి చెందాడు. ప్రభాకర్పై .25 లక్షల రివార్డు ఉంది. మూడు రోజుల ఆపరేషన్లో మొత్తం 7 మావోయిస్టుల మృతదేహాలు స్వాధీనం చేసుకున్నారు.మొత్తం నలుగురు పురుషులు, ముగ్గురు మహిళలు మృతి చెందారు.ఘటనాస్థలిలో 3 ఏకే -47లు, 1 ఎస్ఎల్ఆర్, 1 .303 రైఫిల్ స్వాధీనం చేసుకున్నారు. ఎదురుకాల్పుల్లో ఓ సి60 జవాన్ దీపక్ చిన్న మడవి (38) మృతి చెందాడు. దీపక్ చిన్న మడవికి ఆదివారం స్వగ్రామంలో పూర్తి గౌరవాలతో అంత్యక్రియలు జరగనున్నాయి. మరో జవాన్ జోగా మడవి గాయాల నుంచి కోలుకుంటున్నారు.

# 60 సీట్లున్న బస్సులో 100 మంది ఎక్కితే గొడవలు కావా?

-3 పేజి తరువాయి

తక్కువ ఉన్నా తినేవాళ్లు ఎక్కువగా ఉన్న చందంగా ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినప్పటికీ తమ ప్రభుత్వం క్రమంగా అన్ని హామీలను నెరవేరుస్తోందని అన్నారు. సంగారెడ్డి మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ కౌన్సిలర్లను గెలిపిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి పనులు చేయిస్తానని హామీ ఇచ్చారు.ఒక్కో వార్డుకు రూ.8 కోట్లు మంజూరు చేయిస్తానని జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డిలో అన్ని వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే రూ.300 కోట్లు తీసుకువస్తానని అన్నారు. 2013లో 5,500 మందికి ఇంటి స్థలాలు ఇచ్చానని గుర్తు చేశారు. గత పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉందని, ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటి స్థలాలు ఇప్పిస్తానని స్పష్టం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తన భార్య ఎమ్మెల్యేగా పోటీ చేస్తుందని ప్రకటించారు. తాను కాంగ్రెస్ పార్టీ కోసం తెలంగాణ మొత్తం తిరుగుతానని అన్నారు.

# ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్ని ప్రమాదం...

## ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు

-3 పేజి తరువాయి

అనేక సున్నితమైన కేసులకు సంబంధించిన ఆధారాలు(2015 నాటి ఓటుకు నోటు కేసుతో సహా ) ఇందులో భద్రపరచి ఉన్నాయని పేర్కొన్నారు. వాటి పరిస్థితి ఏమిటి? దీనిపై ఉన్నత స్థాయి విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఆధారాల నిర్మూలనకు ప్రస్తుత పాలకులు ఎంతకైనా తెగిస్తారని మండిపడ్డారు.

అమెరికాలో ఎంతోమంది చిన్నారులను అపర కుబేరులకు అర్పించిన లైంగిక నేరస్తుడు ఎప్‌స్టీన్ జైలులో అనుమానాస్పదంగా చనిపోయాడని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కాగా, ఎప్‌స్టీన్ కుంభకోణం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న విషయం తెలిసిందే.

# వనపర్తి పట్టణం రెండవ వార్డ్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బి కృష్ణన్న గెలిపించండి

## మాజీ తాజా కౌన్సిలర్ రమాదేవి విజ్ఞప్తి.













**వనపర్తి: పెన్ పవర్:**వనపర్తి పట్టణంలోని రెండో వార్డ్ లో వీధి వీధికి ప్రచారం చేస్తూ గత పది సంవత్సరాలుగా రెండో వార్డు కాలనీ అభివృద్ధి కోసం తమ కుటుంబం కృషి చేస్తుందని ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలుపరిచామని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు.అమలు పరుస్తున్నటువంటి సంక్షేమ కార్యక్రమాలలో స్థానిక రెండో వార్డు ప్రజలను భాగస్వాములు చేశామని వృద్ధులకు వితంతువులకు వికలాంగులకు పింఛన్లను మంజూరు చేయించామని ఇల్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇప్పించడం జరిగిందని ఇంకా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలకు తమ ముందువనపర్తి పట్టణంలోని రెండో వార్డ్ లో వీధి వీధికి ప్రచారం చేస్తూ గత పది సంవత్సరాలుగా రెండో వార్డు కాలనీ అభివృద్ధి కోసం తమ కుటుంబం కృషి చేస్తుందని ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలుపరిచామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలుపరుస్తున్నటువంటి సంక్షేమ కార్యక్రమాలలో స్థానిక రెండో వార్డు ప్రజలను భాగస్వాములు చేశామని వృద్ధులకు వితంతువులకు వికలాంగులకు పింఛన్లను మంజూరు చేయించామని ఇల్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇప్పించడం జరిగిందని ఇంకా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలకు తమ ముందు ఉంటామని తన భర్త బి కృష్ణ వార్డులోని ప్రతి ఒక్క ప్రజానీ కి అందుబాటులో ఉంటాడని ఎవరికి ఏ ఆపద వచ్చినా సహాయకారిగా ఉంటూ ప్రజలలో నాలుకై ఉన్నాడని ఉంటామని తన భర్త బి కృష్ణ వార్డులోని ప్రతి ఒక్క అందుబాటులో ఉంటాడని ఎవరికి ఏ ఆపద వచ్చినా సహాయకారిగా ఉంటూ ప్రజలలోరమాదేవి వార్డులో ప్రజలకు తెలియజేస్తూ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు ఈ ప్రచారంలో జే వినోద్ ,అరుణ,శీను భరత్, బాలు హరీష్, వెంకటేష్ మన్సూర్ కొండ స్వామి మహేష్ రాకేష్ కృష్ణ కుమార్పాల్గొన్నారు.చేతి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.

# విద్యార్థిని విద్యార్థులకు ఉచిత అద్దాలు పంపిణీ

**హైదరాబాద్ పెన్ పవర్:** కొత్తపల్లి రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొనిప్రభుత్వమువిద్యతోపాటు ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత కల్పిస్తుందని ఆత్మకూరు కంటి వైద్యులు షేక్షావలి అన్నారు. శనివారము కొత్తపల్లి మండలంలోని వివిధ పాఠశాలలో కస్తూరిబా గాంధీ పాఠశాల22 మంది బాలికలకు స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల14 మంది విద్యార్థులకు మరియు గువ్వలకుంట్ల జిల్లా పరిషత్ 9 విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచిత అద్దాలుపంపిణీ చేయడం జరిగినది ఈసందర్భంగా విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో విద్యార్థులు స్మార్ట్ ఫోనుకు బానిసలు అయ్యి స్మార్ట్ ఫోన్ నిరంతరంగా చేస్తున్నారని వాటికి దూరంగా ఉండాలని అన్నారు అలాగే విద్యార్థిని విద్యార్థులు రోజువారి ఆహారంలో పోషక విలువలు మెండుగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలని మరియు పాలు గుడ్డు కూరగాయలు ఆకుకూరలు రోజు తీసుకోవాలని సూచించారు కళ్ళను జాగ్రత్తగాపరిశు భ్రంగాఉంచుకోవాలని వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్కూల్ ప్రిన్సిపల్ కృష్ణా భాయి కొత్తపల్లి జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ గోవులకుంట్ల జిల్లా పరిషత్ ప్రధాన ఉపాధ్యాయులు హుస్సేనయ్య ఆయా కళాశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మరియు సి హెచ్ ఓ శైలజఆరోగ్య కార్యకర్త సరిత ఆశా కార్యకర్తలు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# నువ్వా, నేనా అన్నట్టు ప్రచారం

**వికారాబాద్, ఫిబ్రవరి 8, పెన్ పవర్:** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు రసవత్తరంగా సాగుతున్నాయి. రంగారెడ్డి జిల్లా మెయినాబాద్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ కు ఎదురీత తప్పడం లేదు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నామన్న ధీమా ఉందో లేక అభ్యర్థుల్లో గెలుపుపై నమ్మకం సన్నగిల్లిందో తెలియదు కానీ మొయినాబాద్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారుతోంది.ఎన్నికల నగారా మోగి, ప్రచారం హోరెత్తాల్సిన సమయంలో కాంగ్రెస్ అభ్యర్థులు కనీసం ఇంటి గడప దాటకపోవడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్గా మారింది. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థుల జాడ కనిపించడం లేదు. ప్రత్యర్థి పార్టీలు ఇంటింటి ప్రచారంతో దూసుకుపోతుంటే, కాంగ్రెస్ అభ్యర్థులు మాత్రం కనీసం ఓటర్లను కలిసే ప్రయత్నం కూడా చేయడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో సామాన్య ఓటర్లలో అసలు కాంగ్రెస్ పోటీలో ఉందా? లేక ముందే చేతులెత్తేసిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.క్షేత్రస్థాయిలో పార్టీ గ్రాఫ్ పడిపోతుండటంతో అప్రమత్తమైన ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. వరుస సమావేశాలు నిర్వహిస్తూ కార్యకర్తల్లో జోష్ నింపేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ, అభ్యర్థుల్లో కదలక లేకపోవడం ఆయనకు కూడా తలనొప్పిగా మారింది. నాయకులు మేకప్ వేస్తున్నా, క్షేత్రస్థాయిలో 'సీన్' మాత్రంరివర్స్లో ఉండటం గమనార్హం.పార్టీ అంతర్గత వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం.. దీని వెనక ప్రధానంగా మూడు కారణాలు వినిపిస్తున్నాయి.అంతర్గత కుమ్ములాటలు... టికెట్ల కేటాయింపులో జరిగిన జాప్యం,అసంతృప్త నేతల సహాయ నిరాకరణ పార్టీని దెబ్బతీస్తోంది. మరో పక్క నాయకత్వ లోపం తేట తెల్లమవుతుంది. స్థానిక నాయకుల మధ్య సమన్వయం లేకపోవడంతో క్యాడర్ ఎటు వెళ్లాలో తెలియక అయోమయంలోఉంది.గెలుపుపై ధీమా లేకపోవడంతో అభ్యర్థులు ఖర్చు పెట్టేందుకు వెనకాడుతున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. నాయకులు ఏసీ రూముల్లో సమావేశాలు పెడితే ఓట్లు రావు, ప్రజల్లోకి వస్తేనే ఫలితం ఉంటుంది




02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఆడి ద్వారా కొత్త కొత్త స్పోర్ట్స్ కార్లు

**హైదరాబాద్ పెన్ పవర్:** వచ్చే నెలలో భారత్లో కొత్త స్పోర్ట్స్ కారును ప్రవేశపెట్టడం ద్వారా తమ పోర్ట్ఫోలియోను మరింత పటిష్టం చేసుకోనున్నట్లు లగ్జరీ కార్ల దిగ్గజం ఆడి ఇండియా బ్రాండ్ డైరెక్టర్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ తెలిపారు. రూపాయి క్షీణత పరిణామాల నేపథ్యంలో కార్ల రేట్లను మరోసారి పెంచే అవకాశం ఉందన్నారు. ప్రోగ్రెసివ్ షోరూమ్ కాన్సెప్ట్ కింద హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఫిలింనగర్ సెంట్రల్ షోరూమ్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ విషయాలు వివరించారు. హైదరాబాద్ లో ఇది తమకు రెండో షోరూమ్ అని, జాతీయ సగటుకన్నా రెట్టింపుగా తెలంగాణలో తమకు 8–10% స్థాయిలో మార్కెట్ వాటా ఉంటోందని బల్బీర్ సింగ్ తెలిపారు. నగరంలో లగ్జరీ కార్ల సెగ్మెంట్ గణనీయంగా వృద్ధి చెందుతున్న నేపథ్యంలో కస్టమర్లకు సర్వీసులు అందించడంపై దృష్టి పెట్టనున్నట్లు డీలర్ ప్రిన్సిపల్ వికాస్ చౌదరి, వీవీసీ గ్రూప్ చైర్మన్ వీవీ రాజేంద్ర ప్రసాద్ చౌదరి తెలిపారు.

## కూకట్ పల్లిలో ఉద్రిక్తత

**హైదరాబాద్ పెన్ పవర్:** అఖిల భారత స్థాయి బ్రేక్ డౌన్ పిలుపులో భాగంగా శనివారం కూకట్పల్లిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఓలా, ఉబెర్, రాపిడో సంస్థలకు చెందిన డ్రైవర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ నిరసన వ్యక్తం చేశారు.కూకట్పల్లిలోని నెక్సస్ మాల్ సర్కిల్ వద్ద డ్రైవర్లు బైఠాయించి ఆందోళన చేపట్టారు. పెరిగిన జీవన వ్యయానికి అనుగుణంగా అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు కేంద్ర ప్రభుత్వం చార్జీలను పెంచడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.డ్రైవర్ల కష్టార్జితంతో ఓలా, ఉబెర్, రాపిడో వంటి కార్పొరేట్ సంస్థలు కోట్లు గడిస్తున్నాయని, కానీ క్షేత్రస్థాయిలో కష్టపడే డ్రైవర్లకు మాత్రం న్యాయం జరగడం లేదని వారు వాపోయారు.సమ్మెకు విరుద్ధంగా రోడ్లపై వాహనాలు నడుపుతున్న డ్రైవర్లను నిరసనకారులు నిలిపివేశారు. తమ గోడును ప్రభుత్వానికి వినిపించేందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అఖిల భారత స్థాయి బ్రేక్ డౌన్ పిలుపులో భాగంగా శనివారం కూకట్పల్లిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఓలా, ఉబెర్, రాపిడో సంస్థలకు చెందిన డ్రైవర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ నిరసన వ్యక్తం చేశారు.కూకట్పల్లిలోని నెక్సస్ మాల్ సర్కిల్ వద్ద డ్రైవర్లు బైఠాయించి ఆందోళన చేపట్టారు. పెరిగిన జీవన వ్యయానికి అనుగుణంగా అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు కేంద్ర ప్రభుత్వం చార్జీలను పెంచడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.డ్రైవర్ల కష్టార్జితంతో ఓలా, ఉబెర్, రాపిడో వంటి కార్పొరేట్ సంస్థలు కోట్లు గడిస్తున్నాయని, కానీ క్షేత్రస్థాయిలో కష్టపడే డ్రైవర్లకు మాత్రం న్యాయం జరగడం లేదని వారు వాపోయారు.సమ్మెకు విరుద్ధంగా రోడ్లపై వాహనాలు నడుపుతున్న డ్రైవర్లను నిరసనకారులు నిలిపివేశారు. తమ గోడును ప్రభుత్వానికి వినిపించేందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

## నాంపల్లి ఫోరెన్సిక్ ల్యాబ్లో అగ్నిప్రమాదం

## అటెండర్ కు స్వల్ప గాయాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లోని నాంపల్లిలో ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ కార్యాలయంలో అగ్ని ప్రమాదం గురించి సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి మీడియాతో మాట్లాడారు. కార్యాలయంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ఆఫీస్ లో ఉన్న సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నం చేసారు. మంటలు అదుపు కాకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.
సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసారు. ఈ ప్రమాదానికి గల కారణాలు, ఆస్తి నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని అన్నారు.

## ఘనంగా జేఎన్టీయూ స్నాతకోత్సవం

**హైదరాబాద్ పెన్ పవర్:** జేఎన్టీయూ యూనివర్సిటీలో 14వ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు అధికారులు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అరబిందో ఫార్మా డైరెక్టర్ మెట్టు మదన్మోహన్ రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ ఛాన్సలర్ కిషన్ కుమార్ రెడ్డి ఆయనకి డాక్టరేట్ ను ప్రధానం చేశారు. దీనిలో భాగంగా మొత్తం 82,554 మంది విద్యార్థులకు యూజీ, పీజీ పీహెచ్డీ పట్టాలను ప్రధానం చేశారు. ఈ విద్యా సంవత్సరానికి గాను ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 71 గోల్డ్ మెడల్స్ ను 87 మందికి పీహెచ్డీ పట్టాలను అందించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ కిషన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మనిషి ఎదుగుదలలో అనుభవం, విద్య అనేవి ఒకే నాణేనికి ఉన్న రెండు పార్శ్వాల వంటివని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కేవలం పుస్తక జ్ఞానం మాత్రమే సరిపోదని, జీవితంలో ఎదురయ్యే సవాళ్ల నుండి నేర్చుకోవడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. జేఎన్టీయూ యూనివర్సిటీలో విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు కల్పించడంతోపాటు వారికి నైపుణ్యంతో కూడిన విద్యను సైతం అందిస్తున్నామని ఈ సందర్భంగా వెల్లడించారు.
ముఖ్యఅతిథిగా హాజరైన అరబిందో ఫార్మా డైరెక్టర్ మెట్టు మదన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ నేడు పట్టా పుచ్చుకుని కొత్త ప్రపంచంలోకి అడుగుపెడుతున్న విద్యార్థులు, మారుతున్న కాలానికి అనుగుణంగా తమను తాము మలచుకోవాలని పిలుపునిచ్చారు. వేగంగా మారుతున్న ప్రపంచంలో, ముఖ్యంగా ఆరోగ్య సంరక్షణ మరియు ఫార్మా రంగాల్లో పాత పద్ధతులను వదిలి, సరికొత్త ఆవిష్కరణలు చేసేవారే భవిష్యత్తును నిర్మిస్తారని అయన స్పష్టం చేశారు.

## పద్మారావునగర్ లో ఎమ్మెల్యే తలసాని పర్యటన

**హైదరాబాద్ పెన్ పవర్:** పద్మారావు నగర్ లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలలో చాలా వరకు పరిష్కరించినట్లు మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం పద్మారావు నగర్ పార్క్ సమీపంలో ని కేఎఫ్సీ వద్ద 43 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సీవరేజ్ లైన్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలు, మెయిన్ రోడ్లు అని తేడా లేకుండా అన్ని ప్రాంతాలలో అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ, వాటర్ లైన్ ల అభివృద్ధి, పార్క్ ల నిర్మాణం, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం వంటి పలు అభివృద్ధి పనులు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పద్మారావు నగర్ పార్క్ కు వచ్చే వారు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అన్ని సౌకర్యాలు, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించినట్లు వివరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించడం నా బాధ్యత అని పేర్కొన్నారు.

# సిట్ దారెటు... దొరకని సాక్ష్యాలు...

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, పెన్ పవర్:**
ప్రస్తుతం రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్పై జరుగుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ.. ఓ పొలిటికల్ డ్రామానేనా!? అంటే, అవుననే రాజకీయ విశ్లేషకు లు, సాంకేతిక రంగ, న్యాయ నిపుణుల నుంచి సమాధానం వస్తోంది. అంతిమంగా ఇదంతా ఒక పొలిటికల్ డ్రామా లాగా మిగిలిపోతుందని రాజకీయ విశ్లేషకులు కుండబ ద్దలు కొట్టినట్టుగా చెబుతుండటంతో.. సిట్ విచారణ కూడా పొలిటికల్ డ్రామాగా మారబోతుందా అనే అనుమానాలు బలపడుతు న్నాయి. అనుమానమేలేదు, జరిగేది ఇంతే అని ఆయా రంగాల నిపుణులు, రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏవైనా.. ప్రత్యర్థులు, ప్రతిపక్షాలు, ప్రధాన నేతలు.. ఇలా అనేక మందికి సంబంధించిన ఫోన్లను ట్యా పింగ్ చేయడం ద్వారా ముందుగానే వారి ఆలోచనలను తెలుసుకుంటాయి. తద్వారా వారికి అడ్డుకట్ట వేసేందుకు వీలుగా వ్యూహా లు పన్ని.. ప్రతిపక్ష నేతలు, కీలక ప్రజాప్రతినిధులు, ప్రత్యర్థులకు చెక్ పెట్టడానికి 'నిఘా' వ్యవస్థలను వాడుకుంటున్నాయనే విమర్శ లు ఉన్నాయి.అయితే ఇది కేవలం బీఆర్ఎస్ ప్రభుత్వానికే పరిమితం కాదు.. అనేక రాష్ట్రాల్లో, ఆఖరికి కేంద్రంలోనూ ఇలాగే నిఘా పెట్టే అవకాశాలు కూడా ఉంటాయని నిపుణులు చెబుతుండటం గమనార్హం. అం టే ఇక్కడా, అక్కడా అనే తేడా లేకుండా ప్ర భుత్వాలు ఇలాంటి వ్యవహారాలను గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తుంటాయని స్పష్టమవుతున్నదిఇలాంటి ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాలను నడిపించడానికి అత్యంత అధునాతన సాంకేతికత, పరికరాలు కావాల్సి ఉంటుంది. తా జా సంఘటనలో 'పెగాసస్' సాంకేతికతను వాడినట్టుగా చెప్పుకుంటున్నారు. ఇలాంటి సాంకేతికత, పరికరాలు ఇజ్రాయెల్లో లభిస్తుంటాయి. అయితే, ఇలాంటి పరికరాలను ఏ ప్రభుత్వం కూడా అధికారికంగా తెప్పించుకోజాలదని నిపుణులు అంటున్నారు.ట్యాపింగ్కు ఉపయోగించే పరికరాలను ఇతర పేర్లతో తెప్పించుకుని, కస్టమ్స్ చెల్లించి మరీ ఉపయోగిస్తారని తెలుస్తుంది. అంటే.. ఎక్కడా కూడా ఈ పరికరాలకు సంబంధించిన అధికారిక రికార్డులు ఉండవనే నిఘా వర్గాల నిపుణులు చెబుతున్నారు. ఇంత చేస్తున్నా.. ఏ ప్రభుత్వం కూడా బహిరంగంగా తాము ఇలా నిఘా పెట్టామనే విష యాన్ని చెప్పుకోలేవుఇలా అత్యాధునిక సాంకేతికతో కూడిన పరికరాల ఉపయోగించి.. ఎవరికి సంబంధించిన సమాచారం కావాలనేది పైస్థాయిలో ఉండేవారు ఆదేశిస్తారు. కిందివారు దానిని పాటించి సమాచారాన్ని సేకరిస్తారు. ఇలా సేకరించిన సమాచారాన్ని కూడా అధికారిక పత్రాల్లో కాకుండా.. సాధారణ కాగితాలపై, చిన్న స్లిప్లపై పంపిస్తారు. ఇలా వచ్చిన సమాచారం చూసుకున్న తరువాత.. సదరు పైస్థాయి నేతలు,




అధికారులు ఆ కాగితాన్ని లేదా.. సమాచారం వచ్చిన దానిని కాల్చిపారేస్తారని నిఘా వర్గాల్లో పనిచేసే నిపుణులు చెబుతున్నారు.దీనివల్ల అటు ఎవరు ఆదేశించారనేది తెలియదు.. ఆ సమాచారం ఏమిటనేది కూడా మిగలదు. దీనితో ఇదంతా కేవలం డ్రామాగా మిగులుతుందని నిఘా వర్గాల నిపుణులు విశ్లేషి స్తున్నారు. ఇప్పుడు జరుగుతున్న సిట్ విచారణలో కూడా ఏ సమాచారం.. ఎవరి గురిం చి.. ఎప్పుడు కావాలని ఎవరు ఆదేశించారనేది తెలియదు. సీఎం నుంచి కిందిస్థాయి పోలీసు కానిస్టేబుల్ వరకు దీనిని ఎవరూ నిర్ధారించలేదు. అలాగే వచ్చిన సమాచారం ఏమిటనేది ఎక్కడా రికార్డులు ఉండవు. ఫైళ్లు అసలే ఉండవు. అంటే అది నిజమని చెప్పే ఒక్క సాక్ష్యం కూడా లేదనే చెప్పవచ్చు. కేసు ఇక కోర్టులో ఏం నిలుస్తుంది.? అని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి ప్రభుత్వం గతంలో జరిగిన సంఘటనలకు, ఫోన్ ట్యాపింగ్పై సిట్ వేసి విచారణ చేయిస్తోంది. ఇప్పుడు విచారణలో ఏం తేలినా.. అప్పట్లో ప్రతిపక్ష నేతలు, ముఖ్యమైన ప్రజాప్రతినిధులు, ప్రత్యర్థులు ఏం చేశారనే సమాచారం కూడా ఇప్పుడు విచారణ ఎదుర్కొంటున్న వారికి తెలిసి ఉంటుందని.. అయితే బయటపెట్టలేని పరిస్థితుల్లో ఉండటంతో వాటికీ విలువ ఉండదని విశ్లేషకులు అంటున్నారు.ఇప్పుడు విచారణ చేయిస్తున్న ప్రభుత్వానికి కూడా సమాచారం తెలిసినా.. ఏం చేయలేని పరిస్థితే ఉంటుందని.. వారంటున్నారు. ఇలా రెండు పక్షాలు కూడా కేవలం రాజకీయ డ్రామాను రసవత్తరంగా నడిపించడానికే విమర్శలు, ప్రతివిమర్శలు చేస్తుంటారని వారంటున్నారు.
వాస్తవానికి తాజాగా బీజేపీ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు రాంచందర్రావు ఒకానొక సందర్భంలో మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్పై సిట్ విచారణ అనేది ఉత్తిదేనని.. ఇప్పటి వరకు ఎందుకు ఒక్కరిని కూడా ఈ కేసులో అరెస్టు చేయలేదని విమర్శించడం గమనార్హం. అయితే విచారణలే తప్పితే.. అరెస్టులు ఉంటాయనే సూచనలు కూడా కనపడటం లేదు. అంటే ప్రతిపక్ష నేతలు చేస్తున్న విమర్శలు నిజమనే అనుమానాలు బలపడుతున్నాయి.

# ఆయిల్ ఫామ్ పంటను పండించేందుకు ముందుకు రావాలి

**సిద్దిపేట: పెన్ పవర్:** మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్రం మార్క్ పెట్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి తో కలిసి నంగునూరు మండలం నర్మెట్ట లో గల ఆయిల్ఫెడ్ ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని సందర్శించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలో ఈ సందర్భంగా మంత్రి మాట్లడుతూ ఈనెల చివరిలో గాని వచ్చే నెల మొదటి వారంలో గాని రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభించేందుకు ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని పరిశీలించామన్నారు. చిన్న చిన్న పనులు మరియు క్లీనింగ్ తప్ప దాదాపు పనులు పూర్తయ్యాయి. నాలుగు మెగావాట్ల కెపాసిటీ



గల ఆయిల్ ఫామ్ పిప్పి తో కూడిన వ్యర్థాలతో విద్యుత్ జనరేషన్ చేసే ప్లాంట్ కూడా పూర్తవుతుంది. పనులు మొత్తం పూర్తిగా గానే ఫ్యాక్టరీ ప్రారంభించడానికి ముఖ్యమంత్రి సమయం కోరుతానని అన్నారు.ఫ్యాక్టరీ లోనే మూడు రోజులపాటు రైతు మేళ నిర్వహించి ఆయిల్ ఫామ్ పంటలకు సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేసి వ్యవసాయ యాంత్రికరణ, అదునాతన వ్యవసాయ పద్ధతులపై ప్రదర్శన మరియు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులచే రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాము. 120 మెట్రిక్ టన్నుల వరకు గెలలను ప్రాసెస్ చేసే అవకాశం ఉన్న ఈ ఫ్యాక్టరీ ఉత్తర తెలంగాణ వరప్రదాయంగా మారుతుంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో పండిన ఆయిల్ ఫామ్ పంటను ఇక్కడ ప్రాసెస్ చేసే కెపాసిటీ ఈ ఫ్యాక్టరీ కి ఉంది. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు తీసుకున్న మొదటి రోజే నర్మెట్ట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి సంబంధించిన సంతకం పెట్టిన. ఒకటిన్నర సంవత్సరంలోనే ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి చేశాము. ఆరోజు ఆయిల్ ఫామ్ గెల ఒక మెట్రిక్ టన్నుకు 12000 రూపాయలు మాత్రమే ఉండే ఇప్పుడు 24,456 రూపాయలుగా పెరిగింది. మన రాష్ట్రంలో నిర్ణయించే ఆయిల్ ఫామ్ గెలల ధరనే దక్షిణ భారత దేశంలో అమలవుతుందని అన్నారు. రాష్ట్రంలో మూడు, నాలుగు సంవత్సరాల నుండి ఆల్ఫా మొక్కలను పెట్టడం జరిగింది అవి కోతకు రాగానే ఫ్యాక్టరీ అందుబాటులో ఉండాలని వేగంగా నిర్మించడం జరిగింది. ముఖ్యమంత్రి ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ప్రారంభించడంతో పాటు ఆయిల్ రిఫైనరీ యూనిట్ నిర్మించడానికి శంకుస్థాపన చేయడం జరుగుతుంది. దేశంలో ప్రస్తుతం 12 లక్షల ఎకరాలలో ఆయిల్ ఫామ్ పంట సాగు అవుతుంది. ఇంకా దేశంలో 70 లక్షల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ పంట సాగు చేయవలసిన అవసరం ఉంది. సిద్దిపేట జిల్లాలో 14 నుండి 15 వేల ఎకరాలలో ఆయిల్ ఫామ్ పంట సాగు అవుతుంది. లక్ష కోట్ల రూపాయల విలువైన ఆయిల్ ను ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నాము. రైతులకు ఎలాంటి నష్టం కలగజేయని ఆయిల్ ఫామ్ పంటను పండించేందుకు ముందుకు రావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ డైరెక్టర్ మరియు ఆయిల్ ఫెడ్ ఎండి యాస్మిన్ భాష, ఫ్యాక్టరీ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా ఉద్యానవన అధికారి సువర్ణ, జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, ఆయిల్ ఫెడ్ అధికారులు పాల్గొన్నారు.

## ఫిజియోథెరపీ డాక్టర్ ఆత్మహత్య



**కుత్బుల్లాపూర్: పెన్ పవర్:** సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఫిజియోథెరపీ డాక్టర్ ఆత్మహత్య చేసుకుంది. సాయిబాబా నగర్ లో నివాసముండే బత్తిని అనిత 29,(ఇంకా వివాహం కాలేదు) ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్ కు ఉరి వేసుకుని సూసైడ్ చేసుకుంది. మృతురాలు ఎల్బీ నగర్ షైన్ ఆసుపత్రిలో ఫిజియోథెరఫిస్ట్ గా పని చేస్తుంది. ప్రేమ వ్యవహారమే ఆత్మహత్య కు కారణమని తెలుస్తుంది. సురారం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఘటన సమయంలో చికిత్స పొందుతున్న తల్లి దగ్గర హాస్పటల్ లో తండ్రి రాజమల్లు వున్నాడు. ..

## బీఆర్ఎస్ నేతలపై దాడి

## సీపీ కి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** సైబరాబాద్ సీపీకి బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేసారు. శుక్రవారం నాడు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ శ్రేణులపై జరిపిన దాడిని నిరసిస్తూ గచ్చిబౌలి సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయంకు బిఆర్ఎస్ ముఖ్య నేతలు వచ్చారు.ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తూ, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సైబరాబాద్ పోలీస్ కమిషనర్ను ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు,మాజీ మంత్రి మల్లారెడ్డి ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ కలిసారు...

# ఓటర్లపై పవన్ ముద్ర సాధ్యమేనా

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, పెన్ పవర్:** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య హోరాహోరీ పోరు సాగుతున్న తరుణంలో, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎంట్రీతో ఎన్నికల ముఖచిత్రం ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా మంగళగిరి వేదికగా జరిగిన కీలక సమావేశం, బీజేపీ–జనసేన మైత్రి తెలంగాణ గడ్డపై ఏ మేరకు ప్రభావం చూపుతుందనే చర్చకు తెరలేపింది. మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో తెలంగాణ జనసేన ముఖ్య నేతలతో పవన్ కల్యాణ్ సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో పార్టీ ఉపాధ్యక్షుడు బొంగునూరి మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, ఇంచార్జి శంకర్ గౌడ్ వంటి కీలక నేతలు పాల్గొన్నారు. ఈ భేటీలో పవన్ ప్రధానంగా మూడు అంశాలపై దృష్టి సారించారు. జనసేన పోటీ చేస్తున్న స్థానాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. అలాగే క్షేత్రస్థాయిలో బీజేపీ కార్యకర్తలతో కలిసి పనిచేయాలని నేతలకు సూచించారు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉండటం, బీఆర్ఎస్ తన ఉనికిని చాటుకోవడానికి ప్రయత్నిస్తుండటంతో బీజేపీ కొంత ఒత్తిడిలో ఉన్న మాట వాస్తవం. ఈ క్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు.. పవన్ కల్యాణ్‌ను కలిసి మద్దతు కోరడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. పవన్ కేవలం తన పార్టీ అభ్యర్థులకే కాకుండా, బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కూడా ప్రచారం చేస్తానని ప్రకటించడం కమలం పార్టీకి కొండంత అండగా మారింది. పవన్ కల్యాణ్ ప్రచార నిర్ణయం వ్యూహం దాగిఉందని భావిస్తున్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో పవన్ కల్యాణ్‌కు భారీ ఫాలోయింగ్ ఉంది. మున్సిపల్ ఎన్నికలు పట్టణ ఓటర్లతో ముడిపడి ఉన్నందున, ఆయన ప్రచారం యువతను, సినీ అభిమానులను పోలింగ్ బూత్‌ల వైపు నడిపించే అవకాశం ఉంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలతో పాటు జనసేన కూడా ప్రభావం చూపితే, ఓట్ల చీలిక ఎవరికి నష్టం చేస్తుందనేది ఆసక్తికరం. గతంలో జనసేన పోటీ చేయని చోట్ల ఓట్లు ఇతర పార్టీలకు మళ్లగా, ఇప్పుడు ఆ ఓట్లు జనసేన–బిజెపి కూటమికి పడే అవకాశం ఉంది. క్షేత్రస్థాయిలో వెనుకబడినట్లు



కనిపిస్తున్న బీజేపీ కార్యకర్తలకు పవన్ రాక కొత్త ఉత్సాహాన్ని ఇస్తుంది. కిషన్ రెడ్డి వంటి సీనియర్ నేతల విజ్ఞప్తి మేరకు పవన్ స్పందించడం, భవిష్యత్తులో ఈ రెండు పార్టీల పొత్తు మరింత బలపడుతుందనే సంకేతాలను ఇస్తోంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఆయన నిర్వహిస్తున్న అధికారిక బాధ్యతలు, కీలక సమీక్షా సమావేశాల వల్ల సమయం కేటాయించడం కుదరలేదని తెలుస్తోంది. ఏపీలో పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి కొన్ని అత్యవసర ప్రాజెక్టుల తుది గడువు ఉండటం, అలాగే సనాతన ధర్మ రక్షణకు సంబంధించి ఆయన చేపట్టిన ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాల బిజీ కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. అలాగే భారీ జనసందోహం వచ్చే అవకాశం ఉండటంతో, భద్రతా ఏర్పాట్లు , ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని స్థానిక యంత్రాంగం నుంచి అనుమతుల విషయంలో కొన్ని సాంకేతిక ఇబ్బందులు తలెత్తినట్లు సమాచారం. రాజకీయ కారణాలు కూడా ఉన్నట్లుగా తెలుస్తోంది. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల తరపున ప్రచారం చేసేందుకు పవన్ కల్యాణ్ రావడాన్ని కాంగ్రెస్ నేతలు తీవ్రంగా విమర్శించారు. ఏపీలో అధికారంలో ఉండి, తెలంగాణ ప్రయోజనాల విషయంలో స్పష్టత లేని పవన్.. ఇక్కడ ఏ ముఖంపెట్టుకుని ప్రచారం చేస్తారని వారు ప్రశ్నించారు. గతంలో తెలంగాణను అవమానించారని ఆరోపించారు. ఈ విమర్శలపై జనసేన గట్టిగానే స్పందించింది. పవన్ కల్యాణ్ ఒక జాతీయ భావజాలం ఉన్న నాయకుడని, రెండు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కోరుకునే వ్యక్తిని విమర్శించడం సరికాదని పార్టీ నేతలు హితవు పలికారు. కేవలం రాజకీయ విద్వేషాలను రెచ్చగొట్టడానికే ప్రతిపక్షాలు ఇలాంటి విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఇక ఈ విమర్శల వల్లే ప్రచారం ఆగిపోయిందా అన్న చర్చపై రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. విమర్శలు రావడం సహజమే అయినా, అవే ప్రచారం రద్దుకు ప్రధాన కారణం కాదనిజనసేన వర్గాలు అంటున్నాయి. ఏపీలో పాలనాపరమైన ఒత్తిడి, భద్రతా కారణాలు, పొత్తులో భాగంగా క్షేత్రస్థాయిలో బీజేపీ–జనసేన క్యాడర్ మధ్య సమన్వయ లోపం వంటి అంశాలే పర్యటన రద్దుకు దారితీసినట్లుతెలుస్తోంది. ప్రత్యర్థుల విమర్శలకు భయపడి వెనక్కి తగ్గే నాయకుడు పవన్ కల్యాణ్ కాదని, కేవలం అనివార్య కారణాల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నారని పార్టీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. మొత్తానికి పవన్ ప్రచారం మాత్రం ఆగిపోయింది.

# మున్సిపల్ ఎన్నికల్లో ట్రయాంగిల్ ఫైట్

**కరీంనగర్, ఫిబ్రవరి 8, పెన్ పవర్:** తెలంగాణ వ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో రాజకీయం పూర్తిగా కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ గా మారిపోయింది. పార్లమెంట్ ఎన్నికల నాటి నుంచి కొనసాగుతున్న జోరును మున్సిపల్ కేంద్రాల్లోనూ ప్రదర్శించి, పట్టణ ఓటర్లపై పట్టు సాధించాలని బీజేపీ వ్యూహరచన చేస్తోంది. మరోవైపు, అధికార యంత్రాంగం అండతో పాటు గ్యారెంటీల అమలును ప్రచార అస్త్రంగా చేసుకుని కాంగ్రెస్ ఇక్కడ జైత్రయాత్ర కొనసాగించాలని చూస్తోంది. దక్షిణ తెలంగాణలో మాత్రం త్రిముఖ పోటీ కనిపిస్తోంది. దక్షిణ తెలంగాణ ప్రాంతాలైన ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో రాజకీయ వాతావరణం భిన్నంగా ఉంది. ఇక్కడ కాంగ్రెస్‌కు బలమైన క్యాడర్ ఉండగా, బీఆర్ఎస్ తన పట్టును కాపాడుకోవడానికి గట్టిగా పోరాడుతోంది. ఈ ప్రాంతంలో నల్గొండ, కొత్తగూడెం, మహబూబ్‌నగర్ వంటి 3 కార్పొరేషన్లతో పాటు పెద్ద సంఖ్యలో మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇక్కడ బీజేపీ కూడా తన ప్రాబల్యాన్ని పెంచుకోవాలని చూస్తుండటంతో పోరు త్రిముఖంగా మారింది. ప్రస్తుత ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్షేత్రస్థాయిలోకి వెళ్తోంది. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులే తమకు అండగా నిలుస్తారని భావిస్తున్న హస్తం పార్టీ, దాదాపు అన్ని వార్డుల్లోనూ అభ్యర్థులను నిలబెట్టి బలమైన ఉనికిని చాటుతోంది. అయితే, అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రత్యర్థులను అణచివేస్తున్నారనే ఆరోపణలను కాంగ్రెస్ ఎదుర్కొంటోంది. ముఖ్యంగా దక్షిణ తెలంగాణలోని తన కంచుకోటలను కాపాడుకోవాలన్న పట్టుదలతో ఉంది. బీజేపీ కేంద్ర నిధుల వినియోగం, హిందుత్వ ఎజెండా,స్థానిక సమస్యలపై ఛార్జ్‌షీట్ల విడుదల ద్వారా దూకుడుగా ప్రచారం చేస్తోంది. పట్టణ ఓటర్లు



తమవైపే ఉన్నారనే ధీమాతో అర్బన్ ఏరియాల్లో కమలం జెండా ఎగురవేయాలని చూస్తోంది. ఇదే సమయంలో, బీఆర్ఎస్ ఈ ఎన్నికలను తమ మనుగడకు అత్యంత కీలకంగా భావిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో చేసిన పట్టణ ప్రగతి పనులను వివరిస్తూ, కేటీఆర్ , హరీష్ రావు నేతృత్వంలో కేడర్‌ను సమాయత్తం చేస్తోంది. త్రిముఖ పోటీ జరుగుతున్న ప్రధాన పోటీ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యనే దక్షిణ తెలంగాణలో సాగుతోంది. దక్షిణ తెలంగాణ మున్సిపాలిటీల్లో పార్టీల కంటే అభ్యర్థుల ఎంపిక, రెబెల్స్ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. టికెట్ దక్కని నాయకులు స్వతంత్రులుగా బరిలోకి దిగడం అన్ని పార్టీలకూ తలనొప్పిగా మారింది. ఓట్లు చీలితే అది ఎవరికి లాభిస్తుందనేది అంచనాలకు అందడం లేదు. ఈ మున్సిపల్ ఎన్నికలు కేవలం స్థానిక సంస్థలకే పరిమితం కాకుండా, రాష్ట్రంలో బలమైన ప్రత్యామ్నాయం ఎవరు అనే ప్రశ్నకు సమాధానం ఇవ్వబోతున్నాయి. ఉత్తర తెలంగాణలో బీజేపీ తన పట్టును నిరూపించుకుంటే, రాష్ట్ర రాజకీయాల్లో కాంగ్రెస్‌కు ప్రధాన ప్రత్యర్థిగా నిలుస్తుంది. లేకపోతే బీఆర్ఎస్ తన స్థానాన్ని కాపాడుకుంటుంది. అందుకే హోరాహోరీగా ప్రయత్నాలు చేస్తోంది.

# జంట నగరాలుగా ఆ రెండు సిటీస్



**వరంగల్, ఫిబ్రవరి 8, పెన్ పవర్:** మున్సిపల్ ఎన్నికలు ఈనెల 11న జరగనున్నాయి. దీంతో రాష్ట్రంలో మెజారిటీ మున్సిపాలిటీలను తన ఖాతాలో వేసుకోవాలని అధికార కాంగ్రెస్ భావిస్తోంది. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రచారరంగంలోకి దిగారు. ఫిబ్రవరి 4న మిర్యాల గూడలో ప్రచారం నిర్వహించారు. ఇక ఫిబ్రవరి 5న కరీంనగర్ జిల్లాలో ప్రచారం నిర్వహించారు. చొప్పదండిలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం కీలక ప్రకటన చేశారు. భవిష్యత్ ప్రణాళికలో కరీంనగర్, వరంగల్ జంటనగరాలుగా మారాలని ఆకాంక్షించారు. ఔటర్ రింగ్‌రోడ్ నిర్మాణం, మామునూరు విమానాశ్రయం ఆధునీకరణలతోపాటు, రెండు ప్రాంతాల మధ్య పెద్ద విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉన్నట్లు తెలిపారు. ఇది మౌలిక సదుపాయాల కల్పనతోపాటు స్థిరమైన అభివృద్ధికి మార్గం సుగమం చేస్తుందని తెలిపారు. వరంగల్, కరీనగర్ మధ్యలో భారీ డంపింగ్ యార్డు నిర్మించి, అక్కడ నగర వ్యర్థాలను విద్యుత్‌గా మార్చే ప్రణాళిక దేశవ్యాప్తంగా మార్గదర్శకంగా మారుతుందని సీఎం తెలిపారు. ఇలాంటి వేస్ట్‌టుఎనర్జీ ప్రాజెక్టులు నీటి సమస్యలను తగ్గించి, విద్యుత్‌ను పెంచుతాయి. మున్సిపల్ కార్పొరేషన్ల అభివృద్ధితోపాటు, ఈ చొరవ గ్రీన్ ఎనర్జీ మోడల్‌గా పనిచేస్తూ, ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది. ఫలితంగా, స్థానిక సమాజాలకు శుభ్రత, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. విమానాశ్రయం, రింగ్ రోడ్‌తో కలిసి ఈ జంట నగరాలు ఆకర్షణీయ పెట్టుబడి కేంద్రాలుగా మారతాయి. వ్యాపారం, పర్యాటకం, ఉత్పాదక రంగాలు ఊపందుకుని, ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఉంది. అయితే, భూమి సేకరణ, ఆర్థిక భారం వంటి సవాళ్లను అధిగమించాలి. విజయం కోసం ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్యాలు అవసరం. దీర్ఘకాలంలో, తెలంగాణ పట్టణాలలో అభివృద్ధి అసమానతలు తగ్గుతాయి. ప్రభుత్వ బడ్జెట్, కేంద్ర సహాయం, స్థానిక సహకారం ఈ ప్రాజెక్టుల వేగాన్ని నిర్ణయిస్తాయి. ఇప్పటికే విజయవంతమైన హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ ఆధారంగా, ఇక్కడ కూడా సామర్థ్యవంతమైన ప్రణాళికలు ఫలిస్తాయి. మొత్తంగా, ఈ చొరవ తెలంగాణను ఆధునిక రాష్ట్రంగా రూపొందిస్తూ, గ్రామీణపట్టణ సమతుల్యతను సాధిస్తుంది.

## ఈద్గా మైదానం కోసం ముస్లీంల అందోళన

**హైదరాబాద్ పెన్ పవర్:** బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10 లోని ఐఏఎస్ ఐపీఎస్ క్వార్టర్స్ ను ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఈద్గా మైదానంగా ప్రకటించాలని మైనారిటీలు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. తాజాగా ప్రభుత్వం ఈ స్థలాన్ని రిజిస్ట్రేషన్ శాఖతోపాటు, విద్యుత్ శాఖకు కేటాయించింది. ప్రభుత్వ శాఖలకు ఈ స్థలాన్ని కేటాయించడంతో తమకు ప్రార్థనలు చేసుకోవడానికి, స్థానికంగా ఉండే యువతకు క్రీడామైదానం పోతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తుంది



**నల్గొండ పెన్ పవర్:** నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి 11వ డివిజన్ నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి దండంపల్లి నాగజ్యోతి పరశు రాం కి మద్దతుగా విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గుండ్లపల్లి ఎక్స్ రోడ్ మామిళ్ళగూడెం, కతాల్ గూడెం ప్రాంతాల్లో నిర్వహించిన రోడ్ షోలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, నల్గొండ అభివృద్ధి కొనసాగాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల మెరుగుదల, సమగ్ర అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తుందని మంత్రి పేర్కొన్నారు.

## బెల్లంపల్లి ఫుడ్ పాయిజన్ ఘటనపై.. ఎమ్మెల్సీ మల్క కొమరయ్య సీరియస్



**హైదరాబాద్ పెన్ పవర్:** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటనపై ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య మండిపడ్డారు. విషయం తెలుసుకొని శనివారం హుటాహుటిన బెల్లంపల్లి ప్రభుత్వ అస్పత్రికి వెళ్లి విద్యార్థినులను పరామర్శించారు.

బాధిత విద్యార్థినులతో మాట్లాడి ఫుడ్ పాయిజన్ ఘటనపై ఆరా తీసారు. విద్యార్థినుల క్షేమ సమాచారం తెలుసుకొని.. వారికి మెరుగైన వైద్యం అందించాలని అస్పత్రి సూపరింటెండెంట్, డాక్టర్స్ అస్పత్రి సిబ్బందిని ఆదేశించారు. ప్రతిసారి గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఎందుకు జరుగుతోంది. అధికారుల పర్యవేక్షణ ఎందుకు కొర్వడుతోంది? పై విషయాలపై పూర్తి స్థాయి విచారణ చేసి సమగ్ర రిపోటర్ ఇవ్వాలని ఆదేశించారు. ఈ ఘటనకు బాధ్యులు ఎవరో నిగ్గు తెల్చాలి, మళ్ళీ ఇలాంటివి జరగకుండా చూడాలని ఆదేశించారు. ఫుడ్ పాయిజన్ ఎందుకు జరిగింది, విద్యార్థిలు ఇలాంటి ఫుడ్ తీసుకోవడం వాళ్ళ అశ్వస్థ కు గురయ్యారు... ఇలాంటివి జరగకుండా ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో రిపోర్ట్ హెల్త్ డైరెక్టర్ కు పంపాలని ఆదేశించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరగడం బాధాకరం. ఇది పూర్తిగా గురుకులాలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం . పిల్లల ప్రాణాలంటే మీకు లెక్కలేదా..? ఎన్ని సార్లు రిపీట్ అవుతాయని అన్నారు. గురుకులాలపై పర్యవేక్షణ లేకపోవడం వల్లే తరుచూ ఇలాంటి ఘటనలు . ఈ ఫుడ్ పాయిజన్ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు.

## ఈ నెల 13 నుంచి జ్యువెల్స్ షో

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జ్యువెల్స్ షో 2026 ఈనెల 13వ తేదీ నుంచి హైటెక్ సిటీలోని ది వెస్టిన్ హోటల్లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. దీనికి సంబంధిం చినసన్నాహక కార్యక్రమం బంజారాహిల్స్ లో జరిగింది. సినీ నటి హిమజతో పాటు, పలువురు మోడల్స్ ఈ కార్యక్రమంలో పాల్గొని బ్రోచర్ ఆవిష్కరించారు. అనంతరం ఈ ఆసియా జ్యువెల్స్ ఎక్స్పోలో ప్రదర్శించనున్న ఆభరణాలను మోడల్స్ ధరించి ఆకట్టుకున్నారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ ఎగ్జిబి షన్లో దేశవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన డిజైనర్లు రూపొందించిన ఆభరణాలు ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

## మహాశివరాత్రి ఏర్పాట్లపై శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో సమీక్ష

**హైదరాబాద్ పెన్ పవర్:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకుముందు ఆలయానికి విచ్చేసిన మంత్రి ఆనం కు ఆలయ అధికారులు, దేవాదాయ శాఖ అధికారులు ఘన స్వాగతం పలికారు. మంత్రి ఆనం కు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి ఆశీర్వచనం వేద పండితులు అందించారు.

మహాశివరాత్రి పర్వదినం రోజున లక్షలాది భక్తులు తరలివచ్చే నేపథ్యంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులను న మంత్రి ఆనం ఆదేశించారు.

భక్తుల క్యూలైన్ నిర్వహణ, దర్శన వేగవంతం, ప్రసాద పంపిణీ, తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్య ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ఆలయ పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, భక్తుల భద్రత కోసం పోలీసు శాఖతో సమన్వయం చేయాలని స్పష్టం చేసారు. ఉ అత్యవసర వైద్య సేవలు, అంబులెన్సులు, ఫైర్ సేఫ్టీ చర్యలు సిద్ధంగా ఉంచాలని సంబంధిత శాఖలను సూచించారు.

మహిళలు, వృద్ధులు, దివ్యాంగ భక్తులకు ప్రత్యేక దర్శన సౌకర్యాలు కల్పించాలని మంత్రి అదేశించారు.

ఈ సమీక్ష సమావేశంలో స్థానిక శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ హరి జవహర్లాల్, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, ఆలయ చైర్మన్ కొట్టె సాయి, కార్య నిర్వహణ అధికారి బాపిరెడ్డి , తదితర ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పార్టీపై కసరత్తు తీవ్రం చేసిన కవిత



**హైదరాబాద్, ఫిబ్రవరి 8, పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకోబోతోంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కవిత బిఆర్ఎస్ పార్టీపై, రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆమె, బీసీల పట్ల బీఆర్ఎస్ పార్టీకి ఎన్నడూ చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బీసీ సామాజిక వర్గం ఆ పార్టీకి ఓటు వేయాలో వద్దో ఆలోచించుకోవాలని పిలుపునిచ్చారుబీఆర్ఎస్ వైఖరిపై విమర్శలు: ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రచారం అస్సలు కనిపించడం లేదని, ఆ పార్టీ నాయకులు కింది స్థాయిలో అసలు యాక్టివ్‌గా లేరని కవిత ఎద్దేవా చేశారు. "కృష్ణార్జునులు లాంటి పెద్ద నాయకులు రాష్ట్రమంతా ఎందుకు పర్యటించడం లేదు? వారిని గాలికి వదిలేశారా?" అని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పిటిషన్ వేసిన వ్యక్తికి టికెట్ కేటాయించడాన్ని బట్టి చూస్తే, ఆ పార్టీకి బీసీలపై ఉన్న ప్రేమ ఎంతో అర్థమవుతుందని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ చరిత్ర చెరిపేస్తే చెరిగిపోయేది కాదని, కానీ ప్రస్తుత పార్టీ తీరు సరిగ్గా లేదని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా తన భవిష్యత్ రాజకీయ ప్రణాళికను కవిత వెల్లడించారు. తాము ఒక కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేసే ప్రక్రియలో ఉన్నామని, దీనికి సంబంధించి మంచి ముహూర్తం కోసం ఎదురుచూస్తున్నామని తెలిపారు. మరో మూడు నెలల్లో పార్టీ ఏర్పాటు ప్రక్రియ మొత్తం పూర్తవుతుందని ఆమె స్పష్టం చేశారుప్రభుత్వానికి సూచనలు: కేవలం విపక్షాలనే కాకుండా, కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా ఆమె విమర్శలు చేశారు. బీసీలకు ఇచ్చిన హామీలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, సబ్‌ప్లాన్‌కు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకోవడం సరికాదని హితవు పలికారు. ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నిస్తానని, తన మాటల్లో నిజాయితీ లేకపోతే ప్రజలే నిలదీస్తారని కవిత పేర్కొన్నారు.

# బైక్ కొనివ్వలేదని తండ్రిని హతమార్చిన కొడుకు

**మెదక్: పెన్ పవర్:** బైక్ కొనివ్వలేదని తండ్రిని కొడుకు హతమార్చిన ఘటన ఇది. మెదక్ జిల్లా రేగోడ్ మండల కేంద్రంలో షకీర్(51) అనే వ్యక్తి కూరగాయలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. గత కొంత కాలంగా తనకు బైక్ కొనివ్వాలని, భూమి అమ్మి డబ్బులు ఇవ్వాలని తల్లిదండ్రులను షకీర్ కొడుకు మొహమ్మద్ హుస్సేన్ వేధిస్తున్నాడు. నెల రోజుల క్రితం డబ్బులు ఇవ్వడంలేదని తండ్రిపై దాడి చేయగా, ఇద్దరి మధ్య గ్రామ పెద్దలు రాజీ కుదిర్చారు. ఈ నేపథ్యంలో రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న తండ్రిని, బయటికి లాక్కొచ్చి కొట్టడంతో షకీర్ తీవ్ర గాయాలపాలయ్యి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కాంగ్రెస్ లో వర్గపోరు

# రెబెల్స్ వ్యవహారం పై టీపీసీసీ సీరియస్



**హైదరాబాద్: పెన్ పవర్:** జగిత్యాల కాంగ్రెస్ లో వర్గవిభేదాలపై పార్టీ స్పందించింది. సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ పెద్దలు చర్యలకు సిద్ధమయ్యారని సమాచారం. జగిత్యాలలో బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన ఎమ్మెల్యే సంజయ్ మనుషులకి బీ ఫారం ఇచ్చి, తన అనుచరులకు బీ ఫారం ఇవ్వకుండా మోసం చేశారని, జీవన్ రెడ్డి తన అనుచరులను స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దింపారు. కాంగ్రెస్ పార్టీ బీ ఫారంపై పోటీ చేస్తున్న అభ్యర్థులను, జీవన్ రెడ్డి లాంటి సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఓడించడం క్రమశిక్షణారాహిత్యంగా అధిష్ఠానం భావిస్తోంది. వర్గపోరు వల్ల ఒకరి అనుచరులను ఇంకొకరు ఓడించడం పార్టీకి నష్టం కలిగిస్తుందని అధిష్ఠానం భావిస్తోంది. మరోవైపు గద్వాల, మహబూబాబాద్ లాంటి ప్రాంతాల్లో కూడా కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు బయటపడడంతో, రెబల్ అభ్యర్థుల బలం ముందు కాంగ్రెస్ అభ్యర్థులు ఓడిపోతారని పార్టీ సీనియర్ నాయకుల భావన. దీంతో జగిత్యాలతో పాటు వర్గపోరు ఉన్న అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇన్చార్జి మంత్రులకు రేవంత్ రెడ్డి ఆదేశాలు ఇచ్చారు.

# క్యాబ్ డ్రైవర్ల అందోళన

**రాజేంద్రనగర్ పెన్ పవర్:** దేశవ్యాప్తంగా ర్యాపిడో, ఓలా, ఉబెర్ డ్రైవర్ల స్ట్రైక్ చేపట్టింది. ఈ రోజు "ఆల్ ఇండియా బ్రేక్ డౌన్ " కు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఓలా, ఉబర్, రాపిడో డ్రైవర్లు సమ్మె చేస్తున్నారు . యాప్ ఆధారిత క్యాబ్ డ్రైవర్ల ఆందోళనకు దిగారు. డ్రైవర్లు యాప్లను ఆఫ్ చేసి రైడ్స్కు నిరాకరిస్తున్నారు. పలు నగరాల్లో క్యాబ్ సర్వీసులు పూర్తిగా నిలిచిపోయాయి. కనీస బేస్ ఫేర్ లేకపోవడంపై డ్రైవర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. డ్రైవర్ల స్ట్రైక్ ను పాటించకుండా నడుపుతున్న వారిపై బలవంతంగా వాహనాలను రోడ్ పై ఆపి ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించారు. అయితే, యాప్ కంపెనీల ఇష్టారాజ్యంగా ధరల నిర్ణయంతో డ్రైవర్ల ఆదాయం తగ్గుతుంది. కంపెనీలు ఎక్కువ కమిషన్లు వసూలు చేస్తున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన కనీస ప్రయాణ ఛార్జీలు అమలు చేయాలంటున్నారు.

ఫేర్ నిర్ణయంలో యాప్ కంపెనీల ఏకపక్ష నిర్ణయాలకు ముగింపు పలకాలని డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. ప్రైవేట్ వాహనాలతో కమర్షియల్ రైడ్స్ నిషేధించాలని డిమాండ్ చేస్తున్నారు. డిమాండ్స్ నెరవేర్చకపోతే మరింత తీవ్రమైన ఉద్యమాలు, భవిష్యత్తులో దీర్ఘకాలిక స్ట్రైక్ చేస్తామని ర్యాపిడో, ఓలా, ఉబెర్ డ్రైవర్లు హెచ్చరిస్తున్నారు.

## ఫోరెన్సిక్ ల్యాబ్లో భారీ అగ్నిప్రమాదం

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ నాంపల్లిలోని ఫోరెన్సిక్ ల్యాబ్లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. భవనం మొదటి అంతస్తులో ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంతో పరిసర ప్రాంతమంతా దట్టమైన పొగతో నిండిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేసారు. భారీగా పొగ కమ్ముకోవడంతో సహాయక చర్యలు కష్టతరంగా మారాయి.

# ఎంపీ వద్దిరాజు కొత్తగూడెం 54వ డివిజన్ లో ఎన్నికల ప్రచారం

**కొత్తగూడెం: పెన్ పవర్:** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మునిసిపల్ మాజీ ఛైర్ పర్సన్ కాపు సీతామహాలక్ష్మీ తదితర నాయకులతో కలిసి కొత్తగూడెం 54వ డివిజన్ సవాయ్ బస్తీలో ప్రచారం నిర్వహించారు. ప్రచార కార్యక్రమంలో ఎంపీ రవిచంద్ర వెంట బీఆర్ఎస్ డివిజన్ అభ్యర్థి మాదాసు పద్మ, నాయకులు బొమ్మిడి రమాకాంత్ యాదవ్, రాజేష్ (కన్ని),బొమ్మడి శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# పరీక్షలపై చర్చలో మోదీ విలక్షణ మార్గదర్శనం

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశవ్యాప్తంగా ఉన్నత పాఠశాల విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, తల్లితండ్రులు ఎదురు చూస్తున్న వార్షిక కార్యక్రమంగా ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించే "పరీక్షా పే చర్చా లేదా పిపిసి (పరీక్షలపై చర్చ)" వేదిక అందరి మన్ననలు పొందుతున్నది. యువభారత రేపటి పౌరుల సక్రమ నిర్మాణానికి, రాబోయే వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఈ కార్యక్రమం ఉత్ప్రేరకంగా పని చేస్తున్నది. దేశవ్యాప్తంగా 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీవిద్యార్థులు పాల్గొంటున్న "పరీక్షా పే చర్చా" 2018 ఫిబ్రవరి 16న ప్రారంభమైంది. 10 ఫిబ్రవరి 2025 రోజు నిర్వహించిన 8వ విడత పరీక్షా పే చర్చా కార్యక్రమంలో 3.53 కోట్ల మంది యువత పాల్గొని అత్యధిక ఆన్‌లైన్ నమోదు పొంది 'గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు సాధించింది. 06 ఫిబ్రవరి 2026 ఉదయం 10 గంటలకు దేశ ప్రధానమంత్రి నిర్వహించిన 9వ విడత 'పరీక్షా పే చర్చా' కార్యక్రమంలో 4.5 కోట్ల విద్యార్థులు, 24.8 లక్షల ఉపాధ్యాయులు, 6.15 లక్షల తల్లితండ్రులు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. కోయంబత్తూర్, ఛత్తీస్‌గఢ్, రాయ్‌పూర్, దేవ్ మోగ్రా, గువాహటీల నుంచి ఈ కార్యక్రమం ఆన్‌లైన్‌లో నిర్వహించడం, అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులు నేరుగా చూడగలగడం, ప్రేరణ పొందడం జరుగుతోంది. రాబోయే వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి సంబంధించిన పలు అంశాలను మోదీ వాక్కుల రూపంలో ఈ వేదిక వివరిస్తున్నది. మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రచించిన "ఎగ్జాం వారియర్స్" అనే పుస్తకం ప్రేరణగా ఈ కార్యక్రమం లక్ష్యంగా పెట్టుకుంది. 06 ఫిబ్రవరి 2026న నిర్వహించిన కార్యక్రమంలో పరీక్షల సమయంలో విద్యార్థులు ఎదుర్కొనే అర్థం లేని భయాలు, అనవసర ఒత్తిడి, అసంబద్ధ అనుమానాలు లాంటి అంశాల పట్ల సరైన సమాధానాలను నేరుగా మోదీ ద్వారా పొందడం జరిగింది. సానుకూల దృక్పథం పెంపొందించుకోవడం, పట్టుదలతో చదవడం, ఏకాగ్రతను పెంచుకోవడం, సమయపాలన పాటించడం, మానసిక ఆరోగ్యం పొందడం, ఆత్మవిశ్వాసం పెంచుకోవడం, ఉన్నత లక్ష్యాలను సాకారం చేసుకోవడానికి క్రమశిక్షణతో చదవడం, ప్రశాంతంగా పరీక్షా హాలులోకి ప్రవేశించడం లాంటి అంశాల పునాదిగా కొనసాగిన ఈ కార్యక్రమం ఫలితంగా ఉత్తమ ఫలితాలు పొందడం జరుగుతుందని తెలిపారు. పరీక్షలు ధైర్యంగా రాయడానికి కావలసిన మానసిక ప్రశాంతతలు, సరైన చిట్కాలు, పోషకాహార ప్రాముఖ్యత, అందరి నుంచి విని మనదైన శైలిలో సాగడం, విద్యతో పాటు నైపుణ్యాలు నేర్చుకోవడం, జీవన నైపుణ్యాలు అలవరచుకోవడం లాంటి పలు ఆసక్తికరమైన సూచనలు, విద్యార్థులు అడిగిన ప్రతి ప్రశ్నలకు మోదీ ధీన సమాధానాలు, బాల కవుల కవితలు, పిల్లలు గీసిన బొమ్మలు, పాడిన పాటలతో ఈ కార్యక్రమం ఆద్యంతం ఆసక్తికరంగా, ఆచరణ యోగ్యంగా కొనసాగడం ద్వారా పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంచడానికి, ఉత్తమ ఫలితాలను చేజిక్కించుకోవడానికి విద్యా మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ "పరీక్షా పే చర్చా" కార్యక్రమం చక్కగా ఉపయోగపడుతున్నది. 03 అక్టోబర్ 2014 రోజు భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన మరో వినూత్న కార్యక్రమం "మన్ కీ బాత్ (మనసులో మాట)" ద్వారా ఆల్ ఇండియా రేడియోలో ప్రసారం అయ్యింది. అప్పటి నుంచి ప్రతి నెల చివరి ఆదివారం రోజు ఉదయం 11 గంటలకు ఈ రేడియో ప్రసారం జరుగుతుంది. ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా 23 జాతీయ భాషలు, 31 మాండలికాల్లో ప్రసారం అవుతున్నది. వీటికి తోడుగా ఇంగ్లీష్‌తో పాటు 11 అంతర్జాత భాషల్లో కూడా ప్రసారం కావడం విశేషం. 30 ఏప్రిల్ 2023 రోజు 100వ మన్ కీ బాత్ ప్రసారం అయ్యింది. 25 జనవరి 2026 రోజు నిర్వహించనున్న మన్ కీ బాత్ కార్యక్రమం 130 ఎపిసోడ్‌గా నిలువనుంది. 27 జనవరి 2015 రోజు ప్రసారమైన మన్ కీ బాత్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నాటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా హాజరు కావడం, 19 సెప్టెంబర్ 2019 రోజు లా మంగేష్కర్ ప్రత్యేక అతిథిగా హాజరు కావడం గమనార్హం. ప్రతి మాసం ప్రసారం అవుతున్న ఈ రేడియో కార్యక్రమంలో కనీసంగా 23 కోట్ల మంది వింటున్నారు. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలపై ప్రజలతో నేరుగా కనెక్ట్ కావడం వల్ల ప్రజలు చైతన్యవంతమగు కావడం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిపించడం, ప్రత్యేక అర్హతలు ఉన్న పౌరులను ప్రస్తావించడం, గ్రాణులతో నేరుగా మాట్లాడడం, స్ఫూర్తిదాయక కథలు చెప్పడం, విజయ రహస్యాలను ప్రస్తావించడం, స్వచ్ఛ భారత్/బేటీ బచావో బేటీ పడావో/ఆత్మ నిర్భర్ భారత్ లాంటి అంశాలను వివరించడం, నైపుణ్యాల వృద్ధి ఆవశ్యకతను వివరించడం, యువతను మేల్కొల్పడం లాంటి లక్ష్యాలను ఈ కార్యక్రమం సుసాధ్యం చేస్తున్నది. భారతదేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఓ ప్రత్యేకమైన వ్యక్తిత్వం కలిగిన ధీరుడు. దేశాభివృద్ధికి గట్టి పునాదులు వేస్తూ, వికసిత్ భారత్ కలల సాకారానికి ప్రజలను భాగస్వామ్యం చేయడానికి తన వంతు విలక్షణ కార్యక్రమాలను నిర్వహించడం శుభ పరిణామం. శాస్త్ర సాంకేతిక విప్లవ ఫలాలను వినియోగించుకుంటూ ప్రతి నెల ఒకసారి రేడియో ద్వారా, ప్రతి ఏట ఫిబ్రవరి మాసంలో "పరీక్షా పే చర్చా" నిరాటకంగా అనర్గళంగా నిర్వహించడం సముచితం, అద్వితీయం, అమోఘం, అనుసరణీయం, అభినందనీయం. మన నరేంద్రుడు చూపిన మార్గంలో పిల్లలు వార్షిక పరీక్షలు రాసి తమ ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని కోరుకుందాం.

# లెక్కలేసుకుంటున్న జనాలు సర్కారీపై బేరీజులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, పెన్ పవర్:** తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు ఓ రేంజ్ లో జరుగుతున్నాయి. ప్రచార వేడి ఊపందుకుంది. ఈ సమయంలో గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనను, ప్రస్తుత రెండేళ్ల కాంగ్రెస్ పాలనను ఓటర్లు బేరీజు వేసుకుంటున్నారు.ముఖ్యంగా పట్టణాల అభివృద్ధిపై రెండు ప్రభుత్వాల ప్రాధాన్యతలు, అమలు చేసిన కార్యక్రమాల్లో స్పష్టమైన తేడాలు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టణ ప్రగతి పేరుతో ఒక క్రమబద్ధమైన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో ప్రధానంగా మున్సిపాలిటీల్లో పారిశుధ్యం, పచ్చదనం కోసం హరితహారం, మౌలిక సదుపాయాల మెరుగుదలే లక్ష్యంగా పనిచేశారు. ప్రతి మున్సిపాలిటీకి ట్రాక్టర్లు, వైకుంఠధామాలు, వెజ్ అండ్‌నాన్-వెజ్ మార్కెట్లు నిర్మించడం ద్వారా పట్టణాల్లో కనీస సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యతనిచ్చారు. నిరంతర నిధుల విడుదల ద్వారా మున్సిపల్ కార్మికుల వేతనాలు, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాల్లో ఒక వ్యవస్థనుఏర్పాటు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టణ అభివృద్ధిని భిన్న కోణంలో చూస్తోంది. ముఖ్యంగా చెరువుల ఆక్రమణలను తొలగించడం, అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపడం రేవంత్ ప్రభుత్వమార్క్ నిర్ణయంగా మారింది. అలాగే, వేల కోట్ల రూపాయలతో చేపట్టిన మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ ద్వారా హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల రూపురేఖలు మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. బీఆర్ఎస్‌వసతులపై దృష్టి పెడితే, కాంగ్రెస్ దీర్ఘకాలిక ప్రణాళికలు, పర్యావరణ పరిరక్షణపై మొగ్గు చూపుతోంది. అయితే కాంగ్రెస్ చేపట్టినవి ప్రధానంగా హైదరాబాద్‌కు సంబంధించినవే. ఇతర మున్సిపాలిటీలకు ప్రత్యేకమైనప్రణాళికలేమీ అమలు చేయలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణ అభివృద్ధి కోసం బడ్జెట్‌లో భారీగానే కేటాయింపులు చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో నిధుల విడుదలపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. గత ప్రభుత్వంవదిలివెళ్లిన పెండింగ్ బిల్లుల భారం మున్సిపాలిటీలపై ఉండటంతో కొత్త పనులు ప్రారంభించడంలో జాప్యం జరుగుతోంది. ఇందిరమ్మ కమిటీల ద్వారా వార్డుల వారీగా అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని, ప్రజా పాలనద్వారా ఫిర్యాదులను పరిష్కరించాలని రేవంత్ ప్రభుత్వం కొత్త వ్యూహాన్ని అమలు చేస్తోంది. బీఆర్ఎస్ హయాంలో అధికారులు, ఎమ్మెల్యేల పర్యవేక్షణలో పట్టణ ప్రగతి జరిగితే, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పేరుతోప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లింది. ఉచిత బస్సు ప్రయాణం , ఉచిత విద్యుత్ వంటి గ్యారెంటీలు పట్టణ మధ్యతరగతి ప్రజలపై సానుకూల ప్రభావం చూపాయని ప్రభుత్వం భావిస్తోంది. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలుప్రధానంగా రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి నిత్యం ఎదుర్కొనే సమస్యలనే ప్రాతిపదికగా తీసుకుంటారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన పార్కులు, మార్కెట్లను కాంగ్రెస్ ఎలా నిర్వహిస్తోంది.. రేవంత్ రెడ్డి తెచ్చిన కొత్తసంస్కరణలు తమ జీవితాలను ఎలా మారుస్తాయి అనే అంశాలను ప్రజలు పోల్చి చూస్తున్నారు. గత పదేళ్ల అభివృద్ధి వర్సెస్ ప్రస్తుత రెండేళ్ల "మార్పు" మధ్య ఈ ఎన్నికల పోరు సాగనుంది. ప్రజల ఓటింగ్ ప్రాధాన్యతలు ఎలా ఉన్నా.. ఈ అంశంలో మాత్రం ప్రజల మధ్యచర్చలు జరుగుతున్నాయి.

# జగిత్యాల కాంగ్రెస్ లో ముసలం

**కరీంనగర్ ఫిబ్రవరి 8, పెన్ పవర్:** జగిత్యాల కాంగ్రెస్‌లో ముదిరిన ముసలం ఇప్పుడు తెలంగామ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. దశాబ్దాలుగా పార్టీ జెండాను మోసిన సీనియర్ నేత జీవన్ రెడ్డి ఆవేదన, ప్రస్తుత రాజకీయ సమీకరణాలు కాంగ్రెస్‌అధిష్టానానికి కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతున్నాయి.తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి జగిత్యాల ఒకప్పుడు కంచుకోట. ఆ కోటను కాపాడుతూ వస్తున్న సీనియర్ నేత టి. జీవన్ రెడ్డి ప్రస్తుత పరిస్థితుల్లో తీవ్ర అసంతృప్తితోఉన్నారు. మున్సిపల్ ఎన్నికల వేళ టికెట్ల కేటాయింపులో జరిగిన పరిణామాలు, బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు ప్రాధాన్యత పెరగడం జీవన్ రెడ్డిని కన్నీటి పర్యంతం చేశాయి.గత అసెంబ్లీఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన సంజయ్ కుమార్, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరినట్లు వార్తలు వచ్చాయి. అయితే, సాంకేతిక కారణాల దృష్ట్యా తాను పార్టీ మారలేదని, కేవలం అభివృద్ధి కోసం ప్రభుత్వంతో కలిసిపనిచేస్తున్నానని ఆయన పేర్కొంటున్నారు. ఇటీవల స్పీకర్ కూడా ఆయనపై అనర్హత పిటిషన్‌ను తిరస్కరించడంతో సంజయ్ కుమార్ తన పట్టును మరింత పెంచుకున్నారు.మరోవైపు, కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడుజెండా మోసిన తమను కాదని, నిన్నగాక మొన్న వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వడంపై జీవన్ రెడ్డి వర్గం భగ్గుమంటోంది. మున్సిపల్ టికెట్ల పంపిణీలో సంజయ్ వర్గానికి 30 సీట్లు, జీవన్ రెడ్డి వర్గానికి కేవలం 20 సీట్లు కేటాయించడమే ఈ మంటలకు ఆజ్యం పోసింది.జీవన్ రెడ్డి



తాజాగా చేసిన వ్యాఖ్యలు పార్టీలో పెద్ద దుమారాన్నే రేపుతున్నాయి. గతంలో రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు "పార్టీ మారిన ఎమ్మెల్యేలను రాళ్లతోకొట్టండి" అని పిలుపునిచ్చారని గుర్తు చేస్తూ, ఇప్పుడు తాను మాత్రం "రాళ్లతో కాదు.. ఓటు అనే ఆయుధంతో కొడదాం" అని అనడం విశేషం. ఇది ప్రత్యక్షంగా పార్టీ అధిష్టానంపై ఆయన చేస్తున్న తిరుగుబాటుగావిశ్లేషకులు భావిస్తున్నారు.పార్టీ కోసం దశాబ్దాలుగా శ్రమించిన తన అనుచరులకు అన్యాయం జరిగిందని జీవన్ రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. "జీవితం ముగిసే సమయంలో నాకు ఇంత దుఃఖం తెప్పించారు. నా గొంతు కోయాలంటే ముందు నా కార్యకర్తలను దాటి రావాలి" అని ఆయన చేసిన వ్యాఖ్యలు జగిత్యాల కాంగ్రెస్ శ్రేణుల్లో కల్లోలం రేపుతున్నాయి. తన వర్గానికి చెందిన అభ్యర్థులు స్వతంత్రులుగా బరిలోకి దిగడం, వారికిజీవన్ రెడ్డి మద్దతు తెలపడం పార్టీ అధికారిక అభ్యర్థుల గెలుపుపై ప్రభావం చూపే అవకాశం ఉంది.మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించాలని భావిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, జగిత్యాల సంక్షోభం పెద్ద తలనొప్పిగామారింది. ఒకవైపు సీనియర్ నేత గౌరవం, మరోవైపు అధికార బలాన్ని పెంచుకునే క్రమంలో చేర్చుకున్న ఎమ్మెల్యేల మధ్య సమన్వయం కుదరకపోవడం పార్టీని ఇబ్బందుల్లో నెట్టేస్తోంది.జగిత్యాల మున్సిపల్ ఎన్నికల ఫలితాలు కేవలం స్థానిక నాయకత్వాన్నే కాదు, రాష్ట్రస్థాయిలో కాంగ్రెస్ అంతర్గత ప్రజాస్వామ్యాన్ని, పార్టీ ఫిరాయింపుల వల్ల కలిగే నష్టాలను కూడా తేటతెల్లం చేయనున్నాయి. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ నేతనుబుజ్జగించకపోతే, అది రాబోయే రోజుల్లో ఇతర జిల్లాల్లోనూ అసమ్మతి రాగాలకు దారితీసే ప్రమాదం ఉంది.

# ‘యుఫోరియా’ సినిమా.. తల్లిదండ్రులకు హెచ్చరిక!

**హైదరాబాద్ పెన్ పవర్:** టాలీవుడ్‌లో భారీ సెట్టింగులు, పౌరాణిక గాథలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన దర్శకుడు గుణశేఖర్, సుమారు మూడేళ్ల విరామం తర్వాత పూర్తిగా రూటు మార్చారు.. భారీ హంగులకు దూరంగా, ప్రస్తుత సమాజంలో జరుగుతున్న వాస్తవ పరిస్థితులకు అద్దం పడుతూ ఆయన తెరకెక్కించిన బలమైన సోషల్ డ్రామానే ‘యుఫోరియా’. ఒకప్పుడు ఒక్కడు, ఖుషీ వంటి చిత్రాలతో స్టార్ హీరోయిన్‌గా వెలుగొంది, సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ సత్తా చాటుతున్న భూమిక చావ్లా ఇందులో ప్రధాన పాత్ర పోషించడం సినిమాపై ఆసక్తిని పెంచింది. ఒక నగరంలోని ఒక ప్రతిష్టాత్మక కాలేజీకి కరస్పాండెంట్ వింధ్య వేములపల్లి (భూమిక చావ్లా). విద్యావేత్తగా సమాజంలో ఆమెకు ఎంతో గౌరవం ఉంది. హఠాత్తుగా హైకోర్టు మెట్లు ఎక్కి, తనపై తనే కేసు నమోదు చేయమని ఆమె కోరడంతో కథ ఒక్కసారిగా మలుపు తిరుగుతుంది. అంతటి ఉన్నత స్థానంలో ఉన్న మహిళ, తాను నేరం చేశానని ఎందుకు ఒప్పుకుంది? అసలు ఆమె చేసిన నేరం ఏమిటి? మరోవైపు చైత్ర (సారా అర్జున్) అనే అమ్మాయి జీవితం ఈ కేసుతో ఎలా ముడిపడి ఉంది? నేటి ‘జెన్-జీ’ సంస్కృతిలో యువత వెళ్తున్న దారి, వారిపై తల్లిదండ్రుల ప్రభావం ఎలా ఉందనేదే మిగిలిన కథ. ఈ సినిమాకు ప్రధాన బలం భూమిక చావ్లా.. గ్లామర్ పాత్రల నుంచి నటనకు ఆస్కారం ఉన్న పాత్రల వైపు మళ్లిన ఆమె, ఇందులో వింధ్య పాత్రలో పరకాయ ప్రవేశం చేశారు.. ఒక బాధ్యతాయుతమైన విద్యావేత్తగా, అదే సమయంలో అంతర్మథనంతో రగిలిపోయే వ్యక్తిగా ఆమె ప్రదర్శించిన పరిణతి అద్భుతం. ముఖ్యంగా ఎమోషనల్ సన్నివేశాల్లో ఆమె అనుభవం తెరపై కనిపిస్తుంది. ఇక డెబ్యూ యాక్టర్ విఘ్నేష్ గవిరెడ్డి మొదటి సినిమానే అయినా, అస్థిరమైన మనస్తత్వం ఉన్న యువకుడిగా చాలా కాన్ఫిడెంట్‌గా నటించాడు. సారా అర్జున్ స్క్రీన్ టైమ్ తక్కువగా ఉన్నప్పటికీ, కథ మొత్తం ఆమె చుట్టూనే తిరుగుతుంది. కీలకమైన సన్నివేశాల్లో ఆమె తన ఉనికిని చాటుకుంది. గౌతమ్ వాసుదేవ్ నన్ తనదైన స్టైలిష్, సెటిల్డ్ పర్ఫార్మెన్స్‌తో మెప్పించారు.. సాంకేతికంగా గుణశేఖర్ తన స్థాయిని, విలువలను కాపాడుకున్నారు.. ప్రవీణ్ కె. పోతన్ సినిమాటోగ్రఫీ సినిమాలోని సీరియస్ మూడ్‌ని పర్ఫెక్ట్‌గా క్యాప్చర్ చేసింది. కాలభైరవ అందించిన సంగీతం కథలోని గాఢతను పెంచింది. ముఖ్యంగా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కొన్ని ఎమోషనల్ సీన్స్‌ని బాగా ఎలివేట్ చేసింది. ఎడిటింగ్ ఫస్ట్ హాఫ్‌లో బాగున్నప్పటికీ, సెకండ్ హాఫ్‌లో అక్కడక్కడా కత్తెర పడాల్సింది.. నిర్మాణ విలువలు రిచ్‌గా ఉన్నాయి. ’యుఫోరియా’ కేవలం ఒక సినిమా మాత్రమే కాదు, ఇది సమాజానికి ఒక హెచ్చరిక. దర్శకుడు గుణశేఖర్ కేవలం నేరస్తులను వేలెత్తి చూపడం కాకుండా, ఆ నేరం జరగడానికి గల సామాజిక కారణాలను, తల్లిదండ్రుల పెంపకంలో లోపాలను స్పృశించిన తీరు అభినందనీయం.. ఫస్ట్ హాఫ్ కథనం చాలా వేగంగా సాగుతూ ప్రేక్షకుడిని సినిమాలో లీనం చేస్తుంది. ఆధునిక జీవనశైలిలో స్వేచ్ఛను ఎలా దుర్వినియోగం చేస్తున్నారో పదునైన సంభాషణలతో వివరించారు. ముగింపు సన్ని వేశాలు ఎమోషనల్ పవర్‌తో కూడి ఉండి, ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తాయి. అయితే, సెకండ్ ఆఫ్‌లో సినిమా కాస్తా సాగదీతగా అనిపిస్తుంది.. సామాజిక ఇతివృత్తం ఉన్న సీరియస్ సినిమాలో పాటలు కథా ప్రవాహానికి అడ్డు తగిలినట్లు అనిపిస్తాయి. భూమిక, విఘ్నేష్ పాత్రల మధ్య వచ్చే కొన్ని ఎమోషనల్ సీన్స్‌లో ఇంకాస్త డ్రామా పండించాల్సింది. మొత్తంగా చెప్పాలంటే.. ‘యుఫోరియా’ ఒక నిజాయితీతో కూడిన సామాజిక ప్రయత్నం. తమ పిల్లలు ఏ దారిలో వెళు_న్నారు? వాళ్ల స్నేహాలు ఎలాంటివి? అని గమనించాల్సిన అవసరాన్ని ఈ చిత్రం తల్లిదండ్రులకు గుర్తు చేస్తుంది. రొటీన్ మాస్ మసాలా చిత్రాలకు భిన్నంగా, వాస్తవాలను తెలుసుకోవడానికి ప్రతి ఒక్కరూ చూడాల్సిన మంచి సోషల్ డ్రామా ఇది.

# డ్రైవింగ్ లైసెన్స్ లో ఆటోమెటిక్ ట్రాకింగ్

**విజయవాడ, ఫిబ్రవరి 8, పెన్ పవర్:**
ఏపీలో వాహనదారులకు బిగ్ అలర్ట్.. డ్రైవింగ్ లైసెన్సులు పొందటం ఇకపై అంత సులభం కాకపోవచ్చు. ఎందుకంటే ఏపీలో కొత్తగా నాలుగు ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాకులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ విధానంలో డ్రైవింగ్ లైసెన్స్ పొందడం అంత వీజీ కాదు. ఈ ట్రాకుల ఏర్పాటు కోసం ఏపీ ప్రభుత్వం మారుతి సుజుకీ ఇండియా మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం ఏపీలో నాలుగుచోట్ల మారుతీ సుజుకీ ఇండియా ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాకులు ఏర్పాటు చేయనుంది.ఆంధ్రప్రదేశ్‌లో వాహనదారులకు ముఖ్య గమనిక. ఏపీలో ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాకులు అందుబాటులోకి రానున్నాయి. మారుతీ సుజుకి ఇండియా.. ఏపీ ప్రభుత్వం కలిసి ఏపీలో నాలుగు ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాకులు ఏర్పాటు చేయనున్నారు. ఏలూరు, ఒంగోలు, విజయనగరం, అనకాపల్లి జిల్లాలలోని ఆర్టీవో కార్యాలయాల వద్ద ఈ ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్ ఏర్పాటు చేయనున్నారు. మారుతి సుజుకీ ఇండియా ఈ ట్రాకులను మూడేళ్లపాటు నిర్వహించనుంది. డ్రైవింగ్ మీద మంచి పట్టు వారే డ్రైవింగ్ లైసెన్సులు పొందేలా.. ఈ విధానం తీసుకువస్తున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా రహదారి భద్రతా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని భావిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా నాలుగు ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టు ట్రాకులు ఏర్పాటు, నిర్వహణ కోసం ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు మారుతి సుజుకీ ఇండియా శుక్రవారం ప్రకటించింది. ఏలూరు, విజయనగరం, ఒంగోలు, అనకాపల్లిలోని రీజినల్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసుల వద్ద వీటిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాకులను అందుబాటులోకి తెచ్చిన నాటి నుంచి మూడేళ్ల పాటు.. ఈ ట్రాకులకు కావాల్సిన ఆటోమేషన్, నిర్వహణ చూసేలాఏపీ ప్రభుత్వం మారుతి సుజుకీ ఇండియా మధ్య ఒప్పందం కుదిరింది. మరోవైపు ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాకులలో మానవ ప్రమేయం ఉండదు. నైపుణ్యం కలిగిన వ్యక్తులే డ్రైవింగ్ లైసెన్సులు పొందేలా ఈ విధానం అమల్లోకి తెస్తున్నారు.మరోవైపు ఈ నాలుగు ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాకులు ద్వారా లైట్ మోటార్ వెహికల్స్, టూవీలర్లకు డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేయనున్నారు. మరోవైపు ఒంగోలులో ఏర్పాటు చేసే ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ వద్ద హెవీ మోటార్ వాహనాలకు కూడా లైసెన్సులు జారీ చేయనున్నారు. మరోవైపు విశాఖపట్నంలో ఇప్పటికే ఇలాంటి ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ అందుబాటులోకి వచ్చింది. గంభీరమ్ వద్ద ఇలాంటి ట్రాక్ ఏర్పాటు చేశారు.ఈ విధానంలో సెన్సార్ల ద్వారా ఎలక్ట్రానిక్ విధానంలో డ్రైవింగ్ మీద పర్యవేక్షణ ఉంటుంది. ట్రాక్ మొత్తం సెన్సార్లు ఏర్పాటు చేస్తారు. ఈ సెన్సార్లు వాహనం ప్రతి కదలికను పసిగడుతూ ఉంటాయి. ఏ మాత్రం తడబడినా పసిగట్టేస్తున్నాయి. దీంతో ఏ చిన్న తప్పు చేసినా డ్రైవింగ్ టెస్ట్ ఫెయిల్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. దీంతో డ్రైవింగ్ బాగా నేర్చుకున్నవారికే లైసెన్సులు వచ్చే అవకాశాలు ఉంటాయి.

# కాపు కాస్తామంటున్న వైసీపీ
# సామాజిక లెక్కల్లో జగన్ టీమ్



**గుంటూరు, ఫిబ్రవరి 8 పెన్ పవర్:**
వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కొత్త రాజకీయ దారులను వెతుకుతున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆయన ఆలోచనలు సాధారణ విశ్లేషణలకు భిన్నంగా ఉంటాయని, ఓటమి తర్వాత మరింత జాగ్రత్తగా వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నారని అనుచరులు అంటున్నారు. రాజకీయాల్లో ఓడిన చోటే తిరిగి బలం పెంచుకోవడం ఒక సంప్రదాయం. జగన్ కూడా అదే మార్గాన్ని ఎంచుకుని, పాత పద్ధతులకు బదులుగా కొత్త వ్యూహాలపై నమ్మకం పెట్టుకున్నట్లు కనిపిస్తోంది. వైసీపీ ఓటమికి కారణమైన రాజకీయ, సామాజిక పరిణామాలను ఆయన లోతుగా అధ్యయనం చేస్తున్నారని ఇటీవల ఆయన ప్రసంగాలు సూచిస్తున్నాయి.ఈ వ్యూహాల్లో మాజీ మంత్రి అంబటి రాంబాబు) పాత్ర కీలకంగా మారుతోంది. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్నప్పటికీ ఆయనకు మంత్రి పదవి దక్కేందుకు మూడున్నర దశాబ్దాలు పట్టింది. వైఎస్సార్ అనుచరుడిగా కాంగ్రెస్‌లో పనిచేసినా, ఉమ్మడి ఏపీలో ఎమ్మెల్యేగా గెలవలేకపోవడం ఆయన రాజకీయ ప్రయాణాన్ని నెమ్మదింపజేసింది. అయితే వైసీపీ ఏర్పడ్డాక జగన్ ఆయనకు ప్రాధాన్యత ఇచ్చారు. 2022లో మంత్రి పదవి ఇవ్వడమే కాకుండా, తాజాగా కాపులలో “టైగర్” అంటూ బిరుదు ఇచ్చి ముందుకు తెచ్చారు.జగన్ రాజకీయ లెక్కల్లో కాపు సామాజిక వర్గం ముఖ్యంగా కనిపిస్తోంది. 2019 ఎన్నికల్లో వైసీపీ గెలుపులో వారి మద్దతు కీలకంగా నిలిచింది. అప్పట్లో ముద్రగడ పద్మనాభం (ఉద్యమం కూడా కలిసివచ్చి, గోదావరి జిల్లాలు ( వైసీపీకి బలంగా మారాయి. కానీ 2024 నాటికి పరిస్థితి పూర్తిగా మారింది. పవన్ కళ్యాణ్ రూపంలో కాపులకు బలమైన నాయకుడు రావడం, ఆయన చంద్రబాబు నాయుడు తో జట్టు కట్టడం వల్ల రాజకీయ సమీకరణలు తారుమారు అయ్యాయి. ఈ మార్పుతో వైసీపీకి ఎదురుదెబ్బ తగిలింది.ఈ నేపథ్యంలో అంబటి రాంబాబు ఘటనను జగన్ వ్యూహాత్మకంగా ఉపయోగించుకుంటున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. అంబటి కుమార్తె మౌనిక మీడియాతో మాట్లాడుతూ తమపై అధికార దుర్వినియోగం జరుగుతోందని ప్రశ్నించడం కాపు వర్గాల్లో చర్చకు దారి తీసింది. జనసేన మద్దతుతో అధికారంలోకి వచ్చిన టీడీపీ ) తమపైనే బలప్రయోగం చేస్తుందా అనే సందేహాన్ని ఆమె వ్యక్తం చేశారు. ఇది నేరుగా రాజకీయ నేతలకు కాకపోయినా, కాపు సమాజంలో భావోద్వేగాలను రేకెత్తించడానికే అన్న విశ్లేషణ ఉంది.గుంటూరు జిల్లా లో జగన్ పర్యటన సమయంలో కాపు జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో స్పందన కనిపించిందని అంటున్నారు. అంబటి రాంబాబు భవిష్యత్తులో తన సామాజిక వర్గాన్ని ఎంతవరకు పోలరైజ్ చేయగలుగుతారన్నది కీలక ప్రశ్నగా మారింది. వంగవీటి రంగా అనుచరుడిగా గతంలో కాపునాడు కార్యక్రమాల్లో పనిచేసిన నేపథ్యం ఆయనకు ఉంది. ఇప్పుడు వైసీపీ ఆయనను ముందుకు తెస్తూ కొత్త గుర్తింపునివ్వాలని చూస్తోంది. అంబటి విడుదల తర్వాత ఆయనకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలన్న ఆలోచన కూడా పార్టీ వర్గాల్లో ఉంది. కూటమి వర్సెస్ అంబటి అంశం రాబోయే రోజుల్లో మరింత వేడెక్కే అవకాశముంది. ఈ మొత్తం వ్యవహారంలో జగన్ వేసిన అడుగు వ్యూహాత్మకమా కాదా అన్నది రాజకీయ ఫలితాలే తేల్చాలి.

**అంబాసిడర్ స్థాయికి అంబటి**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ప్రమోషన్ పొందాలన్నా.. పదవులు దక్కించుకోవాలని అనుకున్నా ప్రత్యర్థి పార్టీల నాయకుల మీద బూతులతో విరుచుకుపడాలి. ఆయా పార్టీల నేతల ఇళ్లపై కర్రలతో దాడులకు దిగాలి. లేకుంటే నిత్యం జగన్మోహన్ రెడ్డికి వీర విధేయుడుగా ఉంటూ ఆయన నామస్మరణ చేయాలి. ఆయన అడుగులకు మడుగులు వత్తాలి. అప్పుడే వారికి పదవులు లభిస్తాయి. పిలిచి మరి పదవులు కట్టబెడతారు. వైయస్సార్ కాంగ్రెస్ ఐదేళ్ల హయాంలో జరిగింది కూడా అదే.ఏదైనా మంత్రి పదవి నిర్వర్తిస్తే వారి శాఖలో ప్రగతి చూస్తారు. కానీ వైసీపీ హయాంలో శాఖల ప్రగతి కంటే ప్రత్యర్థులపై బూతులతో విరుచుకుపడే మంత్రులే అధికం. కొడాలి నాని కి తొలి మూడేళ్లు పదవి ఇచ్చారు జగన్. చంద్రబాబుతో పాటు లోకేష్ పై విరుచుకు పడనిదే పొద్దు గడవదు అన్నట్టు ఉండేది కొడాలి నాని పరిస్థితి. ఆ స్థాయిలో జగన్మోహన్ రెడ్డిని మెప్పించారు కనుక కొడాలి నానికి మంత్రి పదవి దక్కింది. ఏకంగా పౌరసరఫరాల శాఖ మంత్రిగా అవకాశం కల్పించారు. అంతెందుకు జోగి రమేష్ విషయంలో కూడా అదే జరిగింది. ఆయన చంద్రబాబు ఇంటి మీదకు కర్రలతో దాడికి తెగబడినందుకే జోగి రమేష్ కు ఏకంగా గృహ నిర్మాణ శాఖ మంత్రిగా క్యాబినెట్ లో చోటు కల్పించారు జగన్మోహన్ రెడ్డి.సొంత సామాజిక వర్గాన్ని జగన్ కోసం కించపరిచారు పేర్ని నాని ఇక అంబటి రాంబాబు గురించి చెప్పనవసరం లేదు. అప్పటికీ ఇప్పటికీ ఆయన నోరు అదుపులోకి రావడం లేదు. పోసాని కృష్ణ మురళి అయితే పవన్ కళ్యాణ్ తో పాటు ఆయన కుటుంబాన్ని నీచాతి నీచంగా దూషించారు. ఏకంగా ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కించుకున్నారు. ఇక రోజా గురించి చెప్పనవసరం లేదు. రోజా గురించి చెప్పనవసరం లేదు. బూతు సైగలతో,, చిల్లర మాటలతో ప్రత్యర్థులను రెచ్చగొట్టేవారు. రెచ్చిపోయేవారు. అందుకు ఆమె పర్యాటక శాఖ మంత్రి పదవి పొందారు. ఇలా జగన్ కోసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో రాజకీయ హద్దులు చెరిపేసి దిగజారి ప్రవర్తించిన ప్రతి ఒక్కరికి పదవులు దక్కాయి. ఇప్పుడు అంబటి రాంబాబుకు ఏ స్థాయిలో ప్రమోషన్ దక్కుతుందో చూడాలి.

# అనంత, శ్రీ సత్యసాయి జిల్లాలకు మహర్ధశ

**అనంతపురం, ఫిబ్రవరి 8, పెన్ పవర్:** ఇటీవల కేంద్రం రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్‌లను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ కారిడార్లలో ఏపీకి కూడా స్థానం దక్కింది. ఈ క్రమంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో కూడా ఖరీదైన ఖనిజాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు అక్కడ ఖనిజాల కోసం అన్వేషణ జరుగుతోంది. ప్రస్తుతం అక్కడ సర్వేతో పాటుగా పరిశోధనలు చేపట్టారు. అలాగే కడప జిల్లాలో కూడా ఖనిజాలు ఉన్నాయి.రాయలసీమను రతనాల సీమగా పిలుస్తారు.. అంతటి పేరు పొందిన ప్రాంతంలో ఇప్పటికి వజ్రాల వేట జరుగుతోంది. వర్షాకాలంలో పొలాల్లో వజ్రాలు బయటపడుతుంటాయి. అయితే రాయలసీమలో రత్నాల కంటే ఖరీదైన ఖనిజ సంపద ఉందని తెలుస్తోంది. కేంద్రం ఇటీవల ప్రకటించిన రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్‌లో ఉమ్మడి అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు స్థానం దక్కింది. ఈ మేరకు అక్కడ ఖనిజాల కోసం అన్వేషణ చేయనున్నట్లు తెలుస్తోంది.అనంతపురం జిల్లాలో 2023లో హైదరాబాద్‌కు చెందిన నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ పరిశోధనలు చేసింది. పలు ప్రాంతాల్లో కొన్ని ఖనిజాలు (నియోబియం, నియోడైమియం, సిరియం, లాంథనం, ప్రాసోడైమియం,స్కాండియం, జిర్కోనియం, లిథియం) ఉన్నట్లు గుర్తించారట. ఈ ఖనిజాలను ఎయిర్‌క్రాఫ్ట్, స్మార్ట్‌ఫోన్లు, విండ్ టర్బైన్స్, కంప్యూటర్లు వంటి వాటిలో కూడా ఉపయోగిస్తారని చెబుతున్నారు. లిథియం చాలా అరుదుగా దొరికే నిక్షేపాలలో ఒకటి.. తాడిమర్రి, తురకవారిపల్లి, దాడితోట ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారట. అనంతపురం జిల్లాతోపాటుగా కడప జిల్లాలో (పార్నపల్లె, లోపటనూతల) కూడా పరిశోధనలు చేయగా.. అక్కడ కూడా లిథియంను గుర్తించారట.ఈ లిథియంను ఎక్కువగా బ్యాటరీలలో వినియోగిస్తారు. అలాగే ఎలక్ట్రిక్ వాహనాలతో పాటుగా డిజిటల్ కెమెరాలు, మొబైల్స్ తయారీలో ఉపయోగిస్తారు. ఈ మేరకు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఈ ఖనిజాల కోసం చేస్తున్నారు. ఏఎండీ, జీఎస్ఐ, ఎన్‌జీఆర్ఐ క్షేత్రస్థాయిలో పరిశోధనలతో పాటుగా హెలికాప్టర్ సర్వే కూడా చేపట్టారు.కేంద్రం ఇటీవల రేర్ ఎర్త్ కారిడార్లకు సహకారం అందిస్తామని తెలిపింది. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్‌తో పాటుగా తమిళనాడు, ఒడిశా, కేరళ రాష్ట్రాలు ఉన్నాయి. సముద్ర తీరంలో బీచ్‌శాండ్ ఉన్నట్లు గుర్తించారు. అలాగే ఏజెన్సీ ప్రాంతాల్లో కూడా అరుదైన ఖనిజాలు ఉన్నట్లు తేలింది. గతంలో విశాఖపట్నంతో పాటుగా తూర్పుగోదావరి జిల్లాల్లో పరిధిలో బాక్సైట్ నిల్వలు గుర్తించిన సంగతి తెలిసిందే. చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో బంగారం ఖనిజాన్ని గుర్తించిన సంగతి తెలిసిందే. వాటితో పాటుగా పైన తెలిపిన ఖనిజాలను కూడా గుర్తించారు. వీటి తవ్వకాలకు ముందుకొచ్చేవారికి కేంద్రం నుంచి ప్రోత్సాహం అందిస్తారు.

# తిరుపతిలో స్పేస్ సిటీ

**తిరుపతి, ఫిబ్రవరి 8, (న్యూస్ పల్స్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు త్వరలోనే ప్రారంభం కానుంది. తిరుపతిలో స్పేస్ సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ వద్ద 2800 ఎకరాలలో దీనిని ఏర్పాటు చేయనున్నారు. అయితే స్పేస్ సిటీ ప్రాజెక్టు తొలి విడత ప్రారంభానికి రంగం సిద్ధమైంది. మరో రెండు నెలల్లో తొలివిడతను ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. తొలి విడతలో 570 ఎకరాలలో కోర్ ఇండస్ట్రియల్ యాక్టివిటీస్ మొదలు పెడతారు. ఈ ప్రాజెక్టుతో తిరుపతి జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందని అధికారులు చెప్తున్నారు,.ఏపీలో మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ప్రారంభానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఆధ్మాత్మిక నగరం తిరుపతిలో స్పేస్ సిటీ ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో స్పేస్ సిటీ ప్రాజెక్టు తొలి విడతను త్వరలోనే ఏపీ ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు తెలిసింది. తిరుపతిలో 2800 ఎకరాలలో స్పేస్ సిటీ ప్రాజెక్టు చేపడుతున్నారు. మరో రెండు నెలలలో ఈ ప్రాజెక్టు తొలి విడతను చేపట్టాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. రీసెర్చ్, శాటిలైట్ మ్యానుఫ్యాక్చరింగ్, ఏరోస్పు టెక్నాలజీ హబ్‌గా ఈ స్పేస్ సిటీని తీర్చిదిద్దాలని ప్రణాళికలు రచిస్తున్నారు.తిరుపతి జిల్లాలోని బుచ్చినాయుడు కండ్రిగ ప్రాంతంలో ఈ మెగా స్పేస్ సిటీ ప్రాజెక్టు చేపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఈ ప్రాజెక్టు చేపడుతున్నారు. స్పేస్ సిటీ ప్రాజెక్టు మొదటి దశలో 570 ఎకరాలలో 140 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో కోర్ ఇండస్ట్రియల్ యాక్టివిటీస్ మొదలు పెడతారు. మిగతా భూమిని రెసిడెన్షియల్ జోన్లు, ఇన్‌స్టిట్యూషనల్ క్యాంపస్, లాజిస్టిక్ పార్కులు, అంతర్గత రహదారుల అభివృద్ధి , హైస్పీడ్ ఇంటర్నెట్, కరెంట్, తాగునీటి సరఫరా వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ఉపయోగిస్తారు.మరోవైపు స్పేస్ సిటీలో ఉపగ్రహాల అసెంబ్లింగ్, ఇంటిగ్రేషన్ యూనిట్లు, టెస్టింగ్,క్యాలిబరేషన్ ల్యాబులు, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెంటర్లు వంటివి ఏర్పాటు చేయనున్నాయి. అలాగే స్పేస్ టెక్నాలజీ స్టార్టప్‌ల కోసం ఇంక్యుబేషన్ హబ్స్, డేటా అనలిటిక్స్, డిఫెన్స్ అప్లికేషన్స్, అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రానిక్స్ వంటివి అందుబాటులో ఉండనున్నాయి. మరోవైపు స్పేస్ సిటీ నిర్మాణం కోసం ఈ ప్రాంతాన్ని కూడా వ్యూహాత్మకంగా ఎంచుకున్నారు. సమీపంలోనే సతీష్ ధావన్ స్పేస్ సెంటర్, శ్రీహరికోట ఉండటం, తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం దగ్గరలో ఉండటం, జాతీయ రహదారులు, పోర్టులకు సమీపంలో ఉండటం కూడా కలిసి వస్తోంది.ఈ స్పేస్ సిటీ ప్రాజెక్టు ద్వారా ప్రైవేట్ పెట్టుబడులను పెద్దఎత్తున ఆకర్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రాబోయే రోజులలో స్పేస్ సిటీ ద్వారా 25 వేలకోట్ల రూపాయల పెట్టుబడులను స్పేస్ రంగంలో రాబట్టాలని ప్రణాళికలు రచిస్తోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అధికారులు చెప్తున్నారు.స్పేస్ సిటీ ప్రాజెక్టు ద్వారా ఇంజనీర్లు, సైంటిస్టులు, టెక్నీషియన్లు, డేటా స్పెషలిస్టులు, మిగతా అనుబంధ రంగాల వారికి ఉద్యోగాలు లభిస్తాయని చెప్తున్నారు. మరోవైపు స్పేస్ సిటీ ప్రాజెక్టుకు సంబంధించి ప్రాథమిక సర్వేలు, పర్యావరణ అంచనాలు, స్థానికులతో చర్చలు పూర్తి అయ్యాయి. ఈ నేపథ్యంలో మరో రెండు నెలలలో స్పేస్ సిటీ తొలివిడత ప్రారంభిస్తారని సమాచారం.

# కేడర్ లో కనిపించని జోష్
# దాడులు జరిగిన చోటే కనపిస్తారా

**విజయవాడ, గుంటూరు, ఫిబ్రవరి 8, (న్యూస్ పల్స్):** వైసీపీ అధినేత వైఎస్ జగన్ కేవలం పరామర్శలకు మాత్రమే పరిమితమవుతున్నారు. ఇప్పటికే రెండేళ్ల కాలం పూర్తయింది. దీంతో పరామర్శలు ఆపేసి పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు. వైసీపీ గత ఎన్నికల్లో కేవలం పదకొండు నియోజకవర్గాల్లోనే గెలిచింది. మిగిలిన 164 నియోజకవర్గాల్లో పార్టీ ఆశించినంత మాత్రం బాగా లేదు. అక్కడ క్యాడర్ కు, నేతలకు మధ్య గ్యాప్ పెరిగింది. రెండేళ్లవుతున్నా నేతలు కొందరు కార్యకర్తలను దగ్గరకు తీసుకోవడం లేదు. దీంతో జగన్ జిల్లాల పర్యటన చేయాలంటున్నారు. పాదయాత్ర సంగతి తర్వాత.. అది ఏడాదిన్నర తర్వాత కాని మొదలు కాదు. కానీ ఈలోపు పార్టీలోని క్యాడర్ ను, లీడర్ ను యాక్టివ్ చేయాలంటే ఖచ్చితంగా జిల్లాలకు వెళ్లి నియోజకవర్గాల వారీగా సమీక్షలు చేయాలని నేతలు కోరుతున్నారు.ఇప్పటికీ రాయలసీమలోని ఒకటి రెండు జిల్లాలు మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో పార్టీ యాక్టివ్ గా లేదు. జగన్ బయటకు వచ్చినప్పుడు మాత్రం కార్యకర్తలు అభిమానంతో వచ్చి జగన్ కు స్వాగతం చెబుతున్నారు. జగన్ ను చూసేందుకు పోటీ పడుతున్నారు. కానీ చాలా నియోజకవర్గాల్లో పరిస్థితి మాత్రం ఇంకా మెరుగుపడలేదన్నది చాలా మంది బహిరంగంగానే చెబుతున్నారు. పార్టీ పదవులను పూర్తిగా చేపట్టలేదు. బూత్ లెవెల్ కమిటీల నియామకం చాలా చోట్ల జరగకపోవడాన్ని కూడా గుర్తు చేస్తున్నారు. పాత నేతలే తిరిగి పోటీ చేస్తారన్న భావనతో కొత్త వారు నియోజకవర్గంలో నాయకత్వ బాధ్యతలను చేపట్టేందుకు ముందుకు రావడం లేదని గట్టిగా పార్టీ నేతలే విమర్శిస్తున్నారు.ద్వితీయ శ్రేణి నేతలు కొంత గట్టిగానే ఉన్నప్పటికీ నియోజకవర్గ స్థాయి నేతలు మాత్రం అప్పుడే ఎందుకన్నట్లు కొంత ఇంకా ఆలోచనలో ఉన్నారు. జగన్ పాదయాత్ర సమయానికి బయటకు వచ్చి యాక్టివ్ అయితే బాగుంటుందని వారి వ్యాపారాలు, మిగిలిన వ్యక్తిగత వ్యవహారాల్లో మునిగిపోయారు. 175 నియోజకవర్గాల్లో 2019 ఎన్నికల్లో గెలిచిన 151 మందిలో పది నుంచి పదిహేను మందికి మించి యాక్టివ్ గా లేరు. ఇది నిజం. పరామర్శ చేయవచ్చు. తప్పులేదు. కానీ అదే సమయంలో జగన్ జిల్లాలకు వచ్చి కార్యకర్తలతో ముఖాముఖి సమావేశాలను ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎక్కువగా వినపడుతుంది. అప్పుడే వచ్చే ఎన్నికలకు కానీ, స్థానిక సంస్థల ఎన్నికల సమాయానికి కానీ పార్టీ పుంజుకోదని అంటున్నారు. కానీ జగన్ మాత్రం ఇప్పట్లో జిల్లాల పర్యటన చేసే అవకాశాలు కనిపించడం లేదు.

మరో వైపు పక్కా పథకం ప్రకారమే జోగి రమేష్ ఇంటిపై దాడి చేశారని వైఎస్ జగన్ అన్నారు. జోగి రమేష్ ఇంటి ఎదుట మీడియా సమావేశంలో మాట్లాడుతూ పెట్రోలు బాంబులు వేసి జోగి రమేష్ ను హత్య చేయాలని పథకం పన్నారన్నారు. జోగి రమేష్ చంద్రబాబు, లోకేశ్ పై విమర్శలు చేసినంత మాత్రాన దాడులు చేస్తారా? అని జగన్ ప్రశ్నించారు. మనం నాగరిక సమాజంలో ఉన్నామా? లేక జంగిల్ రాజ్యంలో ఉన్నామా? అని నిలదీశారు. లోకేశ్ చిప్ రిపేర్ కావాలని పూజలు చేయడంలో తప్పేంటని జగన్ అన్నారు. చంద్రబాబు ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని జగన్ హెచ్చరించారు. ఆ తర్వాత వచ్చేది తమ ప్రభుత్వమేనని, ఎవరైతే అధికారులు వీరికి సహకరించారో వారందరినీ బోనులో నిలబెడతామని తెలిపారు.ప్రతి ఒక్కరూ చేసిన అన్యాయానికి శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు. చిప్ సరిగ్గా ఉంటే ఎవరైనా ఇలాంటివి ఎవరైనా చేయిస్తారా? అని జగన్ ప్రశ్నించారు. తిరుమల లడ్డూలో గొడ్డుమాంసం, జంతు కొవ్వు లేదని చెప్పినా ఇంకా రాజకీయ స్వలాభం కోసం ఆయన కూటమిలో ఉన్న పవన్ కళ్యాణ్ అదే పనిగా అబద్ధాలను నిజం చేస్తున్నారని జగన్ అన్నారు. లడ్డూలో జంతుకొవ్వు కలిసిందని చంద్రబాబుకు ఎవరు చెప్పారని జగన్ ప్రశ్నించారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సీబీఐ సిట్ దర్యాప్తు చేసిందని, అందులో కొవ్వు లేదని, తమ పార్టీకి చెందిన ఎవరి పేర్లను లేవని తెలిసినా చంద్రబాబు పదే పదే జంతువుల కొవ్వు కలిసిందంటూ అబద్ధాలు ప్రచారం చేస్తూ ఏడుకొండల వాడికి అపచారం చేస్తున్నారని జగన్ దుయ్య బట్టారు.చంద్రబాబు వేసిన వన్ మ్యాన్ కమిషన్ చేత అబద్ధాలు నిజం చేయాలని ప్రయత్నం చేస్తున్నారు తప్ప, చంద్రబాబు ఇంకా ప్రజల్లో చులకన అవుతారని అన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## భారత్ - అమెరికా... మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఖరారు

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్–అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఖరారైంది. దీనికి సంబంధించి ఇరుదేశాలు ఓ సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. భారత ఉత్పత్తులపై ఉన్న 50 శాతం సుంకాన్ని 18 శాతానికి తగ్గిస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. ఇరుదేశాలకు ప్రయోజనకరమైన ద్వైపాక్షిక వాణిజ్యఒప్పందం కోసం ఫ్రేమ్‌వర్క్‌ను ఏర్పాటుచేసినట్లు ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నాయి. ఈ చర్చల్లో కీలక పాత్ర పోషించిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తాజా మధ్యంతర ఒప్పందాన్ని చరిత్రాత్మక విజయంగా అభివర్ణించారు. ఇది భారతీయ ఎగుమతిదారులకు 30 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ తెరుస్తుందని.. ముఖ్యంగా ఎంఎస్‌ఎంఈలు, రైతులు, మత్స్యకారులకు ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. ఎగుమతులు పెరగడంతో దేశవ్యాప్తంగా మహిళలు, యువతకు లక్షలాది కొత్త ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. దుస్తులు, తోలు, పాదరక్షలు, ప్లాస్టిక్, రబ్బరు ఉత్పత్తులు, సేంద్రియ రసాయనాలు, గృహాలంకరణ, చేతివృత్తుల ఉత్పత్తులు, ఎంపిక చేసిన యంత్రాలు వంటి కీలక రంగాలకు లాభదాయకమన్నారు. ఇక, రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేసేందుకు భారత్ అంగీకరించిందని అమెరికా తెలిపింది. తమ దేశం నుంచి భారీగా ఇంధనం, గ్యాస్‌ను దిగుమతి చేసుకునేందుకు అంగీకరించినట్లు వెల్లడించింది. తమ దేశం నుంచి 500 బిలియన్ డాలర్ల విలువైన దిగుమతులకు భారత్ అంగీకరించిందని పేర్కొంది.

## అమెరికా-ఇరాన్ పరోక్ష చర్చలు

**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నవేళ.. ఒమన్ వేదికగా అమెరికా, ఇరాన్ పరోక్ష చర్చలు మొదలయ్యాయి. ఇరు దేశాల ప్రతినిధులు ఒమన్ విదేశాంగ మంత్రి బదర్ అల్–బుసైదీతో విడివిడిగా భేటీ అయ్యారు. ఈ చర్చలను 'చాలా మంచి ఆరంభం'గా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ అభివర్ణించారు. అణు కార్యక్రమంపై భవిష్యత్ సంప్రదింపులకు బాటలు పరచడంపైనే ప్రాథమికంగా తాము దృష్టిసారించినట్లు చెప్పారు. ఒమన్ వర్గాలు కూడా ఇదే విషయాన్ని స్పష్టంచేశాయి. ఒమన్ రాజధాని మస్కట్ శివార్లలోని ఓ రాజభవనంలో తొలుత బదర్ అల్–బుసైదీతో అబ్బాస్ అరాఘ్చీ సహా ఇరాన్ ప్రతినిధులు భేటీ అయ్యారు. వారు వెళ్లిపోయిన అనంతరం అమెరికా రాయబారి స్టీవ్ విట్కాఫ్, ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్ తదితరులు రాజభవనానికి వచ్చి ఒమన్ విదేశాంగ మంత్రితో దాదాపు గంటన్నరపాటు సమాలోచనలు జరిపారు. అమెరికా బృందంలో నౌకాదళ అడ్మిరల్, అమెరికా మిలిటరీ సెంట్రల్ కమాండ్ అధిపతి బ్రాడ్ కూపర్ కూడా ఉండటం గమనార్హం. చర్చలు విఫలమైతే దాడులకు దిగుతామంటూ టెహ్రాన్‌కు సంకేతాలు పంపేందుకే కూపర్‌ను తమ బృందంలో వాషింగ్టన్ చేర్చుకున్నట్లు విశ్లేషణలు వెలువడుతున్నాయి.

## పాక్‌లో మారణహోమం

**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ మరోసారి రక్తసిక్తమైంది. ఆ దేశ రాజధాని ఇస్లామాబాద్‌లో ఓ మసీదు లక్ష్యంగా ఆత్మాహుతి దాడి చోటుచేసుకుంది. ఈ ఘటనలో 31 మంది మృత్యువాతపడ్డారు. 169 మంది గాయపడ్డారు. ఇస్లామాబాద్‌లోని తర్లాయి ప్రాంతంలో ఖదీజతుల్ కుబ్రా అనే షియా మసీదు ఉంది. పోలీసులు, పలువురు ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం– ప్రార్థనలు జరుగుతుండగా ఆ మసీదు వద్దకు ఓ ఆత్మాహుతి బాంబర్ వచ్చాడు. అతణ్ని గేటు వద్దే భద్రతాసిబ్బంది ఆపగా, తనను తాను పేల్చేసుకున్నాడు. పేలుడు తీవ్రతకు పలువురి అవయవాలు తెగిపడ్డాయి. మృతదేహాలు చెల్లాచెదురుగా ఎగిరిపడ్డాయి. పోలీసులు, ఇతర సిబ్బంది అక్కడికి చేరుకొని.. గాయపడ్డవారిని ఆసుపత్రులకు తరలించారు. ఆత్మాహుతి బాంబర్ తొలుత కాల్పులు జరిపి, తర్వాత తనను తాను పేల్చేసుకున్నాడని మరో ప్రత్యక్ష సాక్షి తెలపడం గమనార్హం.

## పట్టపగలే కనిపించనున్న తోకచుక్క!

**హైదరాబాద్ పెన్ పవర్:** కొత్తగా వెలుగుచూసిన ఒక తోకచుక్క ఖగోళశాస్త్రవేత్తల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సూర్యుడి దిశగా దూసుకెళుతున్న ఈ ఖగోళవస్తువు ఏప్రిల్‌లో ప్రకాశవంతంగా కనిపించే అవకాశం ఉంది. సి/2026 ఏ1 (మ్యాప్స్) అనే ఈ తోకచుక్కను నలుగురు ఔత్సాహిక ఖగోళశాస్త్రవేత్తలు గత నెల 13న కనుగొన్నారు. ఇందుకోసం వారు చిలీలోని అటకామా ఎడారిలో ఉన్న ఒక టెలిస్కోపును ఉపయోగించారు. ఆ ఖగోళవస్తువు క్రాయిజ్ తోకచుక్కల తరగతికి చెందింది. ఆ తరగతిలో దేదీప్యమానమైన అనేక తోకచుక్కలు ఉంటాయి. తాజాగా గుర్తించిన మ్యాప్స్ తోకచుక్క.. సూర్యుడి చుట్టూ అత్యంత దీర్ఘవృత్తాకార కక్ష్యలో పరిభ్రమిస్తోంది. భానుడి దిశగా వేగంగా ముందుకు సాగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో.. సూర్యుడి ఉపరితలానికి కేవలం 1.2 లక్షల కిలోటర్ల దూరంలోకి వెళుతుంది. అక్కడి వేడి తాకిడికి విచ్ఛిన్నం కాకుంటే.. ఏప్రిల్ ఆరంభంలో అది సాయం సంధ్యవేళ ఆకాశంలో వెలుగులీనుతూ కనిపిస్తుంది. దక్షిణార్ధగోళ దేశాలవారు దాన్ని సులువుగా వీక్షించొచ్చు.

## ముంబాయి మేయర్ ఖరారు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవల ముంబాయి కార్పొరేషన్ ఎన్నికలు ముగిసిన విషయం తెలిసిందే. బీజేపీ–శివసేన అధిక స్థానాల్లో గెలుపొందాయి. బీఎంసీ మేయర్ ఎన్నికపై బీజేపీ–శివసేన పోటీబడ్డాయి. ఎట్టకేలకు ఇరు పార్టీలు రాజీ పడి అభ్యర్థి ఎన్నికను ఖరారు చేశాయి. శనివారం బీజేపీ కార్పొరేటర్ల కీలక సమావేశం అనంతరం, మేయర్ అభ్యర్థిగా సీనియర్ నేత రీతూ తావ్డే పేరును ప్రకటించారు. అదేవిధంగా, డిప్యూటీ మేయర్ పదవికి ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండే నేతృత్వంలోని శివసేన నుంచి సంజయ్ శంకర్ ఘాడీ నామినేషన్ దాఖలు చేశారు. ముంబై మహానగర కార్పొరేషన్ ఎన్నికలు 227 స్థానాలకు జనవరి 15న ఎన్నికలు జరగ్గా.. ఓట్ల లెక్కింపు జనవరి 16న జరిగింది. ఈ ఓట్ల లెక్కింపులో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో 'రిసార్ట్ పాలిటిక్స్' మొదలయ్యాయి. ఈ ఫలితాల్లో బీజేపీ 89 స్థానాలను గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించగా, దాని మిత్రపక్షం శివసేన (షిండే వర్గం) 29 స్థానాలను దక్కించుకుంది. ఈ కూటమికి మొత్తం 118 స్థానాల మద్దతు ఉండటంతో మేయర్ ఎన్నిక సులభతరమైంది.

## వివాహితకు 'పెండ్లి హా' చట్టబద్ధం కాదు

**హైదరాబాద్ పెన్ పవర్:** సుప్రీంకోర్టు కీలక తీర్పును ఇచ్చింది. ఒక వివాహిత మరో వ్యక్తితో ఒక అంగీకారంతో శారీరక సంబంధం పెట్టుకొని, ఆ తర్వాత సంబంధం చెడిపోయినప్పుడు పెండ్లి చేసుకుంటానన్న వాగ్దానంతోనే అలా చేశానంటూ సదరు వ్యక్తిపై లైంగికదాడి కేసు పెట్టలేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. పెండ్లి చేసుకుంటానని మోసం చేశాడంటూ ఓ మహిళా న్యాయవాది పెట్టిన లైంగికదాడి కేసుపై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి కేసుల్లో మహిళ ఇప్పటికే పెండ్లి అయి ఉండడంతో ఆమెకు చట్టపరంగా మరో పెండ్లి చేసుకునే అర్హత లేదని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.వి నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం వెల్లడించింది. అలాంటి పరిస్థితిలో 'పెండ్లి హా' అనేది చట్టబద్ధంగా అమలు చేయగల హా కాదని వివరించింది."ఇది అంగీకారంతో జరిగిన సంబంధం. తర్వాత వ్యక్తిగత విభేదాలతో అది విరోధంగా మారింది. ఇలాంటి సందర్భాల్లో లైంగికదాడి కేసు పెట్టడం క్రిమినల్ చట్టాల దుర్వినియోగం అవుతుంది" అని కోర్టు తెలిపింది. అలాగే హిందూ వివాహ చట్టం–1955 ప్రకారం భర్త లేదా భార్య జీవించి ఉండగా మరో పెండ్లి నిషేధం. కాబట్టి 'పెండ్లి చేసుకుంటానని చెప్పి శారీరక సంబంధం పెట్టుకున్నాడు' అనే వాదన ఇక్కడ నిలబడదని కోర్టు తేల్చింది. ఈ మేరకు ఓ మహిళా న్యాయవాది.. లాయర్‌పై పెట్టిన లైంగికదాడి కేసును సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. నిజమైన లైంగికదాడి కేసులు, అంగీకారంతో జరిగిన సంబంధాల తర్వాత వచ్చే తగాదాలను వేరు చేసి చూడాలనీ, న్యాయస్థానాలు చాలా జాగ్రత్తగా ఉండాలని సుప్రీంకోర్టు సూచించింది.

# నిజాం లొంగుబాటులో కె.ఎం. మున్షీ అసమాన ప్రతిభ

**హైదరాబాద్ పెన్ పవర్:** నిజాం కబంధ హస్తాల నుండి హైదరబాదు సంస్థానం విముక్తి పొందడానికి ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయి పటేల్ ఉక్కు సంకల్పం గురించి తెలియని తెలంగాణ వారుండరు. తెలంగాణ విమోచన లేదా విలీన ప్రక్రియ వెనక మరో మేధావి, కార్యసాధకుని అకుంఠిత కృషి గురించి చాలా మందికి తెలియదు. ఆయనే కె.ఎం.మున్షీ. బ్రిటీష్ పాలకులు స్వాతంత్ర్యం ఇచ్చిన సమయంలో.. మూడు సంస్థానాలు ఇండియాలో కలవలేదు. అవి కాశ్మీర్, జునాఘడ్, హైదరాబాద్ (నైజాం). ఆ పరిస్థితుల్లో ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్... ప్రత్యేక శ్రద్ధపెట్టి... జునాఘడ్ సంస్థానాన్ని భారత్‌లో కలిసేలా చేశారు. నైజాం నవాబ్ మాత్రం విలీనానికి ఒప్పుకోలేదు. అప్పట్లో రాజాకార్ల పేరుతో ప్రత్యేక సైన్యాన్ని తయారుచేసిన ఖాసిం రజ్వీ... మారణకాండకు తెగబడ్డారు. ఈ క్రమంలోనే "ఆపరేషన్ పోలో," పేరుతో నాటి భారత హోం మంత్రి, ఉక్కు మనిషి సర్దార్ పటేల్ నేతృత్వంలో " పోలీసు చర్య" చేపట్టడం జరిగింది. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, కె. ఎం. మున్షీకి హైదరాబాద్ రాచరిక రాష్ట్రంలో ట్రేడ్ ఏజెంట్ (ఏజెంట్–జనరల్) పదవి ఇవ్వ బడింది. మున్షీ జనవరి 5, 1948న హైదరాబాద్‌కు రావడంతో హైదరాబాద్ స్టేట్ రిసెప్షన్ మరియు బోలారమ్‌లోని ఇండియన్ ఆర్మీ యూనిట్ల గౌరవ గార్డుతో ఘనంగా జరిగింది. ఈ సమయంలో నిజాం తన రాష్ట్రాన్ని ఇండియన్ యూనియన్ నుండి స్వతంత్రంగా ఉంచడానికి ప్రయత్ని స్తున్నాడు, సహాయం కోసం కొత్తగా సృష్టించబడిన పాకిస్తాన్‌కు రహస్య సంకేతాలను కూడా పంపాడు. ఇటువంటి కుట్రలు భారత యూనియన్‌కు ఎదురయ్యే అనివార్యమైన ప్రమాదాన్ని తెలుసుకున్న డాక్టర్ మున్షీ, నిజాం చేస్తున్న చర్యల గురించి సర్దార్ పటేల్‌కు తెలియ జేసేవారు. భారత గూఢచార దళం అంత పటిష్టంగా లేక. నిజాం సైనిక దళాలను గురించి సరైన అంచనా వేయలేక పోయారు. ఈ పనిని ఏజెంట్ "జనరల్ కే.ఎం. మున్షీ" సుగమం చేశారు. వారు, హైదరా బాద్ సైన్యంలోని ఒక అధికారిని లోబరచుకొన్నారు. అతని ద్వారా హైదరాబాద్ సైన్యపు వివరాలను స్పష్టంగానూ ? ఖచ్చితంగానూ తెలిశాయి. ఈ సమాచారం భారత సైన్యానికి ఎంతో ఉపకరించింది. అంతే కాదు "జే.ఎన్. చౌదరి"కి హైదరాబాద్ సునాయాసంగా జయించగలం అన్న సంపూర్ణ విశ్వాసం ఏర్పడింది. కె.ఎం. మున్షీ స్వాతంత్ర్య సమరయోధుడు, రాజకీయవేత్త మరియు భారతీయ విద్యాభవన్ స్థాపకుడు ప్రజాదరణ పొందిన నవలా రచయిత.కన్నయలాల్ మాణిక్‌లాల్ మున్షీ (డిసెంబరు 30, 1887 – ఫిబ్రవరి 8, 1971) డిసెంబరు 30, 1887న ఇప్పటి గుజరాత్ రాష్ట్రంలోని బారుచ్‌లో జన్మించారు. బారుచ్, వడోదరలలో అభ్యసించి జాతీయో ద్యమంలో ప్రవేశించారు. 1937లో బొంబాయి రాష్ట్ర మంత్రిగా పదవి నిర్వహించారు. అంబేద్కర్ అధ్యక్షతన భారత రాజ్యాంగాన్ని రూపొందించిన కమిటీలో సభ్యుని గా మున్షీ డా. అంబేద్కర్‌తో కలిసి 'ప్రాథమిక హక్కుల' సూత్రాన్ని వ్యక్తీకరించిన ముసాయిదాను సంయుక్తంగా రాయడం ద్వారా తన ముద్రను వేశారు. సంస్థానాల విలీనీకరణ సమయంలో మొండికేసిన హైదరాబాదు నిజాంపై చర్యలు తీసుకోవడానికి భారతప్రభుత్వ దూతగా వచ్చిన మున్షీ సమస్యను చక్కగా పరిష్కరించి ప్రసిద్ధి చెందారు. భారత రాజ్యాంగ రచనలో కూడా భాగస్వాము లైనారు. ఆ తర్వాత జవహార్‌లాల్ నెహ్రూ మంత్రివర్గం లో ఆహార,వ్యవసాయ శాఖ మంత్రిగా, ఉత్తరప్రదేశ్ గవర్నరుగా పని చేశారు. చివరి దశలో కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చి రాజగోపాల చారితో కల్సి స్వతంత్రపార్టీని స్థాపించారు. సాహితీవేత్తగా రాణిస్తూ భారతీయ విద్యాభవన్‌ను ప్రారంభించారు. 1948 ఫిబ్రవరిలో నిజాం ప్రభుత్వాన్ని హస్తగతం చేసు కోవడానికి ప్రణాళికకు "పోలో" అని నామకరణం చేశారు. హైదరాబాద్ "పోలో" అనే ఒక క్రీడకు ప్రసిద్ధి. అందువల్ల దానికి "పోలో" ఆటలా సైనిక చర్య జరుపుతామని ఆ పేరు పెట్టారు. 1948 జూలై నెల చివరికంతా "ఆపరేషన్ పోలో" ఏర్పాట్లు? ప్రణాళిక సర్వమూ సిద్ధమ య్యాయి. 22వేల సైన్యానికి 22 రోజులకు సరిపడా ఆహార పదార్థాలు సిద్ధమయ్యాయి. మేజర్ "జనరల్ జయంత్ నాథ్ చౌదరి" ఈ సైనిక చర్య నిర్వహణ కోసం ప్రత్యేకంగా నియమితులయ్యారు. పోలీసు చర్య ఐదు రోజుల్లో ముగిసింది. భారత సైన్యం 10 మంది సైనికులను కోల్పోయింది.1373 మంది రజాకార్లు హతమయ్యారు. మరో 1911 మంది బందీలుగా పట్టుబడ్డారు. హైదరాబాదు సైన్యంలో 807 మంది చనిపోగా, 1647 మంది పట్టు బడ్డారు. తాను ఓటమి అంచుల్లో ఉన్నట్లు గమనించి నిజాం నవాబు దిక్కుతోచని స్థితిలో లేక్‌వ్యూ అతిథి గృహంలో బంధించిన భారత ఏజెంట్ మున్షీని కలిసి లొంగిపోతున్నట్లు ప్రకటించాడు. దీనితో ఆపరేషన్ పోలో విజయవంతమైంది. సెప్టెంబర్ 13న జె.ఎన్.చౌదరి నాయకత్వాన ప్రారంభమైన దాడి సెప్టెంబర్ 17న నిజాం నవాబు లొంగిపోవడంతో పూర్తయింది. అతని ప్రధానమంత్రి మీర్ లాయిక్ ఆలీ, రజాకార్ల నాయకుడు ఖాసిం రజ్వీ అరెస్టయ్యారు. సెప్టెంబర్ 23న భద్రతా సమితిలో తన ఫిర్యాదును నిజాము ఉపసంహరించు కున్నాడు. హైదరాబాదు భారతదేశంలో విలీనం అయినట్లుగా ప్రకటించాడు. వెర్ని వసూలత్, స్నేహసంభ్రమ, భగ్న పాదుక, తపస్విని ఈ నవలలను మన దేశ భాషలకే కాక ఇతర దేశ భాషల్లోకి అనువదించారు. కాంగ్రెస్ పార్టీలో సర్దార్ వల్లభాయ్ పటేల్ , మహాత్మగాంధీ, జవహర్ లాల్ నెహ్రూ లాంటి ప్రముఖుల అభిమానాన్ని చూరగొన్నారు. 1971ఫిబ్రవరి 8న మరణించారు.

# పాత్రికేయ దిగ్గజం పొత్తూరి

**హైదరాబాద్ పెన్ పవర్:** పొత్తూరి వెంకటేశ్వరరావు... తెలుగు పత్రికా పాఠకులకు సుపరిచితమైన పేరు. అయిదు దశాబ్దాలకు పైగా పత్రికా రంగంలో మమేకమై, తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన తెలుగు జర్న లిజానికి సాధికారిక గుర్తు ఆయన. విలువలకు ప్రాదాన్యత ఇచ్చి, కట్టుబడి, ఎన్నడూ రాజీ పడని అరుదైన వ్యక్తిత్వం ఆయనది. ఒక ట్రెండ్ సెట్టర్ గా నేటి తరానికి అచ్చమైన స్వచ్ఛమైన మార్గదర్శి పొత్తూరి. 1934 ఫిబ్రవరి 8వ తేదీన గుంటూరులో జన్మించిన డాక్టర్ పొత్తూరి వెంకటేశ్వరరావు 1957లో ఆంధ్ర జనతా పత్రికలో తొలిసారిగా ఆయన పాత్రికేయుడిగా, తొలి అడుగు వేశారు. ధృఢ చిత్తులై, వృత్తి నిబద్ధత, నిజాయితీ, బాధ్యతల విషయంలో ఎన్నడూ వెనకడుగు వేయనే లేదు. ఈనాడు, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ, వార్త దినపత్రికల్లో ఎక్కడ పని చేసినా తన ప్రత్యేక ముద్రలు వేశారు. పొత్తూరి ఐదు దశాబ్దాలకు పైగా తెలుగు పత్రికా రంగంలో అనేక యాజ మాన్యాలను, సంఘటనలను, సందర్భాలను, పరిణామాలను, మార్పులను గమనించారు. తనదైన ప్రత్యేక శైలి సంపాదకీయాలు రాశారు. పొత్తూరి అంటే ఒక ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి అధ్యక్షుడిగా వ్యవహరించారు. తెలుగు భాషా వికాసానికి, సాహిత్యాభివృద్ధికి నిరంతర కృషి చేశారు. ఎందరో సాహితీ వేత్తలకు వెన్నుదన్నుగా నిలిచి నిలిచి భాషాభ్యున్నతికి చేయూత అందించారు. దాదాపు నూట యాభై యేళ్ళ తెలుగు పత్రికా చరిత్ర గురించి సంపూర్ణ అవగాహన కలిగి, స్వయంగా ఒక సకల విషయ సంగ్రహ నిధిగా నిలిచారు. పత్రికా రచనల పట్ల, తెలుగు సాహిత్యం పట్ల అయన అంకిత భావం సాటిలేనిది. అందుకే తెలుగు పత్రికా రంగంలో మేటి సంపాదకులుగా పొత్తూరి గుర్తింపు పొందారు. సాహిత్య, సాంస్కృతిక, సాంఘిక, చమత్కార, జ్ఞాన, విజ్ఞాన, రాజకీయ ఒక్కటేమిటి పాత్రికేయులకు ఉండాల్సిన అన్ని అంశాలలో అపారమైన జ్ఞాన సంపన్నులుగా అసమాన ప్రతిభ కనబరిచారు. "నాటి పత్రికలు విలువలు పాటించేవి. సంపాదకులు నడిపించేవారు. నేడు పరిస్థితి వేరు. యజమానులే నడిపిస్తున్నారు. పత్రికల ప్రతులు ఎక్కువ సంఖ్యలో అమ్ముకోవడానికి తాపత్రయ పడుతున్నారు. విలువలు పడి పోయాయని" తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తుండే వారు. యాజమాన్యాల భావజాలాలు అనుగుణంగా కాకుండా, సర్వ స్వతంత్రులుగా వ్యవహరించే వారు. కొన్ని సందర్భాలలో యాజమాన్యం ఆంక్షలు విధించితే, రాజీ పడక, రాజీనామా చేసి వెళతానని నిక్కచ్చిగా చెప్పేవారు పొత్తూరి వెంకటేశ్వరరావు. ఆయన వ్యాస పరంపర ఎంతో విలువైన సమాచారాన్ని విలువ కలిగిన సమాచార యుక్తంగా సామాన్య భాషలో, సూటిగా ఆకర్షణీయంగా ఉండేవి. తుదిశ్వాస

వరకు జర్నలిజం విలువలకు కట్టుబడి తనదైన విలక్షణ వ్యక్తిత్వానికి దర్పణంగా నిలిచిన ధన్యజీవి పొత్తూరి.నాటి పత్రికల మేటి విలువలు , చింతన, చిరస్మరణీయులు, కాశీనాధుని నాగేశ్వరరావు, పారమార్థిక పదకోశం తదితర రచనలు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం నక్సలైట్లతో జరిపిన చర్చల్లోపౌర స్పందన వేదిక సభ్యుడిగా పొత్తూరి క్రియాశీల పాత్ర పోషించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణలకు గౌరవ సంపాదకత్వం కూడా వహించారు. లోకాయుక్త కమిటీలో జ్యుడీషల్ సభ్యుడిగా, సలహాదారుగా పొత్తూరి పనిచేశారు. పొత్తూరి వెంకటేశ్వరరావు బ్రిటీష్ లైబ్రరి సభ్యత్వం కలిగి ఉన్న అపురూప గౌరవం దక్కించు కున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పొత్తూరి రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక రాష్ట్ర వాదనకు ఆయన మద్దతు తెలిపారు. 2020 మార్చి 5న పొత్తూరి లోకాన్ని వదిలి వెళ్లారు.

## ప్రగతిశీల భావజాలమే మా శక్తి



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రగతిశీల భావజాలమే తమకు బలాన్నిస్తున్నాయని, ఆధిపత్య శక్తులు పెత్తనం చెలాయించాలని చూసినప్పుడు ఈ శక్తితోనే ప్రతిఘటిస్తున్నామని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ పేర్కొన్నారు. సమ సమాజ నిర్మాణ ఆకాంక్షతో నవదోయం లాంటి భావజాలాన్ని అక్షరీకరించి ప్రపంచానికి అందించిన ప్రఖ్యాత సైద్ధాంతికవేత్త కార్ల్ మార్క్స్ విగ్రహాన్ని చెన్నయ్ లోని కన్నెమర గ్రంథాలయ ఆవరణలో ఆయన ఆవిష్కరించారు. రాష్ట్ర మంత్రివర్గం మొత్తం మార్క్స్‌కు ఘన నివాళులర్పించింది. ఈ కార్యక్రమంలో స్టాలిన్‌తో పాటు ప్రముఖ పాత్రికేయులు ఎన్ రామ్, సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు కె బాలకృష్ణన్, యు వాసుకి, రాష్ట్ర కార్యదర్శి పి షణ్ముగం, కంట్రోల్ కమిషన్ చైర్మెన్ జి రామకృష్ణన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎం వీరపాండ్యన్, వీసీకే చీఫ్ తొల్ తిరుమవలవన్, ఎండీఎంకే చీఫ్ వైకో, పీసీసీ అధ్యక్షులు కె సెల్వ పెరుతంగై తదితరులు పాల్గొన్నారు. అంతర్జాతీయ విప్లవ నేత అయిన కార్ల్ మార్క్స్‌ను నిత్యం స్మరించుకునేలా గౌరవించే ఉద్దేశంతో చెన్నైలో సముచిత స్థానంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని గతేగాది ఏప్రిల్‌లో అసెంబ్లీలో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ విగ్రహాన్ని రూ.85.8 లక్షల వ్యయంతో నెలకొల్పారు. విగ్రహావిష్కరణ సందర్భంగా సామాజిక మాధ్యమాల్లో స్టాలిన్ ఒక సందేశం పోస్టు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రగతిశీల ఆలోచనలు, ఆదర్శాలకు కట్టుబడి వుందనడానికి ప్రతీకగా ఈ విగ్రహాన్ని ఆవిష్కరించినట్లు స్టాలిన్ తెలిపారు. 'మార్క్స్ విగ్రహం స్థాపన, అసమానతల నిర్మూలన. అరుణ వర్ణాన్ని పునరుద్ఘాటించిన చెన్నై. కాన్నెమారా పబ్లిక్ లైబ్రరీ వద్ద కార్ల్ మార్క్స్ విగ్రహ స్థాపన' అని ఆయన పేర్కొన్నారు. 'ప్రగతిశీల ఆలోచనలు, భావజాలం ఎక్కడినుంచి వచ్చిందో అనవసరం, వాటి నుంచి మేం బలాన్ని పొందుతున్నాం. ఆధిపత్య శక్తులు మాపై పెత్తనం చెలాయించాలనుకున్నపుడు వాటిని మేం ప్రతిఘటిస్తాం. ఇది మన ద్రవిడ నమూనా సారాంశం' అని ముఖ్యమంత్రి తెలిపారు.

## సుప్రీం తీర్పుపై జోక్యం చేసుకోవాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** సుప్రీంకోర్టు తీర్పుపై కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ (ఏఐ జాక్టో) నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్లమెంటులో కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఏఐ జాక్టో స్టీరింగ్ కమిటీ సభ్యులు సీఎన్ భార్తి, చావ రవి, కత్తి నరసింహారెడ్డి, బసవరాజ్ గురికార్, కమలాకాంత త్రిపాఠి, సీపీఐ(ఎం) రాజ్యసభ సభ్యులు వి శివదాసన్ కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యాహక్కు చట్టం అమలుకు పూర్వం నియామకమైన ఉపాధ్యాయులంతా రెండేండ్లలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష పాస్ కావాలని, లేదా ఉద్యోగాల నుంచి తొలగించాలని సెప్టెంబర్ 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వల్ల దేశవ్యాప్తంగా 30లక్షల మంది ఉపాధ్యాయులు ప్రభావితం అవుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సత్వరమే జోక్యం చేసుకుని, అవసరమైతే చట్ట సవరణ చేసైనా సీనియర్ ఉపాధ్యాయుల ఉద్యోగాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా టెట్ సిలబస్, అర్హత మార్కుల విషయంలో సడలింపు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి ధర్మేందప్రధాన్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు రెండు, మూడు సందర్భాల్లో ఉపాధ్యాయులందరూ టెట్ పాస్ కావాలని తీర్పు ఇచ్చిందని, దానిని ఎలా అధిగమించాలో న్యాయ నిపుణులతో ఆలోచన చేస్తున్నామని అన్నారు. దీనికి నేతలు బదులిస్తూ ఇప్పటికే ఆరు నెలలు గడిచాయని, ఉపాధ్యాయులంతా మానసికంగా ఆందోళనలో ఉన్నారని తెలిపారు. దేశ నలుమూలల నుంచి వచ్చిన వేలాది మంది ఉపాధ్యాయులు జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించారని, జాప్యం లేకుండా నిర్ణయం తీసుకుని ఉపాధ్యాయులకు ఊరట కలిగించాలని మంత్రిని కోరారు. అదే విధంగా సీపీఎస్ రద్దు, ప్రాథమిక ఉపాధ్యాయులకు ఓటు హక్కు, కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు, జాతీయ విద్యా విధానంలో ప్రభుత్వ విద్యకు నష్టం కలిగించే అంశాల రద్దు తదితర సమస్యలను ప్రస్తావించగా అవన్నీ ప్రభుత్వ విధానపరమైన అంశాలంటూ దాటవేయడం పట్ల ఐక్య వేదిక నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పార్లమెంటు ఆవరణలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ ప్రతిపక్ష నాయకులు మల్లికార్జున ఖర్గేను కలిసి టెట్ సమస్యను వివరించి.. పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని ఏఐ జాక్టో నాయకులు తెలిపారు.

## అబుజ్‌మాడ్ అడవుల్లో ఎన్‌కౌంటర్

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్ర సరిహద్దు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర అబుజ్‌మాడ్ అటవీ ప్రాంతంలో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో మహిళా మావోయిస్టు సహా ఏడుగురు మావోయిస్టులు మృతిచెందినట్టు పోలీస్ అధికారులు ధ్రువీకరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్‌లో భాగంగా.. ఇప్పటికే అబుజ్‌మాడ్ అడవులను హస్తగతం చేసుకున్న పోలీసులు దండకారణ్యాన్ని జల్లెడ పడుతున్నారు. ఈ క్రమంలో మావోయిస్టులు తారసపడగా ఇరువురు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు (ఇద్దరు పురుషులు, మహిళ) మృతిచెందారు. వీరిలో రూ.25 రివార్డు ఉన్న మావోయిస్టు నాయకుడు ప్రభాకర్ ఉన్నట్టు సమాచారం. సంఘటనా స్థలం నుంచి ఏకే–47 రైఫిల్, ఎస్‌ఎల్‌ఆర్ రైఫిల్‌ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మరణించిన మావోయిస్టులను గుర్తించాల్సి ఉంది. ఈ ఆపరేషన్ సమయంలో సీ–60 దళానికి చెందిన కానిస్టేబుల్ దీపక్ చిన్న మాడవి(38) తీవ్రంగా గాయపడ్డారు.

హెలికాప్టర్ ద్వారా భమ్రగఢ్ సబ్–డిస్ట్రిక్ట్ ఆస్పత్రికి తరలించిన తర్వాత చికిత్స పొందుతూ ఆయన మరణించారు. మరో కానిస్టేబుల్.. కిష్టయ్యపల్లి నివాసి జోగా మాడవికి తూటా తగిలింది. అతన్ని హెలికాప్టర్ ద్వారా భమ్రగఢ్‌కు తరలించారు. అతని పరిస్థితి నిలకడగా ఉంది. తదుపరి చికిత్స కోసం అతన్ని గడ్చిరోలికి తరలించనున్నారు. ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

# ఎస్‌బిఐ వినియోగదారులకు ఇక నుంచి ఛార్జీల మోతే!




**హైదరాబాద్ పెన్ పవర్:** దేశీయ బ్యాకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన ఖాతాదారులకు షాకిచ్చింది. ఇప్పటి వరకు ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా అందుబాటులో ఉన్న ఐఎంపీఎస్ (ఎఓఖూ) నగదు బదిలీ సేవలపై సర్వీస్ ఛార్జీలు వసూలు చేయాలని నిర్ణయించింది. ఈ కొత్త నిబంధనలు 2026, ఫిబ్రవరి 15 నుంచి అమలులోకి రానున్నాయి. అయితే, సాధారణంగా అత్యవసర నగదు బదిలీల కోసం వినియోగించే ఎఓఖూ సేవలపై బ్యాంక్ పరిమితులను విధించింది. దీని ప్రకారం.. ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ మరియు యోనో యాప్ ద్వారా చేసే లావాదేవీలకు ఈ ఛార్జీలు వర్తిస్తాయి. బ్యాంక్ వెల్లడించిన వివరాల ప్రకారం.. రూ. 25,000 వరకు ఎటువంటి ఛార్జీలు ఉండవు. రూ.25,001 నుంచి రూ.1,00,000 వరకు రూ.2 ప్లస్ జీఎస్టీ, రూ.1,00,001 నుంచి రూ. 2,00,000 వరకు రూ.6 ప్లస్ జీఎస్టీ, రూ.2,00,001 నుంచి రూ.5,00,000 వరకు రూ.10 ప్లస్ జీఎస్టీ చార్జ చయనున్నారు. కాగా, రూ.25 వేల లోపు చేసే లావాదేవీలపై ఎటువంటి ఛార్జీలు విధించకపోవడం సామాన్య వినియోగదారులకు కొంత ఉపశమనం కలిగించే అంశం. నేరుగా బ్యాంకు బ్రాంచ్‌కు వెళ్లి చేసే ఎఓఖూ ఛార్జీలలో ఎటువంటి మార్పు లేదు. అవి పాత పద్ధతిలోనే రూ.2 నుంచి రూ.20 వరకు కొనసాగుతాయి. అదేవిధంగా డిఫెన్స్, కేంద్ర ప్రభుత్వం, రైల్వే, పోలీసు సిబ్బందికి చెందిన శాలరీ అకౌంట్లకు, అలాగే కొన్ని ప్రత్యేక సేవింగ్స్ ఖాతాలకు మాత్రం ఈ ఛార్జీల నుంచి మినహాయింపు ఉంటుంది.

# కిమ్స్ ఆదాయం రూ.1,003 కోట్లు

**హైదరాబాద్ పెన్ పవర్:** కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో తొలిసారిగా రూ.1,000 కోట్ల ఆదాయ మైలురాయిని అధిగమించింది. సమీక్షా త్రైమాసిక ఆదాయం రూ.1,003 కోట్లుగా నమోదైంది. 2024-25 ఇదే కాల ఆదాయం రూ.790 కోట్ల కంటే, ఇది 27% అధికం. ఇదే సమయంలో సంస్థ నికర లాభం మాత్రం రూ.93 కోట్ల నుంచి రూ.52 కోట్లకు పరిమితమైంది. కొత్తగా ప్రారంభించిన బెంగళూరు, థానే యూనిట్ల నిర్వహణ ఖర్చులు పెరగడమే ఇందుకు కారణమని సంస్థ వివరించింది. చికిత్స కోసం వచ్చే రోగుల సంఖ్య పెరిగిందని, ఒక్కో పడక ద్వారా వచ్చే సగటు ఆదాయం గత ఏడాదితో పోలిస్తే 20.5% వృద్ధితో రూ.46,341కి చేరుకుందని పేర్కొంది. ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, మహారాష్ట్రల్లోని 25 ఆసుపత్రుల్లో సంస్థకు 7,100 పడకల సామర్థ్యం ఉంది. వివిధ దశల్లో ఉన్న కొత్త ఆసుపత్రుల ద్వారా, పడకల సామర్థ్యం 9,100కు చేరుతుందని కిమ్స్ సీఎండీ బి.భాస్కర రావు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరాన్ని మరింత వృద్ధితో ముగిస్తామన్న విశ్వాసం ఉందన్నారు.

# ఆన్‌లైన్ మోసాల బాధితులకు రూ. 25,000 పరిహారం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఈసారి ద్రవ్య పరపతి విధాన కమిటీసమావేశంలో ఆర్‌బీఐ కీలక ప్రతిపాదన చేసింది. చిన్న మొత్తంలో జరిగే మోసపూరిత లావాదేవీలలో నష్టపోయిన వినియోగదారులకు రూ. 25,000 వరకు పరిహారం అందించడానికి భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) ప్రత్యేక ఫ్రేమ్‌వర్క్‌ను ప్రతిపాదిస్తుందని గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం తెలిపారు. వినియోగదారుల రక్షణ, డిజిటల్ చెల్లింపుల భద్రతను పెంచడానికి ఆర్‌బీఐ తీసుకున్న అనేక చర్యల్లో ఇది భాగం. దీనికి సంబంధించి మార్గదర్శకాలను త్వరలో జారీ చేస్తామని గవర్నర్ స్పష్టం చేశారు. ఈ పరిహార ప్రయోజనం జీవితకాలంలో ఒక్కసారి మాత్రమే వస్తుందని, ప్రతి సంవత్సరం కాదు. వినియోగదారులు అప్రమత్తంగా ఉండటానికి, పదే పదే తప్పులు చేయకుండా నిలువరించడానికే ఈ పరిమితిని నిర్ణయించారు. చెల్లించాల్సిన మొత్తం నష్టంలో 85 శాతం లేదా రూ. 25,000, ఈ రెండింటిలో ఏది తక్కువ అయితే అదిగా లెక్కిస్తారు. ఉదాహరణకు నష్టం రూ. 50,000 అయితే, 85% అంటే రూ. 42,500 అవుతుంది. కానీ ఆర్‌బీఐ రూ. 25,000 మాత్రమే చెల్లిస్తుంది. అదే, నష్టం రూ. 20,000 అయితే, 85 శాతం అంటే రూ. 17,000, కాబట్టి పరిహారం రూ. 17,000 ఇస్తారు. ఆర్‌బీఐ డేటా ప్రకారం, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 29,080 మోసాలు, రూ. 1,457 కోట్ల నష్టాలు నమోదయ్యాయి. ఆ తర్వాత 2024-25 ఆర్థిక సంవత్సరంలో కార్డ్, ఇంటర్నెట్ ఆధారిత లావాదేవీలకు సంబంధించిన 13,469 మోసాల కేసులు నమోదయ్యాయని, వీటి వల్ల రూ. 520 కోట్ల నష్టం వాటిల్లిందని బ్యాంకులు నివేదించాయి. అలాగే, బ్యాంకులు కస్టమర్లకు అవసరంలేని, పూర్తి సమాచారం ఇవ్వకుండా రుణాలివ్వడం, రుణాల రికవరీ, అప్పులను వసూలు చేయడానికి ఏజెంట్ల వినియోగంపై మార్గదర్శకాలను జారీ చేస్తామని ఆర్‌బీఐ పేర్కొంది.

# పిఎఫ్‌సి చేతికి ఆర్‌ఇసి..

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశీయ విద్యుత్ రంగ ఫైనాన్సింగ్ రంగంలో భారీ విలీనం చోటు చేసుకుంది. ప్రభుత్వ రంగ దిగ్గజం రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్‌ఇసి)లో ప్రభుత్వానికి ఉన్న 52.63 శాతం వాటాను పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఆర్‌ఎఫ్‌సి) కొనుగోలు చేసింది. దీనితో ఆర్‌ఇసి ఇప్పుడు పిఎఫ్‌సికి అనుబంధ సంస్థగా మారింది. శుక్రవారం జరిగిన బోర్డు సమావేశంలో ఈ కొనుగోలుకు ఆమోదం తెలపడమే కాకుండా, భవిష్యత్తులో ఈ రెండు సంస్థల పూర్తిస్థాయి విలీనానికి కూడా సూత్రప్రాయంగా అంగీకారం లభించింది. రెండు సంస్థల విలీనం ద్వారా రుణ పంపిణీ సామర్థ్యం పెరిగి, గ్రీన్ హైడ్రోజన్, ఇవి బ్యాటరీ స్టోరేజ్, మెట్రో రైలు వంటి భారీ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం మరింత సులభతరం కానుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నిర్ణయంతో కేంద్రానికి భారీ ఆదాయం సమకూరనుంది. ఇది ఒక రకంగా పెట్టుబడుల ఉపసంహరణే కావడం గమనార్హం. మరోవైపు దీనిపై ఇరు సంస్థల ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విలీనం ద్వారా విద్యుత్ ఫైనాన్స్ రంగంలో పోటీతత్వం లోపించే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. ఉద్యోగాలు తగ్గుతాయని హెచ్చరిస్తున్నారు.

# భారత ఎగుమతిదారులు, ఎంఎస్ఎంఇ రంగానికి సువర్ణావకాశం




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్ అమెరికా దేశాల మధ్య కుదిరిన చారిత్రాత్మక ఒప్పందానికి సంబంధించిన అధికారిక ముసాయిదా విడుదలైంది. దీంతో ఇరు దేశాల నేతలు ఈ చారిత్రక ఒప్పందం పై హర్షం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియా వేదికగా ప్రకటనలు విడుదల చేస్తున్నారు.అయితే ఈ ఒప్పందం వల్ల ఎవరికి లాభం, ఎవరికి నష్టం అనే క్లారిటీ ఇప్పుడిప్పుడే వస్తుంది. భారత్, అమెరికాల ఒప్పందం కారణంగా.. భారతీయ ఎగుమతిదారులకు సుమారు 30 ట్రిలియన్ డాలర్ల అమెరికా మార్కెట్ అందుబాటులోకి రానున్నట్లు మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. ఇందులో ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, వ్యవస్థాపకులు మరియు స్టార్టప్ ఆవిష్కర్తలు తమ ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేయడానికి భారీ అవకాశాలు లభిస్తాయి. అమెరికా తన దిగుమతి సుంకాలను 18 శాతానికి తగ్గించడం వల్ల టెక్స్‌టైల్స్, లెదర్, ఫుట్‌వేర్, ప్లాస్టిక్, హ్యాండీక్రాఫ్ట్స్ వంటి రంగాలకు చెందిన తయారీదారులు అంతర్జాతీయ విపణిలో గొప్ప లాభాలను పొందే అవకాశం ఉంది. తాజా పరిణామాలతో ఎవరికి లాభం ఎవరికి నష్టం అనే విషయాలను ఇక్కడ చూద్దాం. అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందం కేవలం ఆర్థిక వృద్ధికే పరిమితం కాకుండా, దేశంలో లక్షలాది కొత్త ఉద్యోగాల సృష్టికి మార్గం సుగమం చేస్తుంది. ఎగుమతులు పెరగడం వల్ల తయారీ, సేవా రంగాల్లో నూతన అవకాశాలు లభిస్తాయి, ఇవి ప్రధానంగా యువత, మహిళా కార్మికులకు ఎంతో మేలు చేస్తాయి. దీనివల్ల దేశవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు పెరిగి, మధ్యతరగతి, గ్రామీణ కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని అంచనా వేయబడింది. ఈ ఒప్పందం కారణంగా భారత్ రైతులు, వ్యవసాయ రంగానికి నష్టం కలిగే అవకాశం ఉందని మొదట అనే విమర్శలు వచ్చాయి. అయితే దేశీయ వ్యవసాయ రంగంపై ప్రభావం చూపకుండా కేంద్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంది. భారత్ తన రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, సున్నితమైన వ్యవసాయ, పాడి ఉత్పత్తులైన వరి, గోధుమ, మొక్కజొన్న, పాలు, చీజ్, పౌల్ట్రీ వంటి వాటిని ఈ ఒప్పందం పరిధిలోకి రాకుండా పూర్తి రక్షణ కల్పించింది. దీనివల్ల అమెరికా నుంచి వచ్చే చౌకైన అగ్రి-ఉత్పత్తుల వల్ల మన రైతులు నష్టపోయే ప్రమాదం లేకుండా ప్రభుత్వం జాగ్రత్త పడింది. ఈ ఒప్పందం కారణంగా అమెరికా నుంచి అనే వస్తువులు భారత్‌లోకి దిగుమతి అవుతాయి. దీంతో భారతీయ కంపెనీలు అమెరికా నుంచి వచ్చే నాణ్యమైన ఉత్పత్తులతో పోటీ పడాల్సి ఉంటుంది. అమెరికా కూడా పరస్పర ప్రాతిపదికన కొన్ని రాయితీలను పొందుతుంది కాబట్టి, మన దేశీయ మార్కెట్లోకి వచ్చే అమెరికా వస్తువుల ధరలు తగ్గే అవకాశం ఉంది. ఇది భారతీయ వినియోగదారులకు లాభం చేకూర్చినప్పటికీ, దేశీయ తయారీదారులు తమ నాణ్యతను పెంచుకుని పోటీని పెట్టుకోవాల్సిన సవాలును ఎదుర్కొంటారు. ముఖ్యంగా విమాన విడిభాగాలు, జెనరిక్ ఫార్మా రంగాలు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మెరుగు పడాల్సి ఉంటుంది.

# ఏఐ వెల్‌నెస్ కోచ్‌లతో మారనున్న మీ లైఫ్ స్టైల్



**హైదరాబాద్ పెన్ పవర్:** నేటి సమాజం పెరుగుతున్న టెక్నాలజీతో ఎంత వేగంగా మారుతుందో చెప్పడానికి మన చేతుల్లో ఉండే స్మార్ట్ పరికరాలో ప్రధాన ఉదాహరణ. ఒకప్పుడు కేవలం ఫోన్ కాల్స్, మెసేజ్‌లకే పరిమితమైన స్మార్ట్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఇప్పుడు మన ప్రాణాలను కాపాడే 'లైఫ్ గార్డ్స్'గా మారుతున్నాయి. ప్రస్తుతం ప్రపంచంలో ఆరోగ్యంగా ఉండటానికి.. మనం ఏం తినాలి? ఎంతసేపు పడుకోవాలి? చివరికి మనం ఎప్పుడు నీళ్లు తాగాలో కూడా ఇప్పుడు ఒక 'చిప్', 'ఏఐ అల్గారిథం' నిర్ణయిస్తుంది. 2026లో లైఫ్ స్టైల్ విభాగంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్న "ఏఐ వెల్‌నెస్ కోచింగ్" గురించి ఇక్కడ తెలుసుకుందాం. పాత కాలంలో మనకు ఆరోగ్యం బాలేకపోతే డాక్టరు దగ్గరికో, ఫిట్‌నెస్ కోసం యోగా గురువు, జిమ్ ట్రైనర్ దగ్గరికో వెళ్లేవాళ్లం. కానీ ఇప్పుడు ఆ అవసరం లేకుండానే మన చేతికి ఉన్న స్మార్ట్ రింగ్, స్మార్ట్ వాచ్ మన శరీరంలోని ప్రతి కదలికలను గమనిస్తోంది. ఇవి కేవలం అడుగులను లెక్కించడమే కాకుండా, రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలను, గుండె వేగంలోని హెచ్చుతగ్గులను, నిద్ర నాణ్యతను సెకన్ల వ్యవధిలో విశ్లేషిస్తున్నాయి. ఈ డేటాను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి, మన శరీర తత్వానికి తగ్గట్టుగా పర్సనలైజ్డ్ సూచనలను అందిస్తున్నాయి. అభివృద్ధి తో పోటీ పడుతున్న ఈ సమయంలో మనం తీసుకునే ఆహారం, మనపై ఎంతో ప్రభావం చూపుతుంది. ఈ క్రమంలో ప్రతి ఒక్కరి శరీర మెటబాలిజం ఒకేలా ఉండదు. అందుకే అందరికీ ఒకే రకమైన డైట్ ప్లాన్ పని చేయదు. ఏఐ కోచ్‌లు మీ శరీరంలోని షుగర్ లెవల్స్, క్యాలరీ బర్నింగ్ రేటును బట్టి, మీకు ఆ రోజూ ఏ ఆహారం అవసరమో సూచిస్తాయి. ఉదాహరణకు, మీరు వ్యాయామం చేసిన తర్వాత ప్రోటీన్ ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోమని, రక్తంలో షుగర్ పెరిగితే కార్బోహైడ్రేట్లు తగ్గించమని ఇవి మనకు సలహాలు అందిస్తాయి. పోటీ ప్రపంచంలో పని ఒత్తిడి, ఆర్థిక, కుటుంబ కారణాల వల్ల ఎంతో మంది మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. ఇది నేటి తరం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య గా మిగిలిపోయింది. మీరు ఎప్పుడు ఆందోళనకు గురవుతున్నారో మీ నాడి వేగాన్ని బట్టి ఏఐ గుర్తిస్తుంది. వెంటనే మీ ఫోన్‌లో ఒక చిన్న మెడిటేషన్ సెషన్, ప్రశాంతంగా ఊపిరి పీల్చుకునే ఎక్సర్‌సైజ్ చేయమని రిమైండర్లు పంపుతుంది. తద్వారా తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురి కాకముందే మిమ్మల్ని అలర్ట్ ఇది చేస్తుంది.

# విద్యారంగానికి జాకీర్ హుస్సేన్ విశిష్ఠ సేవలు

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత దేశపు మొదటి ముస్లిం రాష్ట్రపతి, పదవిలో మరణించిన మొదటి భారత దేశ ప్రథమ పౌరులు జాకీర్ హుస్సేన్ (ఫిబ్రవరి 8, 1897 – మే 3, 1969). ఆయన మే 13 1967 నుండి మరణించినంత వరకు రాష్ట్రపతి పదవిలో ఉన్నారు. భారత 3వ రాష్ట్రపతి జాకీర్ హుసేన్ హైదరాబాదు (భారత దేశం)లో జన్మించారు. ఇతని తండ్రి పఖ్తూన్ జాతికి చెందిన వారు. అయన హైదరాబాదు నుండి ఉత్తరప్రదేశ్ లోని ఫరూఖాబాద్ జిల్లా ఖాయిమ్ గంజ్ కు వలస వచ్చారు. హుస్సేన్ ప్రారంభ ప్రాథమిక విద్య హైదరాబాద్‌లో పూర్తయింది. హుసేన్ ఇటావా (ఉత్తరప్రదేశ్) లోని 'ఇస్లామియా ఉన్నత పాఠశాల' లో చదువు కున్నారు. లక్నో విశ్వ విద్యాలయం క్రిస్టియన్ డిగ్రీ కాలేజీ నుండి ఎకనామిక్స్ లో పట్టభద్రు డయ్యారు. ఉన్నతవిద్య అలీఘర్ లోని ఆంగ్లో మహమ్మడన్ ఓరియంటల్ కాలేజిలో అభ్యసించారు. ఇచట విద్యార్థి సంఘ నాయకునిగా గుర్తింప బడ్డారు.18 సంవత్సరాల వయస్సులో, అయన షాజహాన్ బేగంను వివాహం చేసుకున్నారు. జాకీర్ హుస్సేన్ 23 సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడు, విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందంతో అయన నేషనల్ ముస్లిం విశ్వ విద్యాలయాన్ని స్థాపించారు. మొదట అలీఘర్లో 1920 అక్టోబర్ 29 శుక్రవారం స్థాపించ బడింది, తరువాత 1925 లో న్యూ ఢిల్లీ లోని కరోల్ బాగ్ కు మార్చబడింది. తరువాత మార్చి 1, 1935 న న్యూ ఢిల్లీలోని జామియా నగర్ కు మళ్లీ మార్చ బడింది. దీనికి జామియా మిలియా ఇస్లామియా (కేంద్ర విశ్వ విద్యాలయం) అని పేరు పెట్టారు.జాకీర్ విత్తశాస్త్రంలో పి.హెచ్.డి. చేసేందుకు, 'బెర్లిన్ విశ్వ విద్యాలయానికి (జర్మనీ) వెళ్ళారు.1926 లో బెర్లిన్ విశ్వ విద్యాలయం నుండి ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్ పొందారు. జర్మనీలో ఉన్నప్పుడు గాలిబ్ (1797-1868) జీవితగాథ, కవితా సంగ్రహాలను క్రోడీకరించారు.1927 లో మూసివేతను ఎదుర్కొంటున్న జామియా మిలియా ఇస్లామియాకు నాయకత్వం వహించడానికి అతను భారత దేశానికి తిరిగి వచ్చాడు. భారత దేశానికి తిరిగి వచ్చి, జామియా మిల్లియా ఇస్లామియాకు ఇరవై ఒక్క సంవత్సరాలు ఆయన పదవిలో కొనసాగారు. మార్గ దర్శకులుగా మారారు. ముహమ్మద్ ఆంగ్లో ఓరియంటల్ కళాశాల (ఇప్పుడు అలీఘర్ ముస్లిం విశ్వ విద్యాలయం) వ్యవహారాల్లో ముఖ్యంగా చురుకుగా ఉన్నారు. మహమ్మద్ అలీ జిన్నా వంటి రాజకీయ ప్రత్యర్థుల ప్రశంసలను పొందారు. బ్రిటిష్ వారితో పోరాటానికి, మహాత్మా గాంధీతో చేతులు కలిపి, "బేసిక్ విద్య" పై కఠోర పరిశ్రమ చేశారు. భారతదేశంలో విద్యాభ్యుదయానికి శ్రమించారు. ఈ కాలంలో హుసేన్ ఉత్తమ దార్శనికుడిగా, భారత విద్యా విభాగ మార్గదర్శకునిగా గుర్తింపు పొందారు. తమ రాజకీయ ప్రత్యర్థియైన మహమ్మద్ అలీ జిన్నా చేత కూడా పొగడ బడ్డారు. తన వ్యక్తిగత సంపదనంతా భారతదేశానికి ధారబోసిన దేశ భక్తులు. భారత స్వాతంత్ర్యం తరువాత, అలీఘర్ ముస్లిం యూనివర్శిటి వైస్ ఛాన్సలర్ పదవిని అంగీకరించారు. స్వాతంత్ర్యం వచ్చిన ప్రథమ దశలో విద్యార్థుల ఉద్యమాలను, ముఖ్యంగా అలీఘర్ లో, అదుపులో ఉంచుటకు, అయన నియామకం ఎంతో ఉపయోగ పడింది. వైస్ ఛాన్సలర్ పదవీకాలం ముగిసిన తరువాత 1956 లో పార్లమెంటు సభ్యునిగా నామినేట్ చేయ బడ్డారు. 1957 లో బీహారు గవర్నరుగా నియమింప బడి, పార్లమెంటుకు రాజీనామా చేశారు. బీహారు గవర్నరుగా 1957 నుండి 1962 వరకు సేవలందించిన తరువాత 1962 నుండి 1967 వరకు భారత ఉప రాష్ట్రపతి పదవిని అలంకరించారు. తదనంతరం మే 13 1967 న భారత రాష్ట్రపతిగా ఎన్నుకో బడ్డారు. అయన ప్రథమ ఉపన్యాసంలో "మొత్తం భారత దేశం నా ఇల్లు, ప్రజలందరూ నా కుటుంబం" అని పేర్కొన్నారు. తన అధ్యక్ష పదవీ కాలంలో, హుస్సేన్ హంగరీ, యుగోస్లేవియా, యుఎస్ఎస్ఆర్ మరియు నేపాల్ లకు నాలుగు దేశాలకు పర్యటించారు.1969 మే 3 న అయన మరణించగా, న్యూ ఢిల్లీ లోని జామియా మిలియా ఇస్లామియా క్యాంపస్‌లో ఖననం చేశారు. అత్యల్పకాలం రాష్ట్రపతి పదవి నిర్వహించిన మొదటి వ్యక్తి. రాష్ట్రపతి పదవిలో ఉండగా మరణించిన మొదటి వ్యక్తి కూడా ఆయనే. (ఇప్పటి వరకు ఇద్దరు రాష్ట్రపతులు పదవిలో ఉండగా మరణించారు – డా.జాకీర్ హుస్సేన్, ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ ). ఈయన చేసిన సేవలకు కేంద్ర ప్రభుత్వం 1963 లో 'భారతరత్న' పురస్కారాన్ని అందించింది.

# ఆరోగ్యానికి అమృతం లాంటి పండు



సపోటా యొక్క నిజమైన ఆరోగ్య ప్రయోజనాలు చాలామందికి ఇంకా తెలియవు. సపోటాను పచ్చిగా తినవచ్చు లేదా రసంగా తీసుకోవచ్చు. ప్రతిరోజూ ఆహారంలో సరైన మోతాదులో సపోటాను చేర్చుకుంటే, అనేక ఆరోగ్య సమస్యలను నియంత్రించుకోవచ్చు అని నిపుణులు చెబుతున్నారు. మన రోజువారీ ఆహారంలో సపోటాను చేర్చుకోవడం వల్ల శరీరానికి అవసరమైన అనేక పోషకాలు అందుతాయి. మనం సపోటాను సాధారణ పండుగానే తీసుకుంటాం. కానీ, సపోటా వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి చాలా మందికి తెలియకపోవచ్చు. పోషకాలతో నిండిన ఈ పండు మనకు చాలా సులభంగా దొరుకుతుంది. దుకాణాల్లోనే కాదు, చాలా ఇళ్లలో కూడా ఇది సాధారణంగా కనిపిస్తుంది. అయినప్పటికీ, సపోటా యొక్క నిజమైన ఆరోగ్య ప్రయోజనాలు చాలామందికి ఇంకా తెలియవు. సపోటాను పచ్చిగా తినవచ్చు లేదా రసంగా తీసుకోవచ్చు. ప్రతిరోజూ ఆహారంలో సరైన మోతాదులో సపోటాను చేర్చుకుంటే, అనేక ఆరోగ్య సమస్యలను నియంత్రించుకోవచ్చు అని నిపుణులు చెబుతున్నారు. మన రోజువారీ ఆహారంలో సపోటాను చేర్చుకోవడం వల్ల శరీరానికి అవసరమైన అనేక పోషకాలు అందుతాయి. ముఖ్యంగా ఇందులో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. వారానికి కనీసం మూడు సార్లు సపోటా తినడం వల్ల మలబద్ధకం సమస్యలు తగ్గుతాయి. జీర్ణ సంబంధిత ఇబ్బందులు ఉన్నవారికి ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. సపోటాలో పొటాషియం, మెగ్నీషియం వంటి ముఖ్యమైన ఖనిజాలు ఉన్నాయి. ఇవి రక్త ప్రసరణను మెరుగుపరచి గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. గుండెపోటు ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా ఇవి సహాయపడతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.కంటి సమస్యలు ఉన్నవారికి సపోటా మంచి ఆహారంగా పరిగణించబడుతుంది. ఇందులో ఉండే విటమిన్ ం కంటి చూపును మెరుగుపరుస్తుంది. అదేవిధంగా, విటమిన్ ఇ చర్మ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. చర్మం మెరిసేలా ఉండేందుకు సపోటా తోడ్పడుతుంది. సపోటాలో విటమిన్ అ, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీర రోగనిరోధక శక్తిని పెంచుతాయి. తరచూ అలసట, నీరసం అనుభవించే వారికి ఇది మంచి శక్తినిచ్చే పండు. రోజూ సపోటా తినడం వల్ల శరీరం ఉత్సాహంగా ఉంటుంది. నిపుణుల సూచనల ప్రకారం, రోజుకు 1 నుంచి 2 మధ్యతరహా సపోటాలు తినవచ్చు. డయాబెటిస్ ఉన్నవారు కూడా పరిమిత మోతాదులో, వైద్యుల సలహాతో సపోటాను తీసుకోవచ్చు. మొత్తానికి, తక్కువ ఖర్చుతో సులభంగా లభించే సపోటా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. కాబట్టి, మీ రోజువారీ ఆహారంలో ఈ పోషక విలువల పండును తప్పక చేర్చుకోండి.

# తరచుగా తుమ్ములు వస్తున్నాయా?



రోజులో ఒక్కసారో రెండుసార్లో తుమ్మడం సాధారణ విషయమే. కానీ రోజూ, పదే పదే, ముఖ్యంగా ఉదయం లేచిన వెంటనే లేదా దుమ్ము, వాసన, చలి తగిలినప్పుడు తుమ్ములు వస్తుంటే చాలామంది ఆందోళన చెందుతుంటారు. నిజంగా తరచుగా తుమ్ములు రావడం బలహీనమైన రోగనిరోధక వ్యవస్థకు సంకేతమేనా? రోజులో ఒక్కసారో రెండుసార్లో తుమ్మడం సాధారణ విషయమే. కానీ రోజూ, పదే పదే, ముఖ్యంగా ఉదయం లేచిన వెంటనే లేదా దుమ్ము, వాసన, చలి తగిలినప్పుడు తుమ్ములు వస్తుంటే చాలామంది ఆందోళన చెందుతుంటారు. కొందరు ఒకేసారి అనేకసార్లు తుమ్ములు తుమ్ముతుంటారు. దీంతో వారిలో “నాకు రోగనిరోధక శక్తి (ఇమ్యూనిటీ) తగ్గిపోయిందా?” అనే సందేహం చాలామందిలో కలుగుతుంది. నిజంగా తరచుగా తుమ్ములు రావడం బలహీనమైన రోగనిరోధక వ్యవస్థకు సంకేతమేనా? నిపుణులు ఏమంటున్నారు? పూర్తి వివరాలు తెలుసుకుందాం. తుమ్ము అనేది మన శరీరంలోని ఒక సహజ రక్షణ చర్య. ముక్కులోకి దుమ్ము, అలెర్జీ కారకాలు, బ్యాక్టీరియా లేదా వైరస్‌లు ప్రవేశించినప్పుడు, వాటిని బయటకు పంపడానికి శరీరం తుమ్ము ద్వారా స్పందిస్తుంది. అంటే, తుమ్మడం అనేది శరీరం పనిచేస్తున్న సంకేతమే తప్ప, తప్పనిసరిగా బలహీనతకు గుర్తు కాదు. 1. అలెర్జీలు.. ఇదే అత్యంత సాధారణ కారణం. దుమ్ము, పుప్పొడి (పోలెన్), పెంపుడు జంతువుల వెంట్రుకలు, చలి గాలి, ఇవన్నీ తుమ్ములను ప్రేరేపిస్తాయి. 2. వాతావరణ మార్పులు.. ఒక్కసారిగా చలి నుంచి వేడికి లేదా వేడి నుంచి చలికి మారితే ముక్కులోని నరాలు స్పందించి తుమ్ములు వస్తాయి. 3. సైనసైటిస్ లేదా ముక్కు సమస్యలు.. సైనస్ ఇన్‌ఫెక్షన్, ముక్కులో వాపు ఉండటం వల్ల కూడా తుమ్ములు ఎక్కువవుతాయి. 4. వైరల్ ఇన్‌ఫెక్షన్లు.. జలుబు, ఫ్లూ మొదలైనవి ఉన్నప్పుడు తుమ్ములు సహజం. 5. కాలుష్యం, రసాయన వాసనలు.. పెర్ఫ్యూమ్స్, సిగరెట్ పొగ, కెమికల్స్ కూడా తుమ్ములకు కారణం కావచ్చు. నిపుణుల అభిప్రాయం ప్రకారం.

. ఇది కొంతవరకు నిజమే. తరచూ తుమ్మడం అనేది ఎక్కువగా అలెర్జీ లేదా పర్యావరణ కారణాల వల్లే జరుగుతుంది. బలహీనమైన ఇమ్యూనిటీ ఉన్నవారికి సాధారణంగా.. తరచూ జలుబులు, ఇన్‌ఫెక్షన్లు త్వరగా రావడం, గాయాలు మానడానికి ఎక్కువ సమయం పడటం, నిరంతర అలసట వంటి లక్షణాలు కనిపిస్తాయి.కేవలం తుమ్ములే ఉన్నాయంటే అది ఇమ్యూనిటీ తక్కువగా ఉందని చెప్పలేం. కానీ, తరచుగా తుమ్మడం, పునరావృత జలుబు, గొంతు నొప్పి, అలసట లేదా తరచుగా అనారోగ్యాలు రావడం బలహీనమైన రోగనిరోధక వ్యవస్థకు సంకేతాలు. రోగనిరోధక వ్యవస్థ బలహీనంగా ఉన్నప్పుడు, శరీరం బాహ్య అలెర్జీ కారకాలు, వైరస్లతో సమర్థవంతంగా పోరాడలేకపోతుంది. అందువల్ల, లక్షణాలు పదేపదే సంభవిస్తాయి.

## గార్డెన్‌లో ఉండే ఈ కూరగాయతో..

# క్యాన్సర్‌కు చెక్ పెట్టొచ్చు!



ముఖ్యంగా క్యాన్సర్ సమస్యతో ఎంతో మంది బాధ పడుతున్నారు. దీని కోసం వేలకు వేలు పెట్టి మందులను వాడుతుంటారు. కానీ, వాటి కన్నా మన గార్డెన్ లో ఉండే వాటితోనే ఈ ప్రాణాంతక సమస్యకు చెక్ పెట్టొచ్చు. ఈ మధ్య కాలంలో అందరూ ఎవరి పనుల్లో వాళ్లు బిజీగా గడుపుతున్నారు. అయితే, ఇదే సమయంలో సమయానికి ఫుడ్ కూడా సరిగా తినలేకపోతున్నారు. దీని వలన అనేక రకాల అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. మన అందరి పెరట్లో పచ్చిమిర్చి మొక్క ఉంటుంది. అయితే, కొందరు దీనిని పక్కన పెట్టేస్తారు. మరి కొందరు అన్ని కూరల్లో వేసుకుని తింటారు. అయితే, సరైన విధంగా తీసుకుంటే ఇది మనకీ ఎంతో మేలు చేస్తుంది.పచ్చిమిర్చిలో మన శరీరానికి కావాల్సిన విటమిన్లు, పోషకాలు ఉంటాయి. ఇవి ఇమ్యూనిటీ పవర్ ను పెంచి అనారోగ్య సమస్యలు రాకుండా చేస్తాయి. జలుబు, దగ్గుతో ఇబ్బంది పడే వారికీ ఇది ఎంతో మేలు చేస్తుంది.అంతేకాదు, ఇవి శరీరంలో ఉండే హానికరమైన బ్యాక్టీరియాను కూడా తొలగిస్తుంది. దీనివల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక సమస్యలు కూడా రాకుండా ఉంటాయని నిపుణులు కూడా చెబుతున్నారు. ఈ మిర్చిలో ఉండే ఫైబర్ తిన్న ఫుడ్ ను జీర్ణం చేస్తుంది. అలాగే, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు కూడా రావు. ఇది అన్ని కూరగాయల్లో చిన్నది కానీ, దాని లాభాలను చూసి అందరూ ఆశ్చర్యపోవాల్సిందే. ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లయితే మీరు వైద్యున్ని సంప్రదించి తీసుకోవడం మంచిది.ద

# పసుపులో ఆ రెండు కలిపితేనే అది పవర్ ఫుల్



పసుపును మనం సహజమైన యాంటీబయాటిక్ అని, గొప్ప యాంటీ ఇన్‌ఫ్లమేటరీ అని నమ్ముతాం. కానీ, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ చర్మవ్యాధి నిపుణురాలు డాక్టర్ పూజా రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. మనం పసుపును విడిగా తీసుకుంటే అందులోని ప్రయోజనాలు శరీరానికి 1% కూడా అందవు. పసుపులోని ప్రధాన సమ్మేళనమైన ‘కర్కుమిన్’ను గ్రహించే శక్తి మన శరీరానికి చాలా తక్కువగా ఉండటమే దీనికి కారణం. మనం పసుపు తిన్న వెంటనే మన కాలేయం (ఒతిలవతీ) దానిని రక్తంలోకి చేరకముందే విచ్ఛిన్నం చేసి బయటకు పంపిస్తుంది. పసుపు తన పూర్తి స్థాయి ప్రభావాన్ని చూపించాలంటే దానికి తోడుగా కొన్ని పదార్థాలు అవసరమని సైన్స్ చెబుతోంది. డాక్టర్ పూజా రెడ్డి తన ఇన్‌స్టాగ్రామ్ వీడియోలో పసుపు గ్రహణశక్తిని పెంచే మార్గాలను వివరించారు. మన అమ్మమ్మల కాలం నాటి పసుపు, మిరియాల పొడి నెయ్యి కాంబినేషన్ వెనుక ఉన్న అసలు రహస్యం ఇప్పుడు ఆధునిక వైద్య పరిశోధనల్లో కూడా నిరూపితమైంది. కేవలం ఒక చిటికెడు మిరియాల పొడి చేర్చడం వల్ల పసుపు పనితీరు 20 రెట్లు పెరుగుతుందని ఆమె చెబుతున్నారు. ఆ వివరాలేంటో ఇప్పుడు చూద్దాం. మిరియాల పొడి : పసుపును మిరియాల పొడితో కలిపి తీసుకుంటే, శరీరంలో దాని గ్రహణశక్తి ఏకంగా 100 శాతం పెరుగుతుంది. మిరియాల్లో ఉండే ‘పైపెరిన్’ అనే పదార్థం, లివర్ కర్కుమిన్‌ను విచ్ఛిన్నం చేయకుండా అడ్డుకుంటుంది. దీనివల్ల పసుపు నేరుగా రక్తంలోకి ప్రవేశిస్తుంది. కొవ్వు పదార్థాలు : కర్కుమిన్ నీటిలో కరగదు, కేవలం కొవ్వులో మాత్రమే కరుగుతుంది. కాబట్టి పసుపును నెయ్యి లేదా కొబ్బరి నూనె వంటి ఆరోగ్యకరమైన కొవ్వులతో కలిపి తీసుకున్నప్పుడు మాత్రమే అది శరీరానికి అందుతుంది. ప్రాచీన విజ్ఞానం: అందుకే మన పెద్దలు పసుపును కూరల్లో నూనెతో వేయించడం లేదా పాలలో నెయ్యి, మిరియాల పొడి వేసి ఇచ్చేవారు. ఈ మూడు కలిసినప్పుడు అది ఒక శక్తివంతమైన ఔషధంగా మారుతుంది. ఇకపై పసుపు పాలు తాగినా లేదా కూరల్లో వాడినా, అందులో ఒక చిటికెడు మిరియాల పొడి కొద్దిగా నెయ్యి ఉండేలా చూసుకోండి. అప్పుడే పసుపులోని అసలైన యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు మీ చర్మానికి, ఆరోగ్యానికి అందుతాయి.

## ఈ లక్షణాలు ఉంటే

# పైల్స్ వచ్చే అవకాశం ఎక్కువ?



చాలా మందికి రకరకాల సమస్యలు ఉంటాయి. ముఖ్యంగా ఆరోగ్య సమస్యలు. వీటిని నిర్లక్ష్యం చేసినట్లయితే తీవ్రమైన అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. ఇక చాలా మందిలో ఫైల్స్ సమస్య కూడా ఉంటుంది. ఇది కూడా పెద్ద సమస్యే. ముందస్తుగా లక్షణాలను గుర్తించి చికిత్స తీసుకుంటే బాగుంటుందంటున్నారు నిపుణులు. చాలా మంది మలబద్ధ పెద్ద సమస్య కాదని భావిస్తారు. ప్రారంభ దశలో మీరు దానిని నిర్లక్ష్యం చేస్తే దీర్ఘకాలంలో మీకు మూలవ్యాధి వచ్చే అవకాశం ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వృద్ధులు, పిల్లలు, గర్భిణీ స్త్రీలు మాత్రమే కాదు, అన్ని వయసుల వారికి మలబద్ధకం రావచ్చు. వారి ఆహారం దానికి ప్రధాన కారణం. దానిని సరిదిద్దకపోయినా ప్రారంభంలోనే మలబద్ధకం గుర్తించకపోతే అది ఫైల్స్‌గా మారే ప్రమాదం ఎక్కువగా ఉంటుందంటున్నారు నిపుణులు. అరుదుగా లేదా ఎక్కువసేపు మలవిసర్జన జరగడం మలబద్ధకం ప్రధాన లక్షణం. వారానికి మూడు లేదా అంతకంటే తక్కువ మలవిసర్జన జరగడం మలబద్ధకానికి సంకేతం. ఇది ఇలాగే కొనసాగితే మలబద్ధకం వచ్చే అవకాశం ఉంది. మీకు తరచుగా మలవిసర్జనలు జరుగుతున్నా లేదా ప్రతిరోజూ మలవిసర్జనలు జరిగినా, మీ మలవిసర్జన సులభంగా జరగాలి. కానీ మీ మలవిసర్జన గట్టిగా, పొడిగా మారితే అది మలబద్ధకం.

కాఫీ తాగితేనే మలవిసర్జన చేయగలం. మలవిసర్జన చేసే ముందు వేడినీరు తాగకపోతే అస్సలు మలవిసర్జన చేయలేరు. మలవిసర్జన చేసేటప్పుడు నొప్పి లేదా ఇబ్బంది లేకుండా చేయలేరు. ఇలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నట్లయితే ఇది ఖచ్చితంగా మలబద్ధకమేనంటున్నారు నిపుణులు.రోజూ మలవిసర్జన చేసిన తర్వాత కూడా ప్రేగులలో వ్యర్థాలు ఉన్నప్పుడు, అజీర్ణం ఉన్నప్పుడు ఈ సమస్య వస్తుంది. సాధారణంగా మలవిసర్జన తర్వాత కడుపు ఖాళీగా, రిలాక్స్‌గా అనిపిస్తుంది. కానీ మలబద్ధకం సమస్య ఉంటే మలవిసర్జన తర్వాత కూడా కడుపు బరువుగా అనిపిస్తుంది. అది ఖాళీగా అనిపించదు. అసౌకర్యంగా అనిపిస్తుంది. ఇలా జరిగినట్లయితే మీకు ఫైల్స్ వ్యాధి వచ్చే అవకాశాలు ఉంటాయంటున్నారు నిపుణులు.

# మెంతులతో ఆరోగ్య సమస్యలకు సహజ పరిష్కారం



శరీరానికి అవసరమైన మెగ్నీషియం, ఐరన్, ఫైబర్ వంటి పోషకాలు లోపిస్తే అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని నిపుణులు చెబుతున్నారు. మందులు వాడకుండానే సహజంగా ఈ లోపాలను తగ్గించుకునేందుకు మెంతులు ఉపయోగకరమని వైద్యులు తెలిపారు. మెంతులను నానబెట్టి తాగడం, ఇంగువ, ఖర్జూరంతో కలిపి తీసుకోవడం వల్ల జీర్ణ సమస్యలు, పీరియడ్స్ నొప్పులు తగ్గడంతో పాటు చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు. డయాబెటిస్‌కు మెంతి పొడిని తరచుగా ఆహార నిర్వహణలో భాగంగా సిఫార్సు చేస్తారు. మెంతులు కార్బోహైడ్రేట్ శోషణను నెమ్మదిస్తాయి మరియు ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరుస్తాయి. మెంతి గింజలను క్రమం తప్పకుండా ఉపయోగించడం వల్ల వైద్య మార్గదర్శకత్వంలో తీసుకుంటే ప్రీడయాబెటిస్ ఉన్నవారికి ప్రయోజనం చేకూరుతుంది.

# కిడ్నీల్లో రాళ్లు ఉన్నాయా?

## ఈ సహజ పానీయం వరం లాంటిదే!



ప్రతి సీజన్‌లోనూ మనకు లభించే అద్భుతమైన పానీయం కొబ్బరి నీరు. దీనిని ప్రకృతి సిద్ధమైన ఎనర్జీ డ్రింక్ అని పిలుస్తారు. ఎటువంటి రసాయనాలు లేదా అదనపు చక్కెరలు లేని ఈ స్వచ్ఛమైన నీరు మన శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లను పుష్కలంగా అందిస్తుంది. కేవలం దాహం తీర్చుకోవడమే కాకుండా, తల నుండి కాలి గోటి వరకు ఆరోగ్యానికి ఈ నీరు ఒక వరప్రదాయినిలా పనిచేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కొబ్బరి నీళ్లలో పొటాషియం, సోడియం, మెగ్నీషియం కాల్షియం వంటి ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంలో నీటి సమతుల్యతను కాపాడుతూ హైడ్రేటెడ్‌గా ఉంచుతాయి. ముఖ్యంగా జీర్ణక్రియను మెరుగుపరచడంలో, రక్తపోటును నియంత్రించడంలో సహజమైన చర్మ సౌందర్యాన్ని పెంచడంలో దీనికి సాటిలేదు. బరువు తగ్గాలనుకునే వారికి మరియు జిమ్ వెళ్ళేవారికి ఇది ఒక ఉత్తమమైన ప్రత్యామ్నాయం. సహజ ఎలక్ట్రోలైట్: వ్యాయామం చేసినప్పుడు లేదా ఎండలో తిరిగినప్పుడు శరీరం కోల్పోయిన ఖనిజాలను కొబ్బరి నీరు తక్షణమే తిరిగి నింపుతుంది. ఇది అలసటను తగ్గించి శక్తిని ఇస్తుంది. జీర్ణ వ్యవస్థకు మేలు: ఆమ్లత్వం, గ్యాస్ మరియు మలబద్ధకం వంటి సమస్యలతో బాధపడేవారికి కొబ్బరి నీరు అద్భుతంగా పనిచేస్తుంది. ఇది పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. బరువు నియంత్రణ: ఇందులో కేలరీలు చాలా తక్కువ. ఇది తాగడం వల్ల కడుపు నిండిన అనుభూతి కలిగి, అనారోగ్యకరమైన స్నాక్స్ వైపు మనసు వెళ్లకుండా చేస్తుంది. గుండె ఆరోగ్యం: పొటాషియం అధికంగా ఉండటం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. ఇది చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండెపై ఒత్తిడిని తగ్గిస్తుంది. కిడ్నీ పనితీరు: ఇది ఒక సహజ మూత్రవిసర్జనకారి. శరీరం నుండి విషాలను బయటకు పంపి, కిడ్నీల పనితీరును మెరుగుపరుస్తుంది. చర్మ సౌందర్యం: ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మానికి సహజమైన మెరుపును ఇస్తాయి. ముఖంపై ముడతలను తగ్గించి యవ్వనంగా కనిపించేలా చేస్తాయి.

# ఛీ.. తూ.. ఇదీ ఒక గెలుపేనా..

## పాకిస్తాన్ జట్టును పొట్టుపొట్టు తిడుతున్న ఫ్యాన్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** గెలిచినా తిడతారు.. ఓడినా తిడతారు.. ఆడినా తిడతారు.. ఆడకపోయినా తిడతారు.. పాకిస్తాన్ జట్టు దుస్థితి ఇలా ఉంది. టీ 20 వరల్డ్ కప్ ఫస్ట్ డే.. గ్రూప్ ఏలో ఉన్న పాక్ జట్టు.. ఫస్ట్ మ్యాచ్ గా నెదర్లాండ్స్ టీంపై ఆడింది. పాకిస్తాన్ గెలిచింది. గెలిస్తే సంబరాలు చేసుకోవాలి కదా.. మరి తిడతారు ఏంటీ అంటారు.. అక్కడికే వస్తున్నాం.. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన నెదర్లాండ్స్ జట్టు 20 ఓవర్లలో 147 పరుగులు చేసింది. ఆ తర్వాత 148 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగింది పాకిస్తాన్. నెదర్లాండ్స్ జట్టు.. పిల్ల బచ్చా టీం.. క్రికెట్‌లో పిల్లకూన జట్టు.. పాకిస్తాన్ ఏమో పెద్ద పులి లెక్క ఫీలయ్యారు పాక్ ఫ్యాన్స్.. గ్రౌండ్‌లో సీన్ రివర్స్ అయ్యింది.. పాకిస్తాన్ జట్టు.. 148 పరుగుల టార్గెట్ ఛేజ్ చేయటానికి ఏకంగా 20 ఓవర్ల 3 బంతులు తీసుకుంది. అంటే జస్ట్ మూడు బంతులు మిగిలి ఉండగా.. టార్గెట్ ఛేజ్ చేసి గెలిచింది. ఇక్కడే పాకిస్తాన్ జనం.. పాక్ క్రికెట్ అభిమానులు రగిలిపోయారు..పిల్లకూన నెదర్లాండ్స్ .. 148 పరుగుల టార్గెట్ ఛేజ్ చేయటానికి 19 ఓవర్లు తీసుకోవటం ఏంటీ.. అంటే చచ్చీచెడీ.. కష్టపడి గెలవటం ఏంటీ... నెదర్లాండ్స్ బౌలర్లు అంతలా పాక్ జట్టును వణికించారా.. ఇలా అయితే మిగతా జట్లతో ఇంకేం ఆడతారు.. అంటూ తిట్టిపోస్తున్నారు పాకిస్తాన్ జనం.. ఫ్యాన్స్.. 2026లో పాకిస్తాన్ జట్టు బోణీ కొట్టింది. నెదర్లాండ్స్‌శ్రీపై 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న పాక్.. నెదర్లాండ్స్ జట్టును 19.5 ఓవర్లలో 147 పరుగులకు కట్టడి చేసింది. నెదర్లాండ్స్ జట్టు ఏడు వికెట్లు నష్టపోయి పాక్ ముందు 148 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. పాకిస్తాన్ జట్టు ఏడు వికెట్ల నష్టానికి 19.3 ఓవర్లకే 148 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది.

పాక్ బ్యాటర్లలో ఫర్హాన్ 47 పరుగులతో రాణించాడు. ఫహీమ్ అష్రఫ్ 29 (నాటౌట్), అయూబ్ 24, బాబర్ అజమ్ 15, సల్మాన్ అఘా 12, మహ్మద్ నవాజ్ 6, షాహిద్ అఫ్రీదీ 5 (నాటౌట్)గా నిలిచారు. నెదర్లాండ్స్ బ్యాటర్లలో స్కాట్ ఎడ్వర్డ్ 37, బాస్ డి లీడే 30, మైకేల్ లెవిట్ 24, ఆర్యన్ దత్ 13 పరుగులు చేశారు. పాక్ బౌలర్లలో సల్మాన్ మీర్జాకు 3 వికెట్లు, మహ్మద్ నవాజ్ 2, అబ్రార్ అహ్మద్ 2, అయూబ్ 2, అఫ్రీదీకి ఒక వికెట్ దక్కింది. నెదర్లాండ్స్ బౌలర్లలో ఆర్యన్ దత్ 2, పాల్ వాన్ మికరెన్‌శ్రీకు 2, వాన్ బీక్, కైల్ క్లైన్, రోలోఫ్ వాన్ డెర్ మెర్వేకు తలో వికెట్ దక్కింది.

# టీ20 వరల్డ్ కప్: రాణించిన హెట్మెయర్... విండీస్ 20 ఓవర్లలో 182-5

**టీ20 వరల్డ్ కప్ లో వెస్టిండీస్ వర్సెస్ స్కాట్లాండ్**


**టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న స్కాట్లాండ్**

**20 ఓవర్లలో 5 వికెట్లకు 182 పరుగులు చేసిన వెస్టిండీస్**



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా స్కాట్లాండ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు భారీ స్కోరు సాధించింది. మిడిలార్డర్ బ్యాటర్ షిమ్రోన్ హెట్మెయర్ (64) హాఫ్ సెంచరీతో చెలరేగడంతో, నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. ఫలితంగా స్కాట్లాండ్ ముందు 183 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన స్కాట్లాండ్ కెప్టెన్ బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్‌కు ఓపెనర్లు బ్రాండన్ కింగ్ (35), షాయ్ హోప్ (19) ఓ మోస్తరు ఆరంభాన్ని ఇచ్చారు. అయితే, ఆ తర్వాత షిమ్రోన్ హెట్మెయర్ స్కాట్లాండ్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 36 బంతుల్లో 2 ఫోర్లు, 6 భారీ సిక్సర్లతో 64 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అతనికి రోవ్‌మన్ పావెల్ (24), షెర్ఫాన్ రూథర్‌ఫర్డ్ (26) కూడా వేగంగా ఆడి తమ వంతు సహకారం అందించారు. స్కాట్లాండ్ బౌలర్లలో బ్రాడ్ కర్రీ అద్భుతంగా బౌలింగ్ చేసి, 4 ఓవర్లలో కేవలం 23 పరుగులిచ్చి 2 కీలక వికెట్లు పడగొట్టాడు. సఫ్యాన్ షరీఫ్, మైఖేల్ లీస్క్, డేవిడ్‌సన్ తలో వికెట్ తీశారు. అనంతరం 183 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన స్కాట్లాండ్ ఆరంభంలోనే వికెట్ కోల్పోయింది. తాజా సమాచారం అందేసరికి స్కాట్లాండ్ 2.4 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 19 పరుగులతో ఆడుతోంది. జేసన్ హోల్డర్ బౌలింగ్‌లో మైఖేల్ జోన్స్ (1) ఔటయ్యాడు.

# రంగంలోకి శ్రీలంక.. భారత్‌తో మ్యాచ్‌పై పునరాలోచనలో పాకిస్థాన్?






**భారత్‌తో మ్యాచ్ బాయ్‌కాట్‌పై పునరాలోచించాలని పాక్‌ను కోరిన శ్రీలంక**

**మ్యాచ్ జరగకపోతే తీవ్ర ఆర్థిక నష్టాలు తప్పవన్న శ్రీలంక క్రికెట్ బోర్డు**

**శ్రీలంక అభ్యర్థనపై తమ ప్రభుత్వంతో మరోసారి సంప్రదిస్తామన్న పీసీబీ**

**సోమవారం నాటికి ఈ అంశంపై తుది నిర్ణయం వెలువడే అవకాశం**

**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేయాలన్న నిర్ణయంపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) పునరాలోచనలో పడింది. ఈ మ్యాచ్‌ను నిర్వహించకపోతే తీవ్రంగా నష్టపోతామని టోర్నీ సహ ఆతిథ్య దేశమైన శ్రీలంక విజ్ఞప్తి చేయడంతో... పీసీబీ ఈ అంశాన్ని మరోసారి తమ ప్రభుత్వంతో సంప్రదించాలని భావిస్తోంది. ఈ నెల 15న కొలంబో వేదికగా భారత్, పాకిస్థాన్ మధ్య జరగాల్సిన మ్యాచ్‌ను బహిష్కరించొద్దని కోరుతూ శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ) పీసీబీకి ఒక ఈమెయిల్ పంపింది. ఈ కీలక మ్యాచ్ రద్దయితే తమ బోర్డుకు గేట్ మనీ, హాస్పిటాలిటీ అమ్మకాల రూపంలో భారీ ఆర్థిక నష్టం వాటిల్లుతుందని ఎస్ఎల్‌సీ అధ్యక్షుడు షమ్మీ సిల్వా.. పీసీబీ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీకి నేరుగా వివరించారు. అంతేకాకుండా ఇది శ్రీలంకలో టోర్నమెంట్ ప్రతిష్ఠను దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

శ్రీలంకతో పాకిస్థాన్‌కు ఉన్న స్నేహపూర్వక సంబంధాల దృష్ట్యా వారి అభ్యర్థనను తేలిగ్గా తీసుకోలేమని పీసీబీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం దేశంలో లేని మొహ్సిన్ నఖ్వీ, తిరిగి వచ్చాక ఈ విషయాన్ని పాక్ ప్రధాని దృష్టికి తీసుకెళతానని షమ్మీ సిల్వాకు హామీ ఇచ్చారు. శ్రీలంక విజ్ఞప్తిని పాకిస్థాన్ తిరస్కరించిందంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదని, సోమవారం నాటికి దీనిపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. వాస్తవానికి పాకిస్థాన్ జట్టు టీ20 వరల్డ్ కప్‌లో ఆడేందుకు ఆ దేశ ప్రభుత్వం అనుమతి ఇచ్చినా, భారత్‌తో మ్యాచ్ ఆడకుండా నిబంధన విధించింది. దీంతో పీసీబీ ఈ మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేస్తున్నట్టు ప్రకటించింది. గతంలో పాకిస్థాన్ పర్యటనలో తమ ఆటగాళ్లకు భద్రతాపరమైన ఆందోళనలు ఎదురైనప్పుడు, శ్రీలంక ప్రభుత్వం తమ జట్టును వెనక్కి పిలవకుండా టూర్‌ను పూర్తి చేసేలా ఆదేశించిందని, ఈ నేపథ్యంలో శ్రీలంక విజ్ఞప్తికి ప్రాధాన్యం ఏర్పడిందని విశ్లేషకులు అంటున్నారు.

# సొంత సంపాదన : ఈ టాలీవుడ్ హీరోల ఆస్తి ఎన్ని కోట్లంటే?

టాలీవుడ్ హీరోలు అంటే కేవలం వెండితెరపై మెరిసే నటులే కాదు, వారు పక్కా బిజినెస్ మైండ్ ఉన్న సంపన్న వ్యక్తులు కూడా. సినిమాల ద్వారా వచ్చే రెమ్యూనరేషన్‌తో పాటు రియల్ ఎస్టేట్, స్టూడియోలు, బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్ మరియు సొంత వ్యాపారాల ద్వారా వీరు భారీగా ఆర్జిస్తున్నారు. మన అభిమాన హీరోల సంపాదన ఏ స్థాయిలో ఉంది? బాక్సాఫీస్ వద్దే కాకుండా ఆస్తుల విషయంలోనూ ఎవరెవరు ఏ స్థానాల్లో ఉన్నారో తెలుసుకోవాలనే ఆసక్తి ప్రతి అభిమానికి ఉంటుంది. ఆ వివరాలు ఇప్పుడు చూద్దాం.

**అగ్రస్థానంలో సీనియర్ స్టార్స్:**

టాలీవుడ్‌లో అత్యధిక ఆస్తులు కలిగిన హీరోల జాబితాలో కింగ్ నాగార్జున అగ్రస్థానంలో నిలుస్తారు. అన్నపూర్ణ స్టూడియోస్, కన్వెన్షన్ సెంటర్లు , ఇతర వ్యాపారాల ద్వారా ఆయన ఆస్తి సుమారు రూ. 800 నుండి 900 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఇక మెగాస్టార్ చిరంజీవి సుమారు రూ. 650 నుండి 700 కోట్ల ఆస్తులతో రెండో స్థానంలో ఉన్నారు. దశాబ్దాలుగా ఇండస్ట్రీని ఏలుతున్న ఈ సీనియర్ హీరోలు కేవలం సినిమాల ద్వారానే కాకుండా, తెలివైన పెట్టుబడులతో తమ సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు. వారి వెనకే విక్టరీ వెంకటేష్ (రూ. 120-150 కోట్లు), నందమూరి బాలకృష్ణ (రూ. 100-120 కోట్లు) కూడా భారీ స్థిరాస్తులతో కొనసాగుతున్నారు.







**గ్లోబల్ స్టార్స్ మరియు యువ హీరోల జోరు:**

ప్రస్తుత తరం హీరోల్లో మహేష్ బాబు, అల్లు అర్జున్, రామ్ చరణ్ మరియు ప్రభాస్ పోటాపోటీగా ఉన్నారు. మహేష్ బాబు తన సినిమాలతో పాటు ఏఎంబీ సినిమాస్, పలు బ్రాండ్ యాడ్స్ ద్వారా రూ. 350 నుండి 400 కోట్ల ఆస్తిని కలిగి ఉన్నారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ రూ. 350-370 కోట్లు, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ రూ. 350 కోట్లు, మరియు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కూడా దాదాపు రూ. 350 కోట్ల మేర ఆస్తులు కలిగి ఉన్నట్లు సమాచారం. ఈ హీరోలు ఒక్కో సినిమాకు తీసుకునే భారీ రెమ్యూనరేషన్ వారి ఆస్తుల పెరుగుదలకు ప్రధాన కారణం అవుతోంది.

**మాస్ హీరోల ఆర్థిక సామ్రాజ్యం:**

మాస్ హీరోలుగా పేరు తెచ్చుకున్న జూనియర్ ఎన్టీఆర్ మరియు పవన్ కళ్యాణ్ కూడా ఆర్థికంగా బలంగానే ఉన్నారు. తారక్ ఆస్తి విలువ సుమారు రూ. 250 నుండి 300 కోట్ల వరకు ఉండగా, జనసేనాని పవన్ కళ్యాణ్ ఆస్తుల విలువ రూ. 200 నుండి 250 కోట్ల మధ్య ఉంటుందని అంచనా. వీరు కేవలం నటులుగానే కాకుండా వివిధ సామాజిక, రాజకీయ కార్యక్రమాల్లో యాక్టివ్‌గా ఉంటూనే, తమ సంపాదనను పక్కాగా ప్లాన్ చేసుకుంటున్నారు. మొత్తానికి టాలీవుడ్ స్టార్స్ బాక్సాఫీస్ కలెక్షన్ల రేసులోనే కాదు, వ్యక్తిగత ఆస్తుల విషయంలో కూడా రికార్డులు సృష్టిస్తున్నారు.

ఈ గణాంకాలను చూస్తుంటే టాలీవుడ్ హీరోలు కేవలం నటనకే పరిమితం కాకుండా, ఒక పక్కా వ్యూహంతో తమ ఆర్థిక భవిష్యత్తును నిర్మించుకుంటున్నారని అర్థమవుతోంది.



**పింక్ సాక్షి మాలిక్ సాఫ్ట్ గ్లామ్ మూమెంట్‌లో అందంగా ఉంది**



**నభా నటేష్ బ్లూ డ్రీమ్స్ మీకు నిద్రలేని రాత్రులను అందిస్తాయి**

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965